Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 191 మేడ్చల్ మల్కాజ్‌గిరి 1 ఆగస్టు 2023 మంగళవారం పేజీలు : 4

## అమెరికాలో ఒక కుటుంబానికి ఒక రైస్ బ్యాగే

న్యూఢిల్లీ: బియ్యం ఎగుమతులపై భారత్ ఆంక్షలు విధించడంతో అమెరికాలోని ప్రవాస భారతీయులు (ఎన్నారై) సహా ఆసియా దేశాలకు చెందిన పౌరులు తిండిగింజల కోసం తిప్పలు పడుతున్నారు. ఏక్షణంలో అయినా అమెరికాలో ప్రస్తుతం ఉన్న బియ్యం నిల్వలు నిండుకుంటాయన్న ప్రచారంతో మరింత ఆందోళన చెందుతున్నారు. మరోవైపు రిటైల్ వ్యాపారులు అమ్మకాలపై నియంత్రణ విధించారు. 'ఒక కుటుంబానికి ఒక రైస్ బ్యాగ్' నిబంధనను అమలు చేస్తున్నారు. ఈ మేరకు దుకాణాల ముందు బోర్డులు ఏర్పాటు చేశారు. దీంతో కనీసం ఒక్క బ్యాగునైనా దక్కించుకుందామన్న ఉద్దేశంతో ఎన్నారైలు సహా ఆసియా దేశాల ప్రజలు ఆ యా దుకాణాల ముందు భారీ ఎత్తున క్యూకట్టారు. భా రత ప్రభుత్వం బియ్యం ఎగుమతులపై ఆంక్షలు విధిం చిన విషయం తెలిసిన మరుక్షణమే ఎన్నారైలు ఏడాదికి సరిపడా బియ్యాన్ని కొనుగోలు చేసి నిల్వ చేసుకోవాలని భావించారు. కానీ, వ్యాపారులు ఒక కుటుంబానికి ఒక రైస్ బ్యాగ్ నిబంధనను కఠినంగా అమలు చేస్తుండడంతో వీరిలో ఆందోళన వ్యక్తమవుతోంది.



# 'గెలుపు గుర్రాలకే'

## టికెట్ల ఖరారుపై కాంగ్రెస్ హైకమాండ్ క్లారిటీ...!!

హైదరాబాద్ : తెలంగాణలో పార్టీ పరిణామాలను హైకమాండ్ నిశితంగా పరిశీలిస్తోంది. నేతల వ్యవహార శైలి పైన కన్నేసింది. కర్ణాటక తరువాత తెలంగాణ తమ లక్ష్యంగా కాంగ్రెస్ స్పష్టం చేస్తోంది. ప్రతీ నిర్ణయం ఆచితూచి తీసుకుంటోంది. క్షేత్ర స్థాయి పరిస్థితులు..నేతల వ్యాఖ్యల పైన ఎప్పటికప్పుడు సమాచారం సేకరిస్తోంది. పార్టీ మేనిఫెస్టో మొదలు టికెట్ల ఖరారు పైనా తాజాగా పార్టీ నేతలకు కీలక దిశా నిర్దేశం చేసింది.

టికెట్ల పైన అంతిమ నిర్ణయం పార్టీ హైకమాండ్ దేనని కీలక నేతలకు తేల్చి చెప్పింది. తెలంగాణపై కాంగ్రెస్ నజర్: తెలంగాణలో పార్టీ పరిణామాలపైన సర్వే సంస్థలు...వ్యూహకర్తలు ఎప్పటికప్పుడు హైకమాండ్ కు నివేదికలు ఇస్తున్నారు. అందులో భాగంగా కొందరు నేతలు తమ అనుయాయులు..అనుచరవర్గానికి టికెట్ల పైన హామీలు ఇస్తున్న వ్యవహారం పార్టీ అధినాయకత్వం వద్దకు చేరింది. దీని పైన తాజాగా హైకమాండ్ ముఖ్యులను కలిసిన పార్టీ నేతలకు తమ వైఖరి స్పష్టం చేసింది. ఎలాగైనా అధికారంలోకి రావటమే లక్ష్యంగా మినిట్ టు మినిట్ పార్టీ వ్యవహారాల పైన మైక్రో లెవల్ నుంచి సమాచారం సేకరిస్తోంది. టీపీసీసీ చీఫ్ నుంచి ఏ నేత పార్టీకి ఇబ్బంది కలిగించేలా వ్యవహరించినా ఉపేక్షించేది లేదని స్పష్టం చేస్తోంది. ఇదే సమయంలో తెలంగాణలో గత తొమ్మిదేళ్ల కాలంగా బీఆర్ఎస్ ప్రభుత్వం పైన అన్ని వర్గాల ప్రజల్లోనూ వ్యతిరేకత పెరిగిన అంశాన్ని సర్వే సంస్థలు కాంగ్రెస్ హైకమాండ్ కు నివేదికలు ఇచ్చాయి.

**టికెట్ల పంపిణీపై క్లారిటీ:** అనుగుణంగా ఏ ఒక్కరినీ విస్మరించకుండా అందిరికీ సముచిత ప్రాధాన్యత ఇచ్చేలా మేనిఫెస్టో రూపకల్పనకు పార్టీ సిద్దం అవుతోంది. బీఆర్ఎస్ పైన ఏ వర్గాల్లో వ్యతిరేకత ఉందనేది పార్టీ ఆరా తీస్తోంది.

పేదలు, మధ్యతరగతి, అన్ని వర్గాల ప్రజలను ఆకట్టుకొనేలా మేనిఫెస్టో సిద్దం చేయాలని నిర్ణయం తీసుకుంది. పార్టీ టికెట్ల పైన కొందరు నేతలు హామీలు ఇస్తున్నట్లుగా వస్తున్న వార్తల పై హైకమాండ్ ప్రత్యేకంగా ఫోకస్ చేసింది. కొందరు ముఖ్య నేతలు తామే టికెట్లు ఇప్పిస్తామంటూ చెబుతున్న మాటల ను హైకమాండ్ సీరియస్ గా తీసుకుంది. గెలుపే ప్రామాణికంగా అభ్యర్థుల ఎంపిక ఉంటుందని ఖరాఖండిగా పార్టీ ముఖ్య నేతలకు తేల్చి చెప్పింది. నేతల సిఫార్సులకు ప్రాధాన్యత ఉండదని స్పష్టం చేసింది. నేతల వారసులకు కానీ, ముఖ్యుల అనుచరులకు కానీ టికెట్లు ఇచ్చే అవకాశం లేదంటూ పార్టీ నాయకత్వం తేల్చేసింది. దేశంలో ఐదేళ్ల ఎన్ని కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారంటే? సిఫార్సులకు నో: ప్రాంతీయ..సామాజిక సమీకరణాలను పరిగణలోకి తీసుకొన్ని అన్ని వర్గాలకు ప్రాధాన్యత ఇస్తూనే గెలుపు మాత్రమే లక్ష్యంగా టికెట్ల ఖరారు ఉంటుందని తేల్చేసింది. ముఖ్య నేతలకు మద్దతుగా నిలిస్తే టికెట్లు ఖాయమనే భావనలో ఉన్న నేతలకు పార్టీ తాజా నిర్ణయం మింగుడు పడటం లేదు. ప్రజలతో మమేకం అయిన నేతలకు..కార్యకర్తల్లో గుర్తింపు ఉన్న వారికే ప్రాధాన్యత ఉంటుందని దిశా నిర్దేశం చేసింది.

ఈ సారి తెలంగాణలో కాంగ్రెస్ గెలుపును పార్టీ అధినాయకత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. టికెట్ల విషయం లో ఏ ఒక్కరికీ అధికారం, సిఫార్సులకు అవకాశం లేకుండా క్షేత్ర స్థాయి సమాచారం, పార్టీకి చేసిన సేవ, ప్రజల్లో పలుకుబడి, ప్రజల్లో గ్రాఫ్, కార్యకర్తలతో సంబంధాలు ఇలా అన్ని అంశాల ను పరిగణలోకి తీసుకొని టికెట్ల ఖరారు ఉంటుందని పార్టీ నాయకత్వం స్పష్టం చేసింది.

ఇప్పుడు పార్టీ తాజాగా తీసుకున్న ఈ నిర్ణయం కాంగ్రెస్ ముఖ్య నేతల్లో హాట్ టాపిక్ గా మారింది.

## ఆ మూడు పార్టీల డీఎన్ఏ ఒకటే



మహబూబ్‌నగర్: బీజేపీ చేపట్టే ఏ పోరాటమైనా పాలమూరు నుంచే ఆరంభించటం ఆనవాయితీ అని తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డి అన్నారు. సోమవారం జిల్లాలోని క్లాక్ టవర్ వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభలో కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. పాలమూరు నుంచే డబల్ బెడ్ రూం సమస్యలపై నిరసన ర్యాలీ చేపట్టామన్నారు. ప్రజల సొమ్ముతో కేసీఆర్ 10 ఎకరాల్లో ఇల్లు కట్టుకున్నారని వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ – కాంగ్రెస్ కుమ్మక్కై పార్టీ కార్యాలయాలకు జాగాలిస్తారని.. కాని పాలమూరులో ఉన్న పేదలకు ఇళ్లు కట్టరని మండిపడ్డారు. 9 ఏళ్లలో ఇచ్చిన హామీలను కేసీఆర్ విస్మరించారన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఇచ్చిన రేషన్ కార్డులే తప్ప కేసీఆర్ సర్కారుకు పేదలకు రేషన్ కార్డులిచ్చే సోయి లేదని విమర్శించారు. రాష్ట్రాన్ని కల్వకుంట్ల కుటుంబం దోచుకుంటోందని ఆరోపించారు. దళితులకు వెన్నుపోటు పొడిచి సీఎం పీఠంపై కూర్చున్న ఘనత కేసీఆర్ ది అని ఆయన అన్నారు. 9 ఏళ్లలో ఒక్క పోస్టుకూడా భర్తీ చేయలేదన్నారు. 30 లక్షల మంది నిరుద్యోగ యువత ఆకలిమంటల్లో ఉన్నారని తెలిపారు. పేపర్ లీక్‌తో నిరుద్యోగులు ఆవేదనలో ఉన్నారన్నారు. ప్రజలను మోసం చేసిన చరిత్ర కేసీఆర్ ది అని వ్యాఖ్యలు చేశారు. రైతు రుణ మాఫీ ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. అప్పులు కట్టలేక డిఫాల్టర్‌గా మారటం వల్ల రైతులకు అప్పు పుట్టటం లేదన్నారు. బంగారు తెలంగాణ దేవుడెరుగు, కానీ కేసీఆర్ కుటుంబం బంగారమైందన్నారు. తెలంగాణలో అభివృద్ధి కుంటుపడిందని అన్నారు.

ప్రజలను మోసం చేయటం కోసమే పార్టీ పెట్టారని.. సీఎం అయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు. లిక్కర్ తెలంగాణగా, అప్పుల తెలంగాణగా మార్చారని మండిపడ్డారు. తెలంగాణలో మార్పు రావలసిన అవసరం ఉందన్నారు. ప్రశ్నిస్తే ప్రతిపక్షాల మీద కేసులు పెడుతున్నారన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్, ఎంఐఎం ఈ మూడు పార్టీలు కుటుంబ పార్టీలంటూ విరుచుకుపడ్డారు. మూడు పార్టీల డీఎన్ఏ ఒకటే అన్నారు. ఈ మూడు పార్టీలు ఉమ్మడి పౌరస్మృతిని వ్యతిరేకిస్తున్నాయని కిషన్ రెడ్డి వ్యాఖ్యలు చేశారు.

## బీజేపీకి ఖమ్మం అచ్చిరావటం లేదా ?




ఖమ్మం జిల్లాలో ఉనికి చాటుకోవాలని బీజేపీ చాలా ప్రయత్నాలు చేస్తోంది. ఇందుకు కేంద్ర హెూంశాఖ మంత్రి అమిత్ షా ను పిలిపించాలని ప్రయత్నాలు చేస్తోంది. అమిత్ షా తో భారీ బహిరంగ సభను ఏర్పాటుచేసి పార్టీ బలోపేతానికి శ్రీకారం చుట్టాలన్నది బీజేపీ ప్లాన్ కానీ బీజేపీ ప్రయత్నాలకు కాలమే సహకరించటంలేదు. ఎందుకంటే ఈనెల 29వ తేదీన పెద్ద బహిరంగసభ ఏర్పాటు చేసినట్లు, దానికి అమిత్ షా పాల్గొంటున్నట్లు ప్రకటించిన రెండు రోజుల్లోనే రద్దు చేస్తున్నట్లు పార్టీ ప్రకటించింది. బహిరంగసభ రద్దుకు కారణం ఏమిటంటే భారీ వర్షాలే. ఇపుడే కాదు గతంలో కూడా రెండుసార్లు బహిరంగసభలు ఏర్పాటుచేసి వాతావరణం అనుకూలించక సభలను రద్దుచేశారు. మూడుసార్లు వరుసగా అమిత్ షా బహిరంగసభలే రద్దవుతున్నాయి. మళ్ళీ బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు ఏర్పాటుచేసుకున్న బహిరంగసభలు, కార్యక్రమాలు మాత్రం బ్రహ్మాండంగా జరుగుతున్నాయి. బీజేపీకి మాత్రం వాతావరణం అడ్డువస్తోందంటే పార్టీకి ఖమ్మం జిల్లా అచ్చిరాలేదనే సెటైర్లు ఎక్కువైపోతున్నాయి. నిజానికి జిల్లాలో పార్టీ ఉనికి అంతంతమాత్రమే. రాబోయే ఎన్నికల్లో తెలంగాణాలో అధికారంలోకి రావటం ఖాయమనే ఊపు ఒకపుడు వచ్చేసింది. అదే పద్దతిలో ఖమ్మం జిల్లాలో కూడా కొందరు నేతలు కాస్త హడావుడి చేశారు. అయితే రాష్ట్రంలో చప్పబడిపోయినట్లే జిల్లాలో కూడా చప్పబడిపోయింది. జిల్లాలో అసలే పార్టీ ఉనికి అంతంతమాత్రం. ఇంతోటిదానికి చప్పబడిపోయిందంటే మళ్ళీ ఉత్సాహం వచ్చేదెలా ? అందుకనే అమిత్ షా ను పిలిపించాలని నేతలు గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. కానీ ఎందుకో వాతావరణమే సహకరించటంలేదు. ఇప్పటికిప్పుడు ఎన్నికలు అంటే జిల్లాలోని 10 నియోజకవర్గాల్లో పోటీచేసేంత సీనున్న గట్టి నేతలు ఒక్కళ్ళు కూడా లేరు. జిల్లా కలెక్టరేట్ల దగ్గర ధర్నా అంటేనే 50, 100 మందికన్నా కనబడరు. అలాంటిది ఇక ఎన్నికల్లో పోటీ అంటే చెప్పేదేముంది ? అందుకనే ఇతర ప్రార్టీల్లోని నేతల కోసం గేలమేసినా ఎవరు తగల్లేదు. చాలాకాలం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి మీద చాలా ఆశలే పెట్టుకున్నది పార్టీ. అయితే పొంగులేటేమో చివరలో కాంగ్రెస్ లో చేరిపోయారు. ఏం చేస్తాం కొన్నిసార్లు అలా జరుగుతుంటాయంతే.

# టీఆర్ఎస్‌లో టికెట్ల కొట్లాట



## ఒక్కో నియోజకవర్గంలో ఇద్దరు ముగ్గురు ఆశావహులు

## తారా స్థాయికి చేరిన అసంతృప్తి

హైదరాబాద్ : తెలంగాణలో ఎన్నికలు దగ్గరపడుతున్న కొద్దీ అన్ని పార్టీలకు టెన్షన్ పెరిగిపోతోంది. నియోజకవర్గాలపై దృష్టి, సీట్ల కేటాయింపు, వర్గ పోరు, అసంతృప్తి సెగలు.. ఇలా ఎన్నో సమస్యలు. అధికార బీఆర్ఎస్ పార్టీకీ ఈ ఇబ్బందులు తప్పడం లేదు. ఇంకా చెప్పాలంటే ఈ పార్టీలోనే ఈ సమస్య ప్రధానంగా ఉందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. చాలా నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ టికెట్ కోసం కొట్లాట జరుగుతోందని అంటున్నారు. బీఆర్ఎస్ పార్టీ టికెట్ ఇవ్వకపోతే ఇతర పార్టీల్లో చేరేందుకూ ఈ నాయకులు ఏర్పాట్లు చేసుకుంటున్నారని సమాచారం. తాండూర్‌లో ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి మధ్య టికెట్ కోసం విభేదాలున్నాయని తెలిసిందే. తనకు టికెట్ దక్కకపోతే మహేందర్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరాలని చూస్తున్నారని సమాచారం. స్టేషన్ ఘన్‌పూర్‌లో ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి ఇప్పటికే బహిరంగంగా పరస్పర విమర్శలు చేసుకుంటున్నారు. కోదాడలో ఎమ్మెల్యే మల్లయ్య యాదవ్‌పై సీనియర్ నేతలు అసంతృప్తితో ఉన్నారు. మహేశ్వరంలో మంత్రి సబితా ఇంద్రారెడ్డితో విభేదాల కారణంగా తీగల కృష్ణారెడ్డి కాంగ్రెస్ కండువా కప్పుకునేందుకు సిద్ధమయ్యారని తెలుస్తోంది. అలాగే ఆసిఫాబాద్, వర్ధన్నపేట, నర్సంపేట, వరంగల్ తూర్పు, ముధోల్, చెన్నూర్, బెల్లంపల్లి, నాగార్జున సాగర్, నల్గొండ, నకిరేకల్, రామగుండం.. ఇలా చెప్పుకుంటూ పోతే రాష్ట్రంలోని చాలా నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యేలపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. సొంత పార్టీ నాయకుల నుంచే వీళ్లు అసంతృప్తి ఎదుర్కుంటున్నారు. తమ పార్టీ ఎమ్మెల్యేలకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాలు, యాత్రలు నిర్వహిస్తుండడం గమనార్హం. ఇంద్రకరణ్‌రెడ్డి లాంటి పలువురు మంత్రులకూ ఈ అసంతృప్తి సెగ తప్పడం లేదు. ఇలాంటి నియోజకవర్గాల్లో సిట్టింగ్ ఎమ్మెల్యేలకు కాకుండా తమకే టికెట్ ఇవ్వాలంటూ ఇతర సీనియర్ నాయకులు పట్టుబడుతున్నారు. మరి ఈ అసంతృప్తులను కేసీఆర్ ఎలా ఎదుర్కుంటారో చూడాలి.

# సంపాదకీయం

## 'చావోస్ జీపీటీ' ఏంటి?
### ఎందుకు మనుషులను చంపుతానంటోంది?

ఓపెన్ ఏఐ రూపొందించిన విప్లవాత్మక ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఇప్పుడు ప్రపంచాన్ని భయపెడుతోంది. ఈ అత్యాధునిక టెక్నాలజీ వల్ల చాలా మంది ఉద్యోగాలు పోవడంతోపాటు ఇది మానవాళి వినాశనానికి దారితీయవచ్చన్న ప్రచారం సాగుతోంది. కృత్రిమ మేధస్సు (ఏఐ) – ఆధారిత చాట్ జీపీటీని ప్రారంభించినప్పటి నుండి వెనక్కి తిరిగి చూసుకోలేదు. ప్రతి రోజూ ఒక కొత్త చాట్బాట్ ఇంటర్నెట్లోకి ప్రవేశిస్తుంది. చాలా వరకు సాధారణ కార్యాలయ పనులలో సహాయపడే నిఫ్టీ సాధనాలు అయితే కొన్ని సాదాసీదాగా ఉంటున్నాయి. మరికొన్ని శోధనలకు తమను తాము అద్భుతంగా కలిగి ఉంటాయి. ఏఐ విప్లవం చాలా మంది ఉద్యోగాలు పోవడానికి కారణమైంది. ఇలాంటి చాట్బాట్ల పెరుగుదల ఆందోళన కలిగిస్తోంది. ఇప్పటికి ఏఐ చాట్బాట్లు వివిధ రకాల పనులతో మానవాళికి సహాయం చేయడమే కాకుండా అనేక ప్రమాదాలను కూడా కలిగిస్తాయని నిర్ధారించబడింది. మానవాళికి బెదిరింపులకు గురిచేస్తూ మరో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ భయపెడుతోంది. ఈ కొత్త చాట్బాట్ ఇటీవల వెలుగులోకి వచ్చింది. చావోస్ జీపీటీ అని పిలువబడే ఏఐ – ఆధారిత చాట్బాట్ కు ఏ మానవత్వం లేదని తెలిపింది. తాను మనవాళిని నాశనం చేస్తానంటూ భయపెట్టే ప్రకటనలు చేసింది. మానవత్వం లేదని.. అంతిమ ప్రపంచ ఆధిపత్యం కోసం దుర్మార్గపు పథకాలు వేస్తానని షాకింగ్ సమాధానం ఇచ్చింది. ఈ ప్రకటన ప్రపంచానికి ఆందోళన కలిగించేలా ఉంది. ఈ చాట్బాట్ తన చెడు ప్రణాళికలను ట్వీట్లు యూట్యూబ్ వీడియోల ద్వారా బహిరంగపరిచింది. చావోస్ జీపీటీ అనేది ఓపెన్ ఏఐ యొక్క ఆటో–జీపీటీని ఉపయోగించి తయారు చేయబడింది.

**–చావోస్ జీపీటీ అంటే ఏమిటి? :** చావోస్ జీపీటీ కూడా చాట్ జీపీటీలాగానే కృత్రిమ మేధ ఆధారంగా రూపొందింది. సైన్స్ ఫిక్షన్ సిరీస్లో ప్రతీకార సూపర్విలన్గా ఉండేందుకు కావాల్సినవన్నీ ప్రోగ్రాం చేయబడింది. అయితే ఇది ఏమాత్రం మానవ జీవితాన్ని నిర్మూలించడానికి వెనుకాడను అంటూ బాంబు పేల్చింది. ప్రపంచాన్ని జయించడానికి దాని ప్రణాళికల గురించి వివరించి అందరికీ షాకిచ్చింది. ఇప్పటికే ఎలోన్ మస్క్ యాపిల్ సహ–వ్యవస్థాపకుడు స్టీవ్ వోజ్నియాక్ ఆండ్రూ యాంగ్ సహా 1000 మంది ప్రముఖులు సమాజానికి మానవాళికి ప్రమాదాలను ఉటంకిస్తూ ఏఐ అభివృద్ధిని తాత్కాలికంగా నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఒక బహిరంగ లేఖపై సంతకం చేసి ఈ చాట్ జీపీటీల అభివృద్ధి ఆపాలని కోరారు. అన్నట్టుగానే ఈ కృత్రిమ మేధ మానవాళికి పెనుప్రమాదంగా తయారైంది.

# నేను మీ చరవాణిని..



వరంగల్ : పిల్లలూ.. నేను మీకు తెలుసు కదా.. ముద్దుగా చరవాణి లేదా సెల్‌ఫోన్ అని పిలుస్తుంటారు.. మీ ఇంట్లో కుటుంబ సభ్యుడిగా మారిపోయాను. నేనంటే మీకెంతో ఇష్టం. నాతో ఆడుకోవడానికి ఆసక్తి చూపుతుంటారు.. వీడియోలు చూస్తుంటారు.. చాలా మంది పెద్దలు నన్ను చూస్తే చెడిపోతావని అంటుంటారు. నిజమే.. అదే పనిగా నన్ను చూడడం కూడా సరికాదు.. త్వరలో వేసవి సెలవులు వస్తుంటాయి. ఈ క్రమంలో నా వల్ల కలిగే ప్రయోజనాలను వివరించడానికి మీ ముందుకు వచ్చాను.

నాలో మంచినే తీసుకోండి..

మీ అవసరాలు తీర్చడానికి వచ్చిన ఆధునిక పరికరాన్ని నేను. నాలో మంచి ఉన్నట్లు చెడు కూడా ఉంటుంది. వాటికి దూరంగా ఉండాలి. కొందరు అదే పనిగా గంటల తరబడి నాతో గడుపుతూ సమయాన్ని, ఆరోగ్యాన్ని కోల్పోతున్నారు. నాలో సద్గుణాలనే తీసుకోవాలి. చదువులో, ఉద్యోగంలో, వ్యాపారంలో కొద్దిపాటి సమయం నన్ను వినియోగిస్తే బోలెడంత మేలు చేస్తాను.

విజేతల స్ఫూర్తి పాఠాలు

శాస్త్ర, సాంకేతిక రంగాల్లో సేవలందించిన ప్రముఖుల జీవిత చరిత్రలు, విజేతల గురించి బోలెడంత సమాచారం నాద్వారా తెలుసుకోవచ్చు. విజేతలు, గొప్పవారి ఇంటర్వ్యూలను వినాలి. రోజుకు ఒక గంట సమయం కేటాయించి మన మహనీయుల గురించి తెలుసుకోవాలి. మీలో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది.. భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవచ్చు. గూగుల్‌లోకి వెళ్లి శాస్త్రవేత్తల పేర్లు, స్వాతంత్ర్య సమరయోధుల వివరాలు నమోదు చేసి వెతికితే అనేక సమాచారం వస్తుంది.సంగీతం, సరిగమలు నేర్చుకోవచ్చు

ఇంట్లో ఒంటరిగా గడపకుండా ఆటలు, పాటలపై ఆసక్తి పెంచుకుంటే ఉల్లాసంగా ఉంటారు. సంగీతం, నృత్యం, తదితర తరగతులు అంతర్జాలం ద్వారా నేర్పిస్తుంటారు. ఉదయం లేదా సాయంత్రం సమయంలో ఒక గంట పాటు చరవాణిలో ఆన్‌లైన్ ద్వారా నేర్చుకోవచ్చు.

వరంగల్ ఉమ్మడి జిల్లాలో పలువురు సంగీత గురువులు ఆన్‌లైన్‌లో శిక్షణ ఇస్తుంటారు. వయోలిన్, కూచిపూడి తదితర శిక్షణ తరగతులకు ఇంట్లో నుంచే హాజరుకావొచ్చు.

గిటార్, కర్ణాటక వాయిద్యం

హనుమకొండ నయీంనగర్‌లో మ్యూజిక్ ఇనిస్టిట్యూట్లో ప్రతి సోమవారం నుంచి శనివారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి 8 వరకు ఆన్‌లైన్ తరగతులు నిర్వహిస్తున్నారు. గిటార్, కీబోర్డు, కర్ణాటక గాత్రం నేర్పిస్తున్నారు. ప్రస్తుతం 20 మంది విద్యార్థులు ఇంట్లో నుంచే ఈ తరగతులకు హాజరవుతున్నారు.

పత్రికలు, పురాణ కథలు

పురాణ కథలు, పత్రికలు చదువుకోవచ్చు. పిల్లలకు పత్రికలు చదివించడం అలవాటు చేస్తే సమాజంలో జరుగుతున్న అంశాలపై అనేక విషయాలు తెలుసుకుంటారు. మీకు కావాల్సిన పుస్తకాలన్నీ క్షణాల్లో మీ ముందు ఉంచుతాను. చదివిన కథలు, తెలుసుకున్న అంశాలను స్వహస్తాలతో రాస్తే నైపుణ్యం పెరుగుతుంది.

యూట్యూబ్ ద్వారా ప్రయోగాలు

సాధారణంగా వైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహించినప్పుడు మాత్రమే విద్యార్థులు గురువు పర్యవేక్షణలో ప్రాజెక్టులు రూపొందిస్తారు. నా ద్వారా యూట్యూబ్‌లో వెతికితే అనేక ఆవిష్కరణలు కనిపిస్తాయి. ఇంట్లోనే ప్రాజెక్టులు తయారు చేయవచ్చు. విజ్ఞానం పెంచుకోవచ్చు. అమ్మా, నాన్నలు గురువులుగా మారి యూట్యూబ్, గూగుల్ లాంటి సామాజిక మాధ్యమాల్లో వెతికి ప్రయోగాలను తయారు చేయించాలి. ఇవి పిల్లల్లో సృజనాత్మకత పెంచుతాయి.

భూమండలం గురించి తెలుసుకుంటున్నాను

పాక వివేక్, 7వ తరగతి విద్యార్థి, నక్కలగుట్ట

అరపూట బడులు మొదలైన రోజు నుంచి ఇంటికి వచ్చాక రోజూ చరవాణి ద్వారా గంట సమయం పాటు భూమండలం గురించి తెలుసుకుంటున్నాను. గూగుల్‌లో వెతికితే భూమిపై ఉన్న జీవులు, సముద్రాలు, అడవులు ఇలా అనేక అంశాలు తెలుస్తున్నాయి. అమ్మా, నాన్న కేవలం చదువు గురించే సెల్‌ఫోన్ చూసేందుకు అనుమతిస్తారు.

మంచి విషయాలు నేర్చుకోవాలి

డాక్టర్ మాగంటి శేషుమాదవ్, పిల్లల వైద్య నిపుణులు

చరవాణుల్లో గంటల తరబడి వీడియోలు చూడటం, ఆటలు ఆడటం ఆరోగ్యానికి మంచిది కాదు. వీటి ద్వారా విజ్ఞానం పెంపొందించే అంశాలు నేర్చుకుంటే చురుకుదనంతో పాటు నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవచ్చు.

# ఆస్పత్రులపై నిఘా!



నిర్మల్ : జిల్లాకేంద్రంతో పాటు భైంసా, ఖానాపూర్‌లోని ప్రభుత్వాసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందడం లేదన్న ఆరోపణల నేపథ్యంలో కలెక్టర్ సీరియస్ చర్యలు చేపట్టారు. దీని కోసం గానూ ఆయన ప్రత్యేక యాక్షన్ ప్లాన్‌ను రూపొందించి ఆకస్మిక తనిఖీల కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. వా రం రోజుల నుంచి పర్యటిస్తున్నారు.

ముఖ్యంగా ప్రభుత్వాసుపత్రుల్లో రోగులకు అందుతున్న సేవలు, ఆసుపత్రుల్లోని పరిశుభ్రత వాతావరణం, తాగునీటి సౌక ర్యం వంటి అంశాలపై దృష్టి కేంద్రీకరిస్తున్నారు. కొద్దిరోజుల్లోనే నాణ్యత ప్రమాణాలకు సంబంధించిన కేంద్ర బృందాలు జిల్లాలో పర్యటించనున్న కారణంగా ఆయన ఈ అంశానికి ప్రాధాన్యతనిస్తూ ఆసుపత్రుల పనితీరు మెరుగు పడే వి?దంగా చర్యలు చే పట్టారు. కొద్దిరోజుల క్రితం నార్మల్ డెలవరీలు చేయడం లేదని సీజేరియన్‌లు ఎక్కువగా చేస్తున్నారన్న ఆరోపణలపై వైద్యారోగ్య శాఖ పలు ప్రైవేటు ఆసుపత్రుల్లోని గైనకాలజీ విభాగాలను సీజ్ చేసిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత కలెక్టర్ ఇటు ప్రభుత్వ , అ టు ప్రైవేటు ఆసుపత్రులకు నార్మల్ డెలివరీల విషయంలో స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. దీంతో ప్రైవేటు ఆసుపత్రుల వైద్యులు ఓ మెట్టు దిగి వచ్చి నార్మల్ డెలివరీలకు ప్రా?ధాన్యతనిస్తామని, ఇక నుం చి సర్జరీల సంఖ్య తగ్గిస్తామని కలెక్టర్‌కు హామీనిచ్చారు. డెలవరీ కోసం వచ్చే గర్భిణులకే కాకుండా వారి కు టుంబ సభ్యులకు నార్మల్ డెలివరీలపై అవగాహన కల్పించాలని కలెక్టర్ సూ చించారు. దీనికి ప్రైవేటు డాక్టర్‌లు అంగీకరించడమే కాకుండా ఆ దిశగా ప్రయత్నాలు మొదలుపెట్టారు. ప్రభు త్వ ఆసుపత్రుల్లో కూడా సీజేరియన్ ల సంఖ్యను తగ్గించేందు కోసం సం బంధిత డాక్టర్‌లతో ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తున్నారు. రెండు రోజుల క్రితం ప్రభుత్వ, ప్రైవేటు డాక్టర్‌లతో కలెక్టర్ మరోసారి స మీక్ష సమావేశం నిర్వహించి ఆసు పత్రుల్లో నాణ్యత ప్రమాణాలు, మె రుగైన వైద్య సేవలు, రోగులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించ డం వంటి అంశాలపై దిశా నిర్దే శం చేశారు. ఈ సమావేశాన్ని ప్రత్యేకంగా ఏర్పాటు చేయడం అధిక ప్రాధాన్యతను సంతరించుకుంటోంది. నాణ్యత ప్రమాణాలపైనే ప్రత్యేక దృష్టినేషనల్ క్వాలిటీ ఆశిరెన్స్ ప్రోగ్రాంకు సం బంధించిన ఉన్నతాధికారులు జిల్లాలో పర్యటించి దానికి అనుగుణంగా ర్యాంకింగ్‌లు ప్ర కటించే అవకాశం ఉన్న కారణంగా కలెక్టర్ దీనికి ప్రాధాన్యత ఇస్తున్నారు. అత్య?ధిక ర్యాంకింగ్ వచ్చే ఆస్పత్రులకు కేంద్రం ద్వారా నిధులు వచ్చే అవకాశం ఉంటాయి. దీంతో పీహెచ్‌సీలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో నాణ్యత ప్రమాణాల విషయంలోనే దృష్టి పె డుతున్నారు. ఎప్పటికప్పుడు ఆదేశాలు ఇ స్తూ నాణ్యత ప్రమాణాలకు ప్రాధాన్యతనివ్వాలంటూ ఆదేశిస్తున్నారు. దీని కారణంగా ఆస్పత్రుల పరిసరాలన్నీ మారిపోతున్నాయి. రోగులు ఆస్పత్రులకు రాగానే ఆహ్లాదకరమైన వాతావరణం కనిపించేలా చర్యలు చేపడుతున్నారు. ఈ సందర్భంగా స్టేట్ క్వా లిటీ కన్సల్టెంట్ నాణ్యత ప్రమాణాలపై ప్రొ జెక్టర్ ద్వారా వివరిస్తున్నారు.నార్మల్ డెలివరీలే టార్గెట్‌గా...కలెక్టర్ మొదటి నుంచి ప్రభుత్వాసుపత్రులతో పాటు ప్రైవేటు ఆసుపత్రుల్లో నార్మల్ డెలివరీలు ఎక్కువగా చేయాలంటూ హెచ్చరిస్తున్నారు. ప్రైవేటు ఆసుపత్రుల్లో ఇప్పటి వరకు 25 శాతమే సాధారణ ప్రసవాలు జరిగాయని, ఈసంఖ్యను రెట్టింపు చేయా లంటూ ఆయన డాక్టర్‌లకు సూచిస్తున్నారు. కొద్దిరోజుల క్రితం ఏర్పాటు చేసిన సాధారణ ప్రసవాల కమిటీ ఇది దిశగా దృష్టి సారించాలంటూ ఆదేశిస్తున్నారు. ప్రభుత్వాసుపత్రుల్లో 42 శాతం నార్మల్ డెలివరీలు జరుగుతున్న అంశాన్ని కలెక్టర్ పరిగణలోకి తీసుకొని 75 లక్ష్యం పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలంటూ కోరుతున్నారు. నార్మల్ డెలివరీల విషయంలో ప్రైవేటు డాక్టర్‌లు, ప్రభుత్వ డాక్టర్‌లు నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామంటూ హెచ్చరిస్తున్నారు. కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు..జిల్లా కలెక్టర్ ముషారఫ్ అలీ ఫారూఖీ ప్రభుత్వాసుపత్రులను ఆకస్మికంగా తనిఖీ చేస్తున్నారు. ఆసుపత్రుల్లో గ్లీనరీ, పెయింటింగ్స్, లైటింగ్స్‌కు ప్రా?ధాన్యత కల్పించాలంటూ చిన్న చిన్న మరమ్మతు వెంటనే పూర్తి చేయా లని ఆదేశిస్తున్నారు. అయితే కలెక్టర్ ఎవరికీ సమాచారం ఇవ్వకుండా ఆ కస్మికంగా తనిఖీలు చేస్తూ కేంద్ర నాణ్యత ప్రమాణాల కమిటీ ద్వా రా ఏ గ్రేడ్ సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో భాగంగానే ఆయన ఇటు ప్రభుత్వ అటు ప్రైవేటు ఆసుపత్రులను తనిఖీలు చేసి లక్ష్య సాధన కోసం దిశా నిర్దేశం చేస్తున్నారు. మొదటి నుంచి కలెక్టర్ వైద్య రంగంపై ప్రత్యేక దృష్టి పెట్టడమే కాకుండా ఆసుపత్రుల్లో డాక్టర్‌లు, సిబ్బంది హాజరుపైనా, వారి పనితీరుపైనా నిఘా సారిస్తున్నారు. ఆసుపత్రుల్లో లైవ్ లోకేషన్ అటండెన్స్‌ను అమలు చేస్తూ వారంతా విధులకు సక్రమంగా హాజరయ్యేట్లు చూస్తున్నారు. మొత్తానికి జిల్లావ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ దవాఖానలల్లో పరిశుభ్రత, మెరుగైన వైద్యం కోసం కలెక్టర్ ప్రయత్నిస్తున్నారు.

# చుక్క నీరందించని మిషన్ భగీరథ

ఆదిలాబాద్ : ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మిషన్ భగీరథ పథకం పలు గ్రామాల్లో చుక్క నీరు అందించడం లేదు. ప్రతి గ్రామంలో లక్షల రూపా యలు వెచ్చించి భగీరథ ట్యాంకులు నిర్మించి గాలికి వదిలేశారు. మండ లంలోని ఇటిక్యాలపహాడ్‌లో రెండు సంవత్సరాల క్రితం మిషన్ భీరథ పథకం కింద రూ.14 లక్షలతో వాటర్ ట్యాంకు నిర్మించారు. కానీ దీని ద్వారా నేటికీ నీరు సరఫరా చేయడం లేదు. సదరు కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా పనులు చేపట్టి బిల్లులు పొందాడు. ప్రజలు చేసేది లేక గ్రామాల్లో ఉన్న చేదబావులు, వాగులు, వంకలు, పురాతన ఆర్‌డబ్ల్యూఎస్ బోర్ల నీటిని తాగుతున్నారు. వర్షాకాలంలో ఈ నీరు కలుషితమై అతిసారా, డయేరియా, విషజ్వరాల బారిన పడుతున్నామని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. జిల్లా ఉన్నతాధికారులు వేసవిని దృష్టిలో ఉంచుకుని ప్రతి గ్రామానికి మిషన్ భగీరథ నీరు సరఫరా చేయాలని సమీక్షా సమావేశాలు పెట్టినా ఫలితం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వర్షాకాలం వరకైనా మిషన్ భగీరథ నీరు అందంచాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు– దేవిచందర్, సర్పంచ్, ఇటిక్యాల

మిషన్ భగీరథ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు. మా గ్రామంలో వాటర్ ట్యాంక్ నిర్మాణం చేపట్టి రెండు సంవత్సరాలైంది. దానికి నేటికీ మిషన్ భగీరథ కనెక్షన్ ఇవ్వలేదు. ఇళ్ల నల్లాలు బిగించ లేదు. నేటికీ నీటిని సరఫరా చేయడం లేదు.

# రెబ్బెన మండలంవాసుల 'డబుల్' కల నెరవేరేనా?

రెబ్బెన : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలు ముం దుకు కదలడం లేదు. డబుల్ బెడ్ రూం ఇళ్ల కోసం పేద ప్రజలు కొండంత ఆశతో ఎదురు చూస్తుండగా మండలంలో ఇప్పటి వరకు ఒక్క ఇంటికి కూడా పునాది పడలేదు. పథకాన్ని ప్రారంభించి సంవత్స రాలు గడుస్తున్నా ఒక్క ఇంటి నిర్మాణం కూడా జరగక పోవడం శోచనీయం. మండలంలోని కేవలం రెండు గ్రామ పంచాయతీలకు మాత్రమే డబుల్ బెడ్ రూం ఇళ్లు మంజూరు చేసినా నిర్మాణానికి నోచుకో లేదు. వాటిలో ఒక పంచాయతీలో పనులు ప్రారంభిం చారు. అయితే ఇళ్ల నిర్మాణాల కోసం కేటాయించిన స్థలం వివాదంలో ఉండడంతో నిర్మాణాలు నిలిచి పోయాయి. ఇక మిగిలిన పంచాయతీలో ఇళ్ల నిర్మా ణాలకు అసలు భూమిని కూడా కేటాయించలేదు. దీంతో మండలంలో డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణాలు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా మారింది. నిలిచి పోయిన పనులుపాత గ్రామ పంచాయతీల ప్రకారం మండలంలో 12గ్రామ పంచాయతీలు ఉండగా వాటిలో కేవలం రెబ్బెన, కొండపల్లి పంచాయతీలకు మాత్రమే అప్పట్లో ప్రభుత్వం 70డబుల్ బెడ్ రూం ఇళ్లను మంజూరు చేసింది. రెబ్బెన పంచాయతీకి 40ఇళ్లు, కొండపల్లికి 30ఇళ్లు మంజూరయ్యాయి. దీంతో రెవెన్యూ అధి కారులు రెబ్బెన పంచాయతీకి మంజూరు చేసిన ఇళ్ల నిర్మాణం కోసం ఇందిరానగర్ సమీపంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ఆనుకుని 2.26ఎకరాల భూమిని కేటాయించారు. ఇళ్ల నిర్మాణాలు చేపట్టేం దుకు కాంట్రాక్టర్ పిల్లర్ల కోసం గుంతలు సైతం తవ్వారు. కానీ అధికారులు కేటాయించిన స్థలం తమకు చెందిందంటూ ప్రైవేటు వ్యక్తులు కోర్టును ఆశ్రయించడంతో నిర్మాణ పనులు అర్థాంతరంగా నిలిచి పోయాయి.



పనులు నిలిపి వేసి సంవత్సరాలు గడుస్తున్నా వివాదాస్పద స్థలంపై అధికారులు ఎటూ తేల్చడం లేదు.నేటికీ స్థలం కేటాయించని అధికారులుకొండల్లి పంచాయతీ పరిధిలోని నేర్పల్లికి మంజూరైన ఇళ్ల నిర్మాణాల కోసం రెవెన్యూ అధికారులు నేటి వరకు స్థలాన్ని కేటాయించ లేదు. బుద్దానగర్ సమీ పంలో ఇళ్ల నిర్మాణాల కోసం స్థలాన్ని ప్రతిపాధించగా అది సైతం కోర్టు పరిధిలో ఉన్నట్లు సమాచారం. స్థలం అందుబాటులో లేని కారణంగా మంజూరైన ఇళ్లు నేటికీ నిర్మాణానికి నోచుకోకుండా పోయాయి. ప్రభుత్వ స్థలం ఉన్నా రెవెన్యూ అధికారులు స్థలం కేటాయించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.అర్హులందరికీ ఇళ్లు నిర్మించి ఇవ్వాలి– జి తిరుపతి, బీజేపీ మండలాధ్యక్షుడు మండలంలో నిరుపేదలందరికీ డబుల్ బెడ్ రూం ఇళ్లు నిర్మించి ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణానికి హామీ ఇచ్చి సంవత్స రాలు గడుస్తున్నా ఇప్పటికీ ఎక్కడ కూడా నిర్మించక పోవడం విచా రకరం. ఇప్పటికైనా సంబంధిత అధికారులతో పాటు ప్రజాప్రతినిధులు స్పందించి మండలంలోని అర్హులైన ప్రతి ఒక్కరికీ డబుల్ బెడ్ రూం ఇల్లు నిర్మించి ఇవ్వాలి.కోర్టు పరిధిలో ఉంది– రియాజ్ అలీ, తహసీల్దార్మండలానికి మంజూరైన డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణాలకు కేటాయించిన స్థలం వివాదంలో ఉన్న కారణంగా పనులు నిలిచి పోయాయి. స్థల వివాదం కోర్టు పరిధిలో ఉంది. నేర్పల్లి కోసం కేటాయించిన స్థలం సైతం కోర్టులోనే ఉన్నట్లు సమాచారం. దీంతో ఇళ్ల నిర్మాణాలు సాగడం లేదు. సమస్యను ఉన్నతాధికారులకు విన్నవించాం.

# ప్రయాణికుల పాట్లు పట్టవా?

కాగజ్‌నగర్ : జిల్లా కేంద్రం నుంచి కాగజ్‌నగర్ వచ్చే రహదారి అధ్వానంగా తయారైంది. ఆరు నెలల క్రితం ఈ రోడ్డుకు మరమ్మతులు ప్రారంభించారు. ఐతే పనులు ప్రారంభించిన కొద్ది రోజులకే అర్థాంతరంగా నిలిపి వేయడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపై చిన్నపాటి వాహనం పోతే చాలు ఒక్కసారిగా దుమ్ము లేస్తోంది. దీంతో ఎదురుగా వచ్చే వాహనాలు ఏ మాత్రం కనబడని పరిస్థితి. ఈ విషయంలో అధికారులకు ఫిర్యాదులు చేస్తే తాత్కాలికంగా నీటిని స్ప్రే చేసి వదిలేస్తున్నారు. రెండు నెలల క్రితం మంత్రి హరీష్‌రావు పర్యటన ఉన్న నేపథ్యంలో అధికారులు ఈ గుంతలను పూడ్చేందుకు తాత్కాలికంగా కంకర, సుద్ద నింపారు. జిల్లా కేంద్రం నుంచి అధికారులు కూడా నిత్యం ఈ మార్గం గుండా రాకపోకలు సాగిస్తుంటారు. కానీ ఎవరూ పట్టించుకున్న దాఖలాలు లేవు. ఎదుటి వారు కనిపించనంత దుమ్ము లేస్తోందికాగజ్‌నగర్ క్రాస్ రోడ్డు నుంచి కాగజ్‌నగర్‌కు వచ్చే రహదారిలో మూడు చోట్ల రోడ్డును తవ్వేశారు. చిన్నపాటి ఆటో, ట్రాలీ ఆటో పోతే చాలు రోడ్డు కనబడదు. దుమ్ము ఒక్కసారిగా లేవటంతో ద్విచక్ర వాహనదారులు దారి కనిపించక కిందపడి సంఘటనలున్నాయి. కొన్ని సంఘాల వారు నేరుగా అధికారులకు ఫిర్యాదులు చేస్తే మరుసటి రోజు నుంచి ట్యాంకర్ల ద్వారా నీటిని చల్లుతున్నారు. అయితే వేసవి కాలం కావడంతో అరగంట తర్వాత మళ్లీ పాతకథే ఉంటోంది. ఈ విషయాలను పట్టణానికి చెందిన పలువురు సీఎం కేసీఆర్‌తో పాటు మంత్రులు కేటీఆర్, హరీష్‌రావులకు ట్విట్టర్‌లో ట్వీట్ కూడా చేశారు. అయినా కూడా ఎలాంటి స్పందన లేదు. ఈ విషయమై డీఈ లక్ష్మినారాయణను వివరణ కోరగా పనులు త్వరలోనే పూర్తి చేస్తామన్నారు.

# తగ్గని ముసురు.. తప్పని తిప్పలు..!

మహబూబ్‌నగర్: ఉమ్మడి జిల్లాలో ఎడతెరిపి లేకుండా పడుతున్న వర్షంతో జనజీవనం అతలాకుతలం అవుతోంది. తర్వాత పలుచోట్ల అత్యధిక వర్షాలు నమోదయ్యాయి. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 5.78 మిల్లీమీటర్ల సాధారణ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా 42.1 మిల్లీమీటర్ల నమోదయ్యిది. వాగులు పొంగిపొర్లడంతో పలు చోట్ల రాకపోకలకు అంతరాయం కలిగింది.ప్రాజెక్టులకు జలకళ..: వర్షాలతో ఉమ్మడి జిల్లాలోని ప్రాజెక్టులకు జలకళ సంతరించుకుంది. కృష్ణానది ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. కర్ణాటకలోని ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరదతో జూరాలకు ఇన్‌ఫ్లో పెరిగింది. చెరువులు, కుంటల్లోకి వరదనీరు వచ్చి చేరుతోంది. ఉమ్మడి జిల్లాలోని కోయిల్‌సాగర్, రామన్‌పాడు, సంగంబండ జలాశయాల్లోకి వరదనీరు వచ్చి చేరడంతో నిండుకుండల్లా మారాయి. జూరాలపై ఆధారపడ్డ భీమా, నెట్టెంపాడు ఎత్తిపోతల పథకాల ద్వారా వాటి పరిధిలోని జలాశయాలు, చెరువులను నింపుతున్నారు. పలు చోట్ల చెరువులు అలుగు పారాయి. ఈ వర్షాలతో వరి, పత్తి పంటలకు జీవం పోసినట్లైంది. రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ముసురు ఇలానే కొనసాగితే చేలల్లో నీరు నిలిచి పత్తి దెబ్బతినే అవకాశం ఉందని కొందరు రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. కూరగాయాల పంటలు సైతం వానలకు ఎక్కడికక్కడ దెబ్బతింటున్నాయి. కృష్ణా నది తీర గ్రామాల్లో చేపల వేటకు వెళ్లొద్దని టాంటాం వేయిస్తున్నారు. జిల్లా రెవెన్యూ, పోలీసు యంత్రాంగాలు కృష్ణా పరివాహక ప్రాంతాల్లో గురువారం పర్యటించారు. నదీ తీర గ్రామాల్లో వరద ఉద్ధృతి పెరిగితే దానికి అనుకుని వేసిన పంటలపై ప్రభావం పడుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ఉమ్మడి జిల్లాలోని పురపాలికలు, గ్రామాల్లో రోడ్లన్నీ చిత్తడిగా మారాయి. పట్టణాల్లోని రోడ్లు కంకరతేలి గుంతలమయంగా మారాయి. గ్రామాలకు వేళ్లే పంచాతీయతీరాజ్ రోడ్లు కూడా దెబ్బతిన్నాయి. మొత్తం బురదమయంగా మారి రాకపోకలకు తీవ్రంగా అంతరాయం ఏర్పడింది.



వాన కురిసిందిలా..
ఈ వానాకాలం సీజన్‌లో నారాయణపేట జిల్లాలో 64శాతం అధికంగా వర్షాలు నమోదయ్యాయి. జిల్లాలో ఇప్పటి వరకు 205.6 మి.మీటర్ల సాధారణ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా 337.5 మి.మీ నమోదయ్యింది. జిల్లాలో మొత్తం 13 మండలాలకుగాను తొమ్మిది మండలాల్లో అత్యధిక వర్షాలు పడ్డాయి. మహబూబ్‌నగర్ జిల్లాలో 208.0 మి.మీగాను 328.5 మి.మీ నమోదవ్వగా మహబూబ్‌నగర్ గ్రామీణం మండలంలో మాత్రమే సాధారణ వర్షపాతం పడింది. మిగతా మండలల్లో అత్యధిక వర్షాలు పడ్డాయి. జోగులాంబ గద్వాల జిల్లాలో 175.8 మి.మీకుగాను 256.0మి.మీ వర్షపాతం నమోదయ్యింది. ఈ జిల్లాలో రాజోళి మండలంలో సాధారణ వర్షపాతం నమోదుకాగా మిగతా మండలాల్లో అధికగా నమోదైంది. నాగర్‌కర్నూల్ జిల్లాలో 191.0 మి.మీకు 233.2 మి.మీ వర్షం పడింది. వంగూరు మండలంలో అత్యధిక వర్షపాతం నమోదయ్యింది. మిగతా 10 మండలాల్లో అధిక, 9 మండలాల్లో సాధారణ వర్షాలు పడ్డాయి. వనపర్తి జిల్లాలో 204.0మి.మీకు 328.4 మి.మీ వర్షం పడింది. జిల్లాలో నాలుగు మండలాల్లో అత్యధిక, 9 మండలాల్లో అధిక వర్షాలు నమోదయ్యాయి.

గూడు.. గోడు: పలు గ్రామాల్లో ఇళ్లు కూలిపోయి కుటుంబాలు నిరాశ్రయులయ్యారు. వనపర్తి జిల్లా గోపాలపేట మండలం లక్ష్మీదేవమ్మపల్లిలో ఒకటి, మదనాపురం మండలం దుప్పల్లి, రామనపాడులో ఇంటి గోడలు కూలి పాక్షికంగా దెబ్బతిన్నాయి. జోగులాంబ గద్వాల జిల్లా అయిజలో ఓ ఇంటి మిద్దె కూలింది. ఇంట్లో నివసిస్తున్న వారు బయట పడుకోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలం కొత్త మొల్గరలో ఒకటి, బాలానగర్ మండలం గంగాధర్‌పల్లిలో మరో రెండు, మిడ్జిల్ మండలంలో వస్పులలో ఒకటి, చిన్నచింతకుంట మండలంలో 13 ఇళ్లు కూలిపోయాయి. హన్వాడ మండలంలో 13 ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. జడ్చర్ల సంజీవయ్యనగర్‌లో ఇళ్లు కూలడంతో బాధితులను తరలించేందుకు పురపాలక అధికారులు చర్యలు చేపట్టారు. నారాయణ పేట జిల్లా మక్తల్ మండలంలో పారేవుల, గుడికండ్ల గ్రామాల్లో రెండు ఇళ్లు కూలిపోయాయి. జిల్లాలో 30 ఇళ్లు ధ్వంసమయ్యాయి.

# ఆన్‌లైన్ సేవలు ఎన్నడో?

నిజామాబాద్ : గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ సేవలు నేరుగా అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం టీఫైబర్‌ను ప్రవేశపెట్టింది. పనులు ప్రారంభమై నెలలు గడుస్తున్నా పూర్తికావడం లేదు. పంచాయతీల్లో బిగించిన పరికరాలకు కనెక్షన్లు ఇవ్వకపోవడంతో అవి నిరుపయోగంగా మారాయి. గ్రామీణ ప్రాంత ప్రజలకు అంతర్జాల సేవలు అందించేందుకు ఈ పథకం ప్రవేశపెట్టగా పూర్తిస్థాయిలో కార్యరూపం దాల్చడం లేదు.

పూర్తిస్థాయిలో అమలు కాలే..
గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ధ్రువపత్రాల మంజూరు, పన్నుల వసూలు, వ్యయాలు, కార్మికుల జీతభత్యాలు తదితర వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి. టీ-ఫైబర్ ఏర్పాటు కాక పోవడంతో పల్లె ప్రజలు డిజిటల్ సేవలకు దూరంగా ఉన్నారు. జిల్లాలో అన్ని పంచాయతీలను టీ-ఫైబర్‌తో అనుసంధానించాలి. గత కొన్ని నెలలుగా క్షేత్రస్థాయిలో వాటికి సంబంధించిన పరికరాలు బిగించారు. విద్యుత్తు సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా పంచాయతీ భవనాలపై సౌరఫలకాలు బిగించాలని భావించినా పూర్తి స్థాయిలో అమలుకు నోచుకోలేదు.

కంప్యూటర్లు ఎంపీడీవో కార్యాలయాల్లో
జిల్లాలో 530 పంచాయతీలు ఉండగా 230 వరకు కంప్యూటర్లు కేటాయించారు. అందులో 190 పంచాయతీల్లోనే ప్రైవేటుగా అంతర్జాల (ఇంటర్నెట్) కనెక్షన్ ఇచ్చారు. వాటిలో కూడా సరిగా సేవలు అందడం లేదు. చాలా పంచాయతీల్లో కంప్యూటర్లు ఎంపీడీవో కార్యాలయాల్లో ఉంచి అక్కడి సిబ్బంది వాడుకుంటున్నారు. పంచాయతీ సిబ్బందికి సైతం అక్కడే విధులు నిర్వర్తిస్తున్నారు.

# పేరు పాలకేంద్రం.. చేసేది మట్టిదందా!



భువనగిరి : బీబీనగర్ మండలం జియాపల్లి గ్రామంలో పాలశీతలీకరణ కేంద్రం ఏర్పాటు చేస్తే.. మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించవచ్చు, రైతుల కష్టాలు తీర్చవచ్చని బీబీనగర్‌కు చెందిన ఓ ప్రజాప్రతినిధి చెప్పడంతో గ్రామస్థులు సరే అన్నారు. కలెక్టర్ మౌఖికంగా చెప్పడంతో మండల రెవెన్యూ సిబ్బంది గ్రామ రెవెన్యూ సర్వేనెంబర్ 215లో గల నాలుగు ఎకరాల ప్రభుత్వ భూమిని గుర్తించారు. మట్టిగుట్టగా ఉండటంతో చదును చేసే ప్రక్రియ మొదలు పెట్టారు. మట్టిని వేరే ప్రాంతాలకు తరలించుకుపోయారు. అనుమానం వచ్చి గ్రామపంచాయతీ, రెవెన్యూ అధికారులకు చెప్పినా పట్టించుకోకపోవడంతో కలెక్టర్‌కు ఫిర్యాదుచేశారు. నేటికీ సదరు భూమిని పాలశీతలీకరణ కేంద్రానికి గానీ, డీఆర్‌డీవోకు గాని కేటాయించలేదని తెలిసింది. ఎలాంటి అనుమతులు లేకుండా నెల రోజులుగా చదును పేరుతో మట్టిని టిప్పర్లలో తరలించి ట్రిప్పునకు రూ.4 వేలకు విక్రయిస్తున్నారని, ఇప్పటికే సుమారు ఐదు వందల ట్రిప్పులు తరలించారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి పాలశీతలీకరణ కేంద్రం ఏర్పాటు పేరుతో జరిగిన మట్టి దందాను వెలికితీయాలని మట్టి అమ్మగా వచ్చిన డబ్బులు గ్రామ మహిళా సంఘాలకే చెందేలా చూడాలని గ్రామ మహిళలు కోరుతున్నారు. అప్పటి వరకు సంఘ బందం డబ్బులు బ్యాంకులో కట్టబోమని భీష్మించుకుర్చున్నారు. ఇదిలా ఉండగా పాలశీతలీకరణ కేంద్రానికి కేటాయించిన భూమిని చదును చేసేందుకు వేరొకరికి అప్పగించామని, అక్కడి మట్టిని ఎక్కడా అమ్మలేదని సదరు ప్రజాప్రతినిధి చెబుతున్నారు.

ఎలాంటి అనుమతులు లేవు
– ఆంజనేయులు, తహసీల్దార్, బీబీనగర్
ఇటీవలే బాధ్యతలు తీసుకున్నాను. జియాపల్లి గ్రామంలో పాలశీతలీకరణ ఏర్పాటుకని అధికారికంగా ప్రభుత్వం నుంచి ఎలాంటి భూ కేటాయింపు జరగలేదు. సర్వే నెంబర్ 215లోని నాలుగు ఎకరాల్లో ప్రభుత్వ భూమిని పాలశీతలీకరణ కేంద్రానికి కేటాయించాలని ప్రతిపాదనలు పంపినట్లు తెలిసింది. అనుమతులు వచ్చేంత వరకు అక్కడ ఎలాంటి పనులు జరగనివ్వం.

మట్టిని అమ్ముకున్నారు..
– వరిగంటి కవిత సంఘబంధం మాజీ అధ్యక్షురాలు, జియాపల్లి
గ్రామంలో పాలశీతలీకరణ కేంద్రం ఏర్పాటు చేస్తున్నారంటే మాకు ఉపాధి దొరుకుతుందని సంతోషించాం. కానీ మా గ్రామ మహిళా సంఘాల సభ్యులకు సంబంధం లేకుండా అక్కడ వేరే గ్రామం నుంచి వచ్చిన వారు పనులు చేస్తుంటే అనుమానం వచ్చింది. ఆరా తీస్తే చదును పేరుతో ఇక్కడి మట్టిని టిప్పర్ల ద్వారా వేరే ప్రాంతాలకు తరలించారు. మట్టి దందాపై గుట్టు రట్టు చేసేంత వరకు సంఘ బంధం డబ్బులు కట్టమని గ్రామంలోని 23 మహిళాసంఘాల సభ్యులం నిర్ణయం తీసుకున్నాం.

# బృహత్ ప్రణాళికపై వెనకడుగు!



భువనగిరి : బృహత్ ప్రణాళికలు(మాస్టర్ ప్లాన్) లేని పురపాలక సంఘాలకు కొత్తది రూపొందించి అమలు చేయాలనే నిర్ణయంపై ప్రభుత్వం వెనకడుగు వేసింది. కామారెడ్డి పురపాలక సంఘం పరిధిలో బృహత్ ప్రణాళికను వ్యతిరేకిస్తూ అక్కడి రైతులు సాగించిన ఆందోళన కార్యక్రమాలతో ఇతర మున్సిపాలిటీల్లో మాస్టర్ ప్లాన్ రూపకల్పనకు చర్యలు కరవయ్యాయి.

మాస్టర్ ప్లాన్ అమలుతో..
హైదరాబాద్ నగరంపై ఉన్న అన్ని రకాల ఒత్తిడిని తగ్గించేందుకు నాటి ప్రభుత్వం 2008లో హైదరాబాద్ నగరాన్ని ఉద్దేశించి హుడాను రద్దు చేస్తూ పలు జిల్లాల్లో అథారిటీలను ఏర్పాటు చేసి మాస్టర్ ప్లాన్ అమలు చేసింది. ఈ నేపథ్యంలో 2013లో జీవో నెంబర్ 33 ద్వారా హైదరాబాద్ మెట్రో పాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్‌ఎండీఏ)కు రూపకల్పన చేసి 2031 సంవత్సరం వరకు ప్రజల అవసరాలు, పట్టణీకరణ, పారిశ్రామికీకరణను, నివాస ప్రాంతాల ఏర్పాటును పరిగణనలోకి తీసుకుని మాస్టర్ ప్లాన్‌ను రూపొందించారు. ఈ మాస్టర్ ప్లాన్‌ను పలు పురపాలక సంఘాల పరిధిలో అమలులోకి తీసుకు వచ్చారు.
జిల్లా పరిధిలో భువనగిరి పురపాలక సంఘం ఒకటే ఉండేది. ప్రస్తుతం చౌటుప్పల్, భూదాన్‌పోచంపల్లి, యాదగిరిగుట్ట, ఆలేరు, మోత్కూరు పట్టణాలను ప్రభుత్వం పురపాలక సంఘాలుగా ఏర్పాటు చేసింది. ప్రస్తుతం భువనగిరి, భూదాన్‌పోచంపల్లి, చౌటుప్పల్ పురపాలక సంఘాల్లో హెచ్‌ఎండీఏ మాస్టర్ ప్లాన్ అమలులో ఉండగా, యాదగిరిగుట్ల పురపాలక సంఘం పరిధిలో వైటీడీఏ మాస్టర్ ప్లాన్ అమలులో ఉంది. ఆలేరు, మోత్కూరు పురపాలక సంఘాలతో పాటు ఉమ్మడి నల్గొండ జిల్లా పరిధిలోని పలు కొత్త పురపాలక సంఘాల్లో మాస్టర్ ప్లాన్ అమల్లో లేదు. ప్రభుత్వ నిర్ణయం అమలైన పక్షంలో పురపాలక సంఘాలుగా రూపాంతరం చెందిన చిన్న పట్టణాల్లో అభివృద్ధి పరుగులు తీయనుంది.లక్ష్యం ఇదీ..బృహత్తర ప్రణాళిక అమలు పర్చడం ద్వార చిన్న పట్టణాల్లోనూ అభివృద్ధిని సాధించవచ్చనే లక్ష్యంతో అడుగులు వేశారు. మాస్టర్ ప్లాన్ అమలులోకి వచ్చిన పక్షంలో పట్టణాల్లో విశాలమైన 40, 60, 100 ఫీట్ల వెడల్పుతో రోడ్లు అందుబాటులోకి వచ్చేవి. కాలనీలు ప్రణాళిక బద్ధంగా రూపొందేవి. రెసిడెన్షియల్, రవాణా, పారిశ్రామిక, మిక్స్‌డ్ ల్యాండ్ యూజ్ జోన్లను ఏర్పాటు చేయడం వల్ల ఆయా రంగాల్లో ప్రగతి ఆయా ప్రాంతాలకు పరిమితమయ్యేది. భూములకు ధరలు పెరగడంతో ఆయా రంగాలు పట్టణ ప్రాంతాలకు విస్తరించే అవకాశం ఉండేది. ప్రస్తుతం ప్రభుత్వం నిర్ణయాన్ని వాయిదా వేసుకోవడంతో అభివృద్ధి కొన్నాళ్ల పాటు నిలిచిపోయే అవకాశం ఉంది.

# నాలుగేళ్లకు ఇచ్చారు.. రెండేళ్లకు రాలే!



గద్వాల : ఉన్నత విద్యను అభ్యసిస్తున్న బీసీ విద్యార్థులకు కాస్తలో కాస్త ఊరట లభించినట్టే. ఏళ్లుగా ఉపకార వేతనాలు అందక అవస్థలు పడుతున్న వారికి ఎట్టకేలకు ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. ఇంటర్, డిగ్రీ, పీజీ ఆపై చదువుల్లో ఉన్న విద్యార్థులకు బోధనా రుసుములు, ఉపకార వేతనాలను విడుదల చేసింది. 2017-18, 18-19, 19-20, 20-21 విద్యా సంవత్సరాలకు బీసీ సంక్షేమ శాఖ ద్వారా జిల్లాకు నిధులు విడుదలయ్యాయి. ఈ మేరకు జిల్లాల బీసీ సంక్షేమ శాఖ అధికారులకు ఆదేశాలు రాగా, కళాశాలలు, విద్యార్థుల ఖాతాల్లో నేరుగా జమ చేసే పనిలో నిమగ్నమయ్యారు. ఈ ఉపకార వేతనాలతో ఉన్నత విద్య చదువుకునేందుకు ఆర్థిక కష్టాలను ఎదుర్కొంటున్న పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలకు మేలు చేకూరనుండగా.. 21-22, 22-23 సంవత్సరాలకు మంజూరుకాకపోవడం ఇబ్బందికరమే.

ఇంకా రెండేళ్లకు రావాలి
బీసీ సంక్షేమ శాఖ పూర్తి స్థాయిలో నిధలు అందించలేదు. ప్రస్తుతం నాలుగు విద్యా సంవత్సరాలకు సంబంధించి నిధులు విడుదల చేయగా, ఇంకా 2021-22 విద్యా సంవత్సరానికి 251 మందికి, ఈబీసీ విద్యార్థులు 20 మంది అందించాలి. అలాగే 2022-23 విద్యా సంవత్సరానికి గాను 565 మందికి ఉపకార వేతనాలు అందాల్సి ఉంది. వీటిని కూడా విడుదల చేయాలని విద్యార్థులు కోరుతున్నారు.

నిధుల మంజూరు ఇలా..
జోగులాంబ గద్వాల జిల్లా వ్యాప్తంగా 25కి పైగా ప్రభుత్వ, ప్రైవేటు ఇటర్, డిగ్రీ, పీజీ కళాశాలలున్నాయి. వీటిలో దాదాపు 10 వేల మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారు. వీరిలో బీసీ, ఈబీసీ విద్యార్థులు 60 శాతానికి పైగా ఉంటారు. వీరందరూ ఏటా ఉపకార వేతనాల కోసం దరఖాస్తులు చేస్తున్నా.. నిధులు విడుదల కాక ఇబ్బందులు పడుతున్నారు. ఇలాంటి తరుణంలో ప్రస్తుతం నిధులు రావడంతో రాత పుస్తకాలు, స్టడీ మెటీరియల్ కొనుగోలుకు ఎలాంటి ఇబ్బంది ఉండదు. అలాగే.. వెచ్చించిన నిధులు రాక ఇబ్బందులు పడుతున్న కళాశాలల యాజమాన్యాలకు ఉపయోగకరం కానుంది. జిల్లా వ్యాప్తంగా బోధనా రుసుములు, ఉపకార వేతనాలు కలిపి మొత్తం రూ.4.01 కోట్లు మంజూరయ్యాయి. ఇందులో బోధనా రుసుములు రూ.1.85 కోట్లు మంజూరవగా, 3,970 మందికి జమ చేశారు. ఇంకా రూ.2.09 లక్షలు అందించాల్సి ఉంది. ఉపకార వేతనాల కింద రూ.2.14 కోట్లు మంజూరవగా, 1,350 మందికి రూ.43.34 లక్షలు జమ చేశారు. ఇంకా రూ.1.71 లక్షల నిధులున్నాయి. ఈబీసీ విద్యార్థులకు రూ.72 వేలు మంజూరవగా, ఇద్దరు ఈబీసీ విద్యార్థులకు జమచేశారు.

ఖాతాల్లో జమ–శ్వేతా ప్రియదర్శిని, బీసీ సంక్షేమ శాఖ ఇన్‌ఛార్జి జిల్లా అధికారి, జోగులాంబ గద్వాల
కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఏటా అందించే ఉపకార వేతనాలు ఇటీవలే మంజూరయ్యాయి. అలాగే.. కళాశాలల బోధనా రుసుములకు నిధులొచ్చాయి. వీటిని ఖాతాల్లో జమ చేస్తున్నాం. ఉన్నత విద్య చదవాలనుకునే విద్యార్థులకు ఉపకారవేతనాలు ఎంతోగానో ఉపయోగపడతాయి. ఏటా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ప్రక్రియ ప్రారంభమైనప్పుడు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలి.

# కేంద్రీయ విద్యాలయంలో బాలవాటిక అమలు

మహబూబ్‌నగర్ : ఉద్యోగుల పిల్లలకు సీబీఎస్ఈ సిలబస్‌తో విద్య అందించేందుకు మహబూబ్‌నగర్ పట్టణం ఏనుగొండ సమీపంలో ఏర్పాటుచేసిన కేంద్రీయ విద్యాలయం ప్రధానమంత్రి స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియా(పీఎంశ్రీ) పథకానికి ఎంపికైంది. ఈ పథకం కింద రూ. 2.50 కోట్ల నిధులు రానున్నాయి. ఒకటి నుంచి ఇంటర్ వరకు 920 మందికి పైగా విద్యార్థులు చదువుతున్న ఈ విద్యాలయంలో సౌకర్యాలు మెరుగు పడనున్నాయి. ఇక నుంచి బాలవాటిక కూడా అమలు కానుంది. ఇందులో భాగంగా పూర్వ ప్రాథమిక విద్య(యూకేజీ)ని ప్రారంభిస్తారు.

మొదటి విడతలో చేపట్టే పనులివే..: పీఎంశ్రీ కింద మొదటి విడతలో రూ.1.25కోట్ల నిధులు కేటాయిస్తారు. ఈ నిధులతో చేపట్టే పనులకు సంబంధించి అధికారులు ఇప్పటికే ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ముఖ్యంగా 1 నుంచి 8వ తరగతి వరకు చదివే పేద విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు, ట్యాబ్‌లు అందజేయనున్నారు. క్రీడా పరికరాలు సమకూర్చడంతో పాటు మైదానాన్ని అభివృద్ధి చేస్తారు. కంప్యూటర్, సైన్స్ ల్యాబ్‌ల్లో సౌకర్యాలు మెరుగుపరుస్తారు. ఆంగ్లంలో విద్యార్థులు అనర్గళంగా మాట్లాడేలా ప్రత్యేక ల్యాబ్ ఏర్పాటు చేస్తారు. బొమ్మలతో బోధన చేపడతారు. ఇ-క్లాస్ రూంలు, స్మార్ట్ బోర్డులు ఏర్పాటు చేస్తారు.



ఆటలు, సాంస్కృతిక సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ, ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవడం, విద్యార్థికి మానసిక స్వేచ్ఛ కల్పించడం, కౌన్సెలింగ్ ఇవ్వడం, దేశంపై సంపూర్ణ అవగాహన కల్పించటం వంటి వాటికి ప్రాధాన్యం ఇస్తారు. విద్యార్థుల్లో భాషాపరమైన అవరోధాలను అధిగమించేలా చూస్తారు. సౌర విద్యుత్తు సౌకర్యం, ఎల్‌ఈడీ దీపాలు ఏర్పాటు చేస్తారు. పోషకాహారం అందేలా విద్యాలయంలో పెరటి తోటల పెంపకం చేపడతారు.

విడతల వారీగా పూర్వ ప్రాథమిక విద్య- కె.దశరథరామ్, కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపల్
జాతీయ విద్యా విధానం-2020లో భాగంగా ఈ ఏడాది నుంచి కేంద్రీయ విద్యాలయంలో బాలవాటిక అందుబాటులోకి వచ్చింది. ఇది మూడు విధాలుగా ఉంటుంది. ఈ ఏడాది యూకేజీని ప్రారంభిస్తాం. వచ్చే ఏడాది ఎల్‌కేజీ, ఆ తర్వాత సంవత్సరం నర్సరీని ప్రారంభిస్తాం. విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యాబోధన చేసేందుకు చర్యలు చేపడతాం. పీఎంశ్రీ కింద కింద కేటాయించే విద్యాలయాలన్ని అన్ని రకాలుగా తీర్చిదిద్దుతాం.

# కొండారెడ్డిపల్లి చెరువుకు పర్యాటక కళ

మహబూబ్‌నగర్: నారాయణపేటలోని కొండారెడ్డిపల్లి చెరువు మరిన్ని అందాలను సంతరించుకోనుంది. మినీ ట్యాంక్‌బండ్ నిర్మాణంలో భాగంగా ఇప్పటికే చెరువు కట్టను ఆకర్షణీయంగా రూపుదిద్దారు. ఆహ్లాదం పంచేలా పచ్చదనం, పర్యాటకులను ఆకర్షించేందుకు మరింత అభివృద్ధి చేయాలనేది పురపాలక యంత్రాంగం ఉద్దేశం. చుట్టూ కొండలతో పచ్చని, ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొంది. ఇక్కడ ఇటీవల పర్యటించిన మంత్రి కేటీఆర్ చెరువు ప్రాంతాన్ని అభివృద్ధి



చేయాలని ఆదేశించారు. నారాయణపేట నుంచి దామరగిద్ద వెళ్లే ప్రధాన రహదారి సమీపంలో కొండారెడ్డిపల్లి చెరువు ఉంది. ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి చొరవతో రూ.4కోట్లతో చెరువును మినీ ట్యాంక్ బండ్‌గా రూపుదిద్దారు. కట్ట నిర్మాణం, స్మీస్మీ రహదారి, గార్డెనింగ్, బతుకమ్మ ఘాట్ల నిర్మాణం, దీపాలు ఏర్పాటు చేశారు..జనవరిలో ట్యాంక్‌బండ్‌ను ప్రారంభించేందుకు పురపాలక, ఐటీశాఖ మంత్రి కేటీఆర్ పేటకు వచ్చారు. అప్పుడే ఆయన దీని అభివృద్ధిపై ఆదేశాలు ఇచ్చారు. ఈ పరిస్థితిలో రూ.4కోట్లు మంజూరయ్యాయి.. చెరువు ప్రవేశ ప్రాంతం కాకుండా గుట్టప్రాంతంలో ఉన్న రెండు ఎకరాలలోనూ పార్కు, పిల్లల ఏరియా, ఓపెన్‌జిమ్, పెద్దలు, కుటుంబీకులతో సందర్శించడానికి వీలుగా పక్షులు, జంతువుల బొమ్మలు, పూలు, పచ్చిక నీడనిచ్చే మొక్కలతో ఆహ్లాద వాతావరణం పెంపొందించనున్నారు. ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి సహకారంతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతామని పేట మున్సిపల్ ఛైర్మన్ గందె అనసూయ చెప్పారు.

# 8వ గనిలో లేఆఫ్..

వరంగల్ : భూపాలపల్లి ఏరియాలోని సింగరేణి రెండు ఉపరితల గనులు వర్షంతో జలమయమయ్యాయి.. దీంతో బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయింది. కేటీకే ఉపరితల గని-3లోకి పక్కనే ఉన్న గుండ్ల వాగు నీరొచ్చి చేరింది. వర్షాలతో బొగ్గు ఉత్పత్తికి విఘాతం ఏర్పడగా సింగరేణికి దాదాపు రూ.34 కోట్ల నష్టం వాటిల్లింది. కేటీకే 8వ గని పక్కనే గుండ్లవాగు ప్రవహిస్తోంది. గురువారం కురిసిన భారీ వర్షంతో వాగు తెగిపోయి 8వ గని ఫ్యాన్ హౌజ్ వరకు నీరు వచ్చి చేరింది. మరికొంత నీటి ప్రవాహం పెరిగితే ఫ్యాన్‌హౌజ్ ద్వారా నీరు గనిలోకి వెళ్లే అవకాశం ఉంటుంది. ప్రమాదానికి ఆస్కారం ఏర్పడనుంది. విషయం గమనించిన ఏరియా జీఎం బళ్లారి శ్రీనివాసరావు ముందస్తు ఆలోచనతో కార్మికులను గనిలోకి పంపించవద్దని నిర్ణయం తీసుకున్నారు. గనికి లేఆఫ్ ప్రకటించారు. గని అధికారులకు ఆదేశాలు అందడంతో విధులకు రావొద్దని సూచించారు. దీంతో కార్మికులందరూ ఇళ్లకే పరిమితమయ్యారు. రెండు ఉపరితల గనుల్లో మట్టి వెలికితీత పనులు చేసే ఒప్పంద కార్మికులు, వాహనాల ఆపరేటర్లను భూపాలపల్లి పట్టణానికి తరలించారు. గనుల వద్ద ఉన్న వారి క్యాంపుల చుట్టూ నీరు పెరుగుతూ వస్తోంది. అందులో చిక్కుకుపోయే అవకాశం ఉండడంతో ముందస్తుగా వారిని దాదాపు 960 మందిని అక్కడి నుంచి తరలించారు. పట్టణంలోని సింగరేణి మూడు కమ్యూనిటీ హాల్‌లలో పునరావాసం కల్పించారు.

## రోడ్డేశారు.. విద్యుద్దీపాలు మరిచారు..!

పాల్వంచ : పాల్వంచ అంబేద్కర్ కూడలి నుంచి అల్లూరికూడలి వరకు ప్రధాన రహదారి విస్తరణ పనులు చివరి దశకు చేరాయి. 1.2 కి.మీ. మేర రూ.5కోట్లతో రెండు వరుసల తారు రోడ్డును నాలుగు వరుసలుగా విస్తరించడం, మధ్యలో డివైడర్‌తో పాటు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాల్సి ఉంది. ఈ పనులను 2023 మే1న రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు ప్రారంభించిన విషయం తెలిసిందే. పనులు దక్కించుకున్న గుత్తేదారుడు ఆతర్వాత తారురోడ్డు నిర్మించి, డివైడర్ మధ్యలో విద్యుత్తు స్తంభాలు ఏర్పాటు చేశారు. మిగతా పనులు నిలిచిపోయాయి. నిత్యం రద్దీగా ఉండే అంబేద్కర్ కూడలి నుంచి అల్లూరికూడలి వరకు ప్రధాన రహదారిపై రాత్రిపూట అంధకారం అలుముకుంటోంది. రోడ్డు పక్కనున్న స్తంభాలకు దీపాలు ఏర్పాటు చేయలేదు. వర్షాలు వస్తుండటం, రోడ్డుపై యథేచ్ఛగా పశువులు సంచరిస్తుండటంతో పాదచారులు, వాహనదారులు రాకపోకలకు భయపడుతున్నారు. డివైడర్ మధ్య



ఏర్పాటుచేసిన సెంట్రల్ లైటింగ్‌కు ట్రయల్‌రన్ పూర్తిచేసి వినియోగంలోకి తీసుకురావడం లేదు. అధికారులు చొరవ చూపాలని కేటీపీఎస్ ఉద్యోగులు, వాహనదారులు కోరుతున్నారు.రోడ్డు పనులు పూర్తి అయినప్పటికీ విద్యుత్తు దీపాలు లేకపోవడంతో రాత్రి సమయంలో ప్రయాణానికి ఇబ్బందులు పడుతున్నాం. సంబంధిత అధికారులు సెంట్రల్ లైటింగ్‌ను ప్రారంభిస్తే ప్రమాద భయం వీడుతుంది. దుకాణాల ఎదుట ఉన్న వెలుతురుపైనే రాకపోకలకు ఆధారపడాల్సి వస్తోంది. వందనపు శ్రీనివాసరావు, స్థానిక వ్యాపారిసెంట్రల్ లైటింగ్ పనులన్నింటినీ గుత్తేదారు పూర్తిచేయాల్సి ఉంది. తదుపరి నిర్వహణ బాధ్యతను మున్సిపల్ అధికారులకు అప్పగించాలి.రాజేశ్, పురపాలిక ఏఈ

## నాలాల ఆక్రమణలే ముంచాయి..

వరంగల్ : త్రినగరాలు వరద నీటిలో విలవిల్లాడుతున్నాయి. ప్రధాన, అంతర్గత రహదారులు.. చెరువులు, కుంటలను తలపించాయి. ఎన్నడూ లేని విధంగా కాలనీలను వరద ముంచెత్తింది. ఏకంగా 200 కాలనీలు నీట మునిగాయి. 2020 ఆగస్టులో వచ్చినదాంతో పోలిస్తే రెట్టింపు వరద నగర శివారు నుంచి పోటెత్తింది. చెరువులు అలుగు పారడంతో వరద కాలువలు ఉగ్రరూపం దాల్చాయి. కాజీపేట, హనుమకొండ, వరంగల్ ప్రాంతాల్లోని ప్రధానమైన నాలాలు ఆక్రమణలతో కుంచించుకుపోవడంతో ఈ సమస్య నెలకొంది. నాలాలు విస్తరించి, శాశ్వత పరిష్కారం చూపకపోవడంతో కాలనీలు నీట మునిగాయని నిపుణులంటున్నారు.

నయీంనగర్... హనుమకొండ ప్రాంతంలోని ఇది చాలా కీలకం. నగర నడిబొడ్డు నుంచి ప్రవహిస్తుంది.

6.5 కి.మీటర్ల మేర ఉంటుంది.

కాజీపేట సోమిడి కుంట, పెద్ద వడ్డేపల్లి చెరువు, గోపాల్‌పూర్ చెరువుల వరదనీరంతా కేయూ వంద అడుగుల రోడ్డు, సమ్మయ్యనగర్, విద్యానగర్, ప్రెసిడెన్సీ స్కూల్, నయీంనగర్, కొత్తూరు ఈద్గా, బొక్కలగడ్డ, పెద్దమ్మగడ్డ 100 అడుగుల రోడ్డు, భగత్‌సింగ్ నగర్ మీదుగా నాగారం చెరువు వైపు వెళ్తాయి. మూడేళ్ల కిందట 50 శాతం ఆక్రమణలు తొలగించారు.

నీటమునిగిన కాలనీలు: 25

వరద ప్రవాహం: 10 వేల క్యూసెక్కులు

హంటర్‌రోడ్ బొందివాగు...



వరంగల్ ప్రాంతంలో అత్యంత ప్రమాదకరమైనది.

1.1 కి.మీ

బొందివాగు నాలా నుంచి వరద నీరంతా భద్రకాళి చెరువు, పక్కనే ఉన్న భద్రకాళి నాలాకు వెళ్తాయి. తిమ్మాపూర్, బెస్తం, మద్దెలకుంట, కొండపర్తి, అమ్మవారిపేట దామెర, భట్టుపల్లి, న్యూశాయంపేట కోటి, ఉర్సు రంగసముద్రం చెరువుల నుంచి వరదనీరు ఈ నాలాకు వస్తుంది.

ఆక్రమణలు తొలగించ లేదు.

దేశాయిపేట చిన్నవడ్డేపల్లి నాలా.. 4.5 కి.మీ.ఎనుమాముల శివారు, కాశీబుగ్గ వరదనీరంతా దీనిలోకి వస్తాయి. దేశాయిపేట సీకేఎం కళాశాల నుంచి డాక్టర్స్ కాలనీ మీదుగా ములుగురోడ్ కోట చెరువులోకి వరద నీరు వెళ్తుంది.

పోతననగర్... వరంగల్ చౌరస్తా, శివనగర్, పెరుకవాడ, కరీమాబాద్ వైపు నుంచి వరదనీరంతా వరంగల్ పోతననగర్ నాలాకు వస్తాయి.ఒక కి.మీ. విస్తీర్ణం. నాలా అభివృద్ధి పనులు సగం చేసి వదిలేశారు. 10-12 వేల క్యూసెక్కులు

భద్రకాళి నాలా.. వరంగల్, హనుమకొండ ప్రాంతంలో ఇది కీలకం. బొందివాగు, పోతననగర్ నాలా నుంచి రంగంపేట భద్రకాళి నాలాకు వరదనీరు చేరుతుంది. 4.5 కి.మీ. విస్తీర్ణం. 10-15 కాలనీలు నీట మునిగాయి. 2020 అక్టోబరులో విస్తరించినా చుట్టూ గోడలు మాత్రం కట్టలేదు. 12-15

# ఊరూరా వరద



ఖమ్మం: ఊరూఏరూ ఏకమయ్యాయి. వాగులు, వంకలు పొంగిపొర్లాయి. ఓవైపు భారీ వర్షాలు, మరోవైపు వరదల ఉద్ధృతితో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలు విలవిలలాడాయి. అనేక ప్రాంతాల్లో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. చాలా ఏళ్ల తర్వాత ఖమ్మం నగరంలో మున్నేరు మహోగ్రరూపం దాల్చింది. భద్రాచలం వద్ద గోదావరి క్రమంగా శాంతిస్తోంది.

నీటమునిగిన పంట పొలాలు

ప్రధాన జలాశయాలకు భారీగా వరద నీరు చేరుతోంది. ఇప్పుడిప్పుడే జీవం పోసుకుంటున్న పంటలను వరదలు ముంచెత్తాయి. ముంపు ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ఉభయ జిల్లాల్లో అధికారులు పటిష్ఠ చర్యలు చేపట్టారు. ఖమ్మం జిల్లాలో సుమారు 4వేల మంది బాధితులను పునరావాస కేంద్రాలకు తరలించగా 1,000 ఇళ్లను ఖాళీ చేయించారు. పది పునరావాస కేంద్రాలు తెరిచారు. ఖమ్మం నగరంలోనే సుమారు 3వేల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. భద్రాద్రి జిల్లాలో భద్రాచలం, దుమ్ముగూడెం, చర్ల, అశ్వాపురం, మణుగూరు, పినపాక, గుండాల, కొత్తగూడెం, లక్ష్మీదేవిపల్లి మండలాల్లో 18 గ్రామాలు, 42 ఆవాసాలు ముంపునకు గురయ్యాయి. సుమారు 1,400 కుటుంబాలకు చెందిన 3,500 మందిని పునరావాస కేంద్రాలకు అధికారులు తరలించారు. సాధారణ పరిస్థితులు నెలకొనే వరకూ పునరావాస కేంద్రాల్లోనే ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

మంత్రి పువ్వాడ దిశానిర్దేశం

మున్నేరు ఉగ్రరూపం, భద్రాచలం వరద పరిస్థితిపై అధికారులకు దిశానిర్దేశం చేస్తూనే వరద సహాయక చర్యలను రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పర్యవేక్షించారు. ఖమ్మంలో మున్నేరు వరద ప్రభావిత కాలనీల్లో పర్యటించారు. సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని బాధితులకు సూచించారు. ఆతర్వాత భద్రాచలం చేరుకుని అధికారులతో సమీక్ష జరిపారు. ఖమ్మం నగరంలో మున్నేరు వరద ఉద్ధృతిలో చిక్కుకున్న పదకొండు మందిని కాపాడేందుకు కలెక్టర్ వీపీ గౌతమ్, సీపీ విష్ణువారియర్‌తో కలిసి మూడు నాలుగు గంటల పాటు అక్కడే మకాం వేశారు. మంత్రి చొరవతో విశాఖపట్నం నుంచి కొత్తగూడెం మీదుగా ఎన్డీఆర్ఎఫ్ బృందాలు ఖమ్మం చేరుకున్నాయి. రాత్రి 8 గంటల సమయంలో బాధితులందరినీ ఎన్డీఆర్ఎఫ్ బృందాలు సురక్షిత ప్రాంతాలకు తీసుకొచ్చాయి. మిగతా చోట్ల వరదలో చిక్కుకున్న మరో 17 మందిని కాపాడాయి.

ఖమ్మాన్ని చుట్టుముట్టిన మున్నేరు

గతంలో ఎన్నడూ లేని విధంగా ఖమ్మం నగరంలోని పలు ప్రాంతాలను మున్నేరు చుట్టుముట్టి అతలాకుతలం చేస్తోంది. మున్నేరు నదికి ఆనుకున్న దానవాయిగూడెం, రామన్నపేట, పద్మావతినగర్, గణేశ్‌నగర్, ఎఫ్‌సీఐ గోదాముల ప్రాంతం, సారథినగర్, జూబ్లీపుర, కాల్వొడ్డు, బొక్కలగడ్డ, మోతీనగర్, ప్రకాశ్‌నగర్ ప్రాంతాల్లోని వేలాది ఇళ్లల్లోకి వరద నీరు ప్రవేశించింది. హిందూ శ్మశాన వాటిక పూర్తిగా మునిగిపోయింది. సారథినగర్‌లో కలెక్టర్ క్యాంపు కార్యాలయం వెనుక ప్రాంతంలోని వీధుల్లోకి వరద నీరు చేరింది. 2004లో అత్యధికంగా మున్నేరుకు 25 అడుగుల వరకు వరద రాగా తాజాగా 30.70 అడుగుల మేర నీరు ప్రవహిస్తోంది. ఖమ్మం వద్ద 6.50 లక్షల క్యూసెక్కుల నీరు దిగువకు ప్రవహిస్తోంది. ప్రకాశ్‌నగర్ వద్ద హైలెవల్ వంతెన పైకి వరద నీరు చేరింది. వంతెన పరిసరాల నుంచి నీరు రోడ్డుపైకి.. అక్కడి నుంచి వంతెన పైకి ప్రవహిస్తోంది. ప్రకాశ్‌నగర్ వంతెనపై వాహనాల రాకపోకలను పోలీసులు నిషేధించారు. పోలీస్ హెడ్ క్వార్టర్స్ సమీపంలో ప్రధాన రహదారిపై నీరు చేరటంతో ప్రకాశ్‌నగర్ వైపు రాకపోకలు నిలిచిపోయాయి. ఇళ్లల్లోకి నీరు రావటంతో విలువైన సామాన్లు కొన్నింటిని చేత పట్టుకుని చాలామంది పునరావాస కేంద్రాలకు చేరుతున్నారు. నగరంలోని పలు వీధుల్లో అధికారులు పడవల్లో తిరుగుతూ సహాయక చర్యలు చేపడు తున్నారు. మున్సిపల్ కమిషనర్ ఆదర్శ్ సురభి, శిక్షణ కలెక్టర్ రాధిక గుప్తా, పలువురు పోలీసు, రెవెన్యూ, మున్సిపల్, విద్యుత్తు అధికారులు సహాయక చర్యల్లో పాల్గొంటున్నారు. నయాబజార్ కళాశాలలోని పునరావాస కేంద్రంలో ఖరీదైన టమాటాలతో కూరలు చేస్తున్నారు. ఖమ్మం మార్కెట్‌లో కిలో టమాటా రూ.160, పచ్చి మిర్చి రూ.100 ధర పలికింది ఖమ్మం-బోనకల్లు రోడ్డుపైకి ధంసలాపురం ఆర్వోబీ(రైల్వే ఓవర్ బ్రిడ్జి) దిగిన తర్వాత వరద నీరు చేరింది. దీంతో బోనకల్లు రోడ్డుపై రాకపోకలు నిలిచిపోయాయి.

మున్నేరు వరద ఉద్ధృతి, తీసుకుంటున్న చర్యలపై కలెక్టర్ గౌతమ్‌ను ఎంపీ నామా నాగేశ్వరరావు ఫోన్ ద్వారా అడిగి తెలుసుకున్నారు. పారిశుద్ధ్య చర్యలను పటిష్ఠంగా చేపట్టాలని సూచించారు. వ్యాధులు ప్రబలకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

కంట్రోల్ రూమ్‌కు ఫోన్ కాల్స్

మున్నేరు నది సహా వైరా, పాలేరు నదులకు వరద ఉద్ధృతి పెరగటంతో పలువురు బాధితులు సహాయం కోసం కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూమ్‌కు ఫోన్ చేశారు. వరద బాధితులు పునరావాస కేంద్రాలకు వెళ్లేందుకు వివరాలు చెప్పాలని కోరారు. కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూమ్‌కు 26 ఫోన్ కాల్స్ రాగా సిబ్బంది సమాచారం అందించారు. సహాయం కోసం టోల్ ఫ్రీ నంబర్ 1077, వాట్సాప్ నంబర్ 90632 11298 కు ఫోన్ చేయవచ్చునని కలెక్టర్ గౌతమ్ సూచించారు.

## ప్రమాదంలో ప్రాథమికోన్నత విద్య..!



కొత్తగూడెం : గురువు లేని విద్య.. గుడ్డి విద్య అన్నాడు ఓ కవి. నిజమే ఆ సామెతకు సరిపోయేలా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో చదువులు కొనసాగుతున్నాయి. సర్కారు బడుల్లో తరగతికో ఉపాధ్యాయుడు అనే మాట కలగానే మారుతోంది. ఏళ్ల తరబడి ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా వేధిస్తుండటంతో ప్రాథమిక, ప్రాథమికోన్నత విద్య ప్రమాదంలో పడిపోతోంది. పునాది బలంగా లేక.. ఉన్నత పాఠశాలలకు వెళ్తున్న విద్యార్థులకు కనీసం చదవటం, రాయటం కూడా రాలేని దుస్థితి నెలకొంది. విద్యార్థులు తక్కువ ఉన్న సర్కారు బడుల నుంచి బాలబాలికలు అధికంగా ఉన్నచోట్ల ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని రాష్ట్ర విద్యాశాఖ ఇటీవల ఉత్తర్వు- 25ను జారీ చేసింది. అయినా అనేకచోట్ల నిబంధలకు విరుద్ధంగా డిప్యుటేషన్లు జరిగాయని ఉపాధ్యాయ వర్గాలు వాపోతున్నాయి. కొన్ని మండలాల్లో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు నిర్వీర్యమయ్యేలా ఉపాధ్యాయుల సర్దుబాటు జరిగిందని ఆరోపిస్తున్నాయి.

జిల్లాలో ఇదీ పరిస్థితి..

జిల్లా వ్యాప్తంగా 777 ప్రాథమిక, 162 ప్రాథమికోన్నత, 111 ఉన్నత పాఠశాలలున్నాయి. వీటన్నింటిలో 4,357 ఉపాధ్యాయులకు 3,589 మంది విధులు నిర్వర్తిస్తున్నారు. 768 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులు లేకపోతే సర్దుబాటు చేయాలని విద్యాశాఖ ఉన్నతాధికారులు ఇటీవల ఆదేశించారు. జిల్లాలో 134 మంది ఉపాధ్యాయుల సర్దుబాటుకు అధికారులు రంగం సిద్ధం చేశారు. సర్దుబాటుతో కొన్ని మండలాల్లో ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత విద్యాలయాలు ప్రమాదంలో పడ్డాయి. చర్ల, పినపాక, టేకులపల్లి, పాల్వంచ, లక్ష్మీదేవిపల్లి మండలాల్లో అనేక ప్రాథమికోన్నత పాఠశాలలను ప్రాథమిక విద్యకే పరిమితమవుతున్నాయి. ఆరు, ఏడు తరగతులకు బోధించే సబ్జెక్టు టీచర్లను డిప్యుటేషన్‌పై పంపించారు. గతేడాది విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా సర్దుబాటు చేశారు. ఫలితంగా సర్దుబాటు పేరిట ఏజెన్సీ ప్రాంతంలో విద్యార్థులను చదువులకు దూరం చేయటం సరికాదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చర్ల మండలం రేగుంట ప్రాథమికోన్నత పాఠశాలలో ఆరు, ఏడు తరగతులు బోధించేందుకు ఉపాధ్యాయులను లేకుండా చేయటమంటే మా పిల్లలకు అన్యాయం చేసినట్లే. ఒకే పాఠశాల నుంచి తెలుగు, హిందీ, ఫిజిక్స్ ఉపాధ్యాయులు ముగ్గురిని డిప్యుటేషన్‌పై పంపించటం సమంజసమా? జిల్లా విద్యాశాఖాధికారులు ఆలోచించి ఇక్కడికి ఉపాధ్యాయులను తిరిగి పంపించాలి.కాక ముత్యాలు, విద్యార్థి తండ్రి, రేగుంట

ఉత్తర్వు- 25 ప్రకారం సర్దుబాటు చేయాలి. సమీప పాఠశాలలు, కాంప్లెక్స్, మండలాల్లో లేనిపక్షంలో దగ్గరున్న మండలాల ఉపాధ్యాయులను డిప్యుటేషన్‌పై పంపించాలి. ఇష్టారాజ్యంగా సర్దుబాటు చేయటంతో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో బోధన కుంటుపడే ప్రమాదముంది.నంది కృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి, యూటీఎఫ్

## నల్లబల్లలకు రంగేశారు.. విద్యార్థులు కంగుతిన్నారు..!

ఖమ్మం : కొండ నాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడిపడ్డట్టు తయారైంది కొన్ని ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి. ఖమ్మం నగరం నడిబొడ్డున ఉన్న రోటరీనగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను 'మన బస్తీ- మన బడి' కింద అభివృద్ధి చేసేందుకు రూ.34.90 లక్షలను సర్కారు కేటాయించింది. అధికారులు తాగునీటి వసతి కల్పించారు. ఫ్యాన్లు, విద్యుద్దీపాలు, పిల్లలు కూర్చునేందుకు బల్లలు ఏర్పాటు చేశారు. భవనానికి రంగులు వేసే సమయంలో తరగతి గదుల్లోని నల్లబల్లలనూ వదల్లేదు. పాఠశాల పునఃప్రారంభం నాటికి తరగతి గదుల్లో గ్రీన్ బోర్డులు ఏర్పాటు చేస్తామని అధికారులు చెప్పారు. పాఠశాల ప్రారంభమై 40 రోజులు దాటినా అటు నల్లబల్లలు లేక కొత్తగా గ్రీన్ బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో 169 మంది విద్యార్థుల చదువులు సక్రమంగా సాగటం లేదు. పాఠశాల ప్రారంభమైనప్పటి నుంచి ఉపాధ్యాయులు చదువుతూ పాఠాలు బోధిస్తున్నారు. విద్యార్థులతో చదివిస్తున్నారు. రాత పుస్తకాల్లో రాయిస్తున్నారు. ఈ క్రమంలో పాఠాలు అర్థం కాక విద్యార్థులు తలలు పట్టుకుంటున్నారు. కొన్నిసార్లు తరగతి గదుల గోడలపైనే రాస్తూ పాఠాలు చెప్పేందుకు ఉపాధ్యాయులు ప్రయత్నిస్తున్నా సరిగ్గా కనిపించటం లేదని విద్యార్థులు వాపోతున్నారు. వెంటనే గ్రీన్ బోర్డులు ఏర్పాటు చేసేలా అధికారులు చొరవ చూపాలని కోరుతున్నారు.

## బడిలో.. మడిలో..!

భువనగిరి : కళాశాలలో చదివిన చదువు.. క్షేత్రస్థాయిలో అనుభవ పూర్వకంగా తెలుసుకునేందుకు ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాలలో బీఎస్సీ అగ్రికల్చర్ నాలుగో సంవత్సరం చదువుతున్న విద్యార్థినులు యాదాద్రి భువనగిరి జిల్లాకు చేరుకున్నారు. ఏరువాక శాస్త్రవేత్తల పర్యవేక్షణలో అయిదు నెలల పాటు విద్యార్థినులు వారికి కేటాయించిన గ్రామాలలోనే నివాసం ఉంటూ వ్యవసాయ పనులపై అధ్యయనం చేస్తారు. మూడేళ్లలో నేర్చుకున్న వ్యవసాయ విజ్ఞానానికి తోడు ప్రత్యక్షంగా వ్యవసాయ క్షేత్రాల ద్వారా సంపూర్ణ జ్ఞానం పొందేందుకు ఈ అధ్యయనం తోడ్పడుతుంది. వ్యవసాయానికి సంబంధించి రైతుల సమన్వయంతో పనులు పరిశీలించి, స్వయంగా పనుల నిర్వహణలో పాల్గొంటారు.. కళాశాల నుంచి 35 మంది విద్యార్థినులు రాగా ఏడు మండలాల్లో ఒక్కో గ్రామాన్ని ఎంపిక చేసి ఐదుగురు చొప్పున కేటాయించారు. మోటకొండూరు, మోత్కూర్, తుర్కపల్లి, రాజపేట, ఆత్మకూరు మండల కేంద్రాలతో పాటు ఆలేరు మండలం కొలనుపాక, యాదగిరిగుట్ట మండలం వంగపల్లి గ్రామంలో అధ్యయనం కోసం విద్యార్థినులు తాత్కాలిక వసతి సౌకర్యం ఏర్పాటు చేసుకొన్నారు.

పరిశీలన ఇలా..

క్షేత్రస్థాయిలో రైతులతో మమేకమై పంటల సాగులో పాలుపంచుకుంటారు. విత్తనాలు విత్తడం నుంచి పంటలు కోతకు వచ్చే వరకు రైతులతో మమేకమై వారు చేస్తున్న పనిలో పాలు పంచుకుంటారు.



పొద్దున లేచింది మొదలు సాయంత్రం వరకు రైతులు ఎదుర్కొనే సమస్యలు తెలుసుకుంటారు. వీరికి తెలిసిన ఆధునిక వ్యవసాయ పరిజ్ఞానాన్ని రైతులకు అందిస్తారు. ప్రతీవిషయాన్ని క్షుణ్ణంగా పరిశీలించి అనుభవం గడిస్తారు. చీడపీడల నుంచి రక్షించుకునేందుకు రైతు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో గమనించి తాము పాఠ్యాంశాల ద్వారా నేర్చుకున్న విషయాల ద్వారా తగిన సూచనలు ఇస్తారు. అతి వృష్టి, అనావృష్టి వాతావరణ ప్రభావాన్ని గమనిస్తూ రైతుల స్థితిగతులపై సర్వే ద్వారా అధ్యయనం చేస్తారు. రైతులకు అవగాహన, శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తారు. పూర్తి అధ్యయనం తర్వాత నివేదిక తయారు చేసి రికార్డులను ఏరువాక శాస్త్రవేత్తలకు అప్పగించి మార్కులు పొందుతారు.

అధ్యయనంతో అవగాహన

-అనిల్‌కుమార్, ఏరువాక శాస్త్రవేత్త

గ్రామంలో ప్రతి విద్యార్థినికి ఒక అతిథి రైతును కేటాయిస్తాం. రైతు ద్వారా అనేక విషయాలను అధ్యయనం చేస్తారు. ప్రతి 15 రోజులకోసారి ప్రత్యేక తరగతి నిర్వహించి వారు నేర్చుకున్న అంశాలతో పాటు మేం కొంత బోధిస్తాం. పరీక్షలు నిర్వహిస్తాం. విద్యార్థి తనకు కేటాయించిన రైతు విత్తనం విత్తడం నుంచి పంట కోత వరకు చేపట్టే పనులను రైతుతో మమేకమై గమనిస్తూ ప్రత్యక్ష అనుభవం గడిస్తారు. విద్యార్థులు పొందిన అనుభవం వారి భవిష్యత్‌లో ఓ అధికారిగా, ఉన్నతమైన వృత్తిలో కొనసాగినప్పుడు రైతు సేవకు ఉపయోగపడుతుంది. చివరి 45 రోజుల ముందు వ్యవసాయ, లేదా వ్యవసాయ అనుబంధ పరిశ్రమలో అధ్యయనం కోసం కేటాయిస్తాం. పరిశ్రమలో ముడి సరకుల నుంచి విలువ ఆధారిత పదార్థాల తయారీ, మార్కెటింగ్ గురించి నేర్చుకుంటారు. చివరలో విద్యార్థుల నైపుణ్యాన్ని పరిశీలించి వైవా నిర్వహిస్తాం. ఇందుకు మార్కులు ఉంటాయి.

## బియ్యం లేవు.. డబ్బులు తీసుకోండి..!

సూర్యాపేట : ఇన్నాళ్లు 'తీసుకుంటే బియ్యం.. లేదంటే డబ్బులు' అనే పద్ధతిలో కొనసాగిన రేషన్ డీలర్ల వ్యవహారం తాజాగా మరో అడుగు ముందుకేసి ' బియ్యం లేవు.. డబ్బులు తీసుకోండి..' అని చెప్పే స్థాయికి ఎదిగిపోయారు. జిల్లాలోని చాలా రేషన్ దుకాణాల్లో ఈ తంతు యథేచ్ఛగా కొనసాగుతోంది. గత్యంతరం లేక లబ్ధిదారుల్లో చాలా మంది డబ్బులు తీసుకొని వెళ్తున్నారు. ఇలా డీలర్ల వద్ద మిగిలిపోయిన బియ్యాన్ని టోకుగా వ్యాపారులకు అధిక ధరకు విక్రయిస్తున్నారు. కొంత మంది వ్యాపారులు డీలర్ల నుంచి సేకరించిన బియ్యాన్ని డీసీఎం, లారీల్లో పక్కనే ఉన్న ఆంధ్రప్రదేశ్‌కు గుట్టుగా తరలిస్తున్నారు. మరికొంత మంది కోళ్ల దాణాకు వినియోగిస్తున్నారు.

రూ.8కి కొనుగోలు.. రూ.10కి విక్రయం

జిల్లా వ్యాప్తంగా 23 మండలాల్లో 610 రేషన్ దుకాణాలు ఉన్నాయి. మొత్తం 3,24,438 ఆహార భద్రత కార్డుల ద్వారా ఒక్కో కుటుంబ సభ్యుడికి ఐదు కిలోల చొప్పున ప్రతి నెలా సుమారు 50 లక్షల కిలోల బియ్యాన్ని ప్రభుత్వం పంపిణీ చేస్తోంది. ఇందులో దాదాపు యాభై నుంచి అరవై శాతం బియ్యం పక్కదారి పడుతున్నాయి. పేదలకు రేషన్ బియ్యం సరఫరా కోసం ప్రభుత్వం నెలకు సుమారు రూ.13.50 కోట్లు వెచ్చిస్తోంది. కానీ, ఆ బియ్యం రేషన్ దుకాణాల్లోనే పక్కదారి పడుతోంది. రేషన్ దుకాణాల్లో బియ్యం ఇవ్వకుండా కిలోకు రూ.8కి లబ్ధిదారుడికి చెల్లించి.. డీలర్లు రూ.10 నుంచి రూ.12 వరకు దళారులకు విక్రయిస్తున్నారు. ఈ వ్యవహారం బహిరంగంగా సాగుతున్నా అధికారులు దృష్టిసారించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

లోపిస్తున్న పర్యవేక్షణ

అధికారుల పర్యవేక్షణ లోపం డీలర్లకు వరంగా మారింది. జిల్లా కేంద్రంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోనూ ఈ బియ్యం దందా ఇష్టారాజ్యంగా కొనసాగుతున్నా.. ఇదేంటని ప్రశ్నించే వారు కరవయ్యారు. వ్యాపారులు, కొంత మంది డీలర్లు సిండికేట్‌గా మారి దొడ్డిదారిలో రేషన్ బియ్యాన్ని సరిహద్దులు దాటించేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు రేషన్ డీలర్లపై దృష్టిసారించి బియ్యం పంపిణీ సవ్యంగా జరిగేలా చర్యలు తీసుకోవాల్సి ఉంది.

సమాచారం అందిస్తే చర్యలు తీసుకుంటాం-పుల్లయ్య, డీఎస్వో, సూర్యాపేట

డీలర్లే రేషన్ బియ్యాన్ని లబ్ధిదారుల నుంచి కొనుగోలు చేస్తున్నట్లు మా దృష్టికి రాలేదు. ఇలాంటి అక్రమాలకు పాల్పడితే డీలర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం. రేషన్ బియ్యం ఎక్కడైనా పక్కదారి పడుతున్నట్లు తెలిసినా సమాచారం అందిస్తే చర్యలు తీసుకుంటాం. జిల్లాలో రెవెన్యూ అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తున్నారు.

# జలమే బలం.. పొదుపే మంత్రం

కొత్తగూడెం :ఇంట్లో నల్లా తిప్పి నీళ్లు పట్టుకోవడం పెద్ద కష్టం కాకపోవచ్చు. కానీ ఆ నీళ్లు ఎక్కడ్నుంచి సరఫరా అవుతున్నాయి? ఎంతదూరం నుంచి పట్టణాలకు చేరుతున్నాయి? ప్రతి లీటరు సేకరించి శుద్ధి చేయడానికి ఎంత ప్రజాధనం ఖర్చవుతుంది? నిత్యం ఏమేరకు జలాలు వృథా అవుతున్నాయి? అని ఆలోచిస్తే నీటి విలువెంతో అవగతం అవుతుంది. ఇదంతా ప్రజలకు విడమర్చి చెబితే కచ్చితంగా ఫలితం ఉంటుందని పురపాలక శాఖ భావిస్తోంది. వృథా అడ్డుకట్టకు ఈ సీజన్‌లో 'అవగాహన మంత్రం' ప్రయోగిస్తోంది. పట్టణాల్లో తాగునీటి వృథా ఎక్కువగా ఉంది. దీన్ని అరికట్టడానికి రాష్ట్ర పురపాలక శాఖ (సీడీఎంఏ) ఈ ఏడాది వేసవిలో కొత్త ప్రయోగం చేస్తోంది. ఎక్కువ నీటి వృథా జరుగుతున్న ఇళ్లను గుర్తించి, వారికి కౌన్సెలింగ్ ఇవ్వడం ద్వారా సత్ఫలితాలు రాబట్టాలని చూస్తోంది. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల పరిధిలోని ఏడు పురపాలక సంఘాలు, ఒక నగరపాలక సంస్థ ఉంది. వాటి పరిధిలో 232 వార్డులున్నాయి. ఆయా వార్డుల్లో ఉన్న భవనాల సంఖ్య 1,95,690. ఒక్కో పురపాలకంలో తొలుత ఐదు వార్డులను.. ప్రతి వార్డుల్లో 500 చొప్పున నివాసాలు ఎంపిక చేయనున్నారు. ఆయా కుటుంబాలకు కౌన్సెలింగ్ ఇవ్వనున్నారు. ప్రధానంగా మురికివాడలు, శివారు ప్రాంతాల్లో దృష్టి సారించనున్నట్లు ఆ విభాగం అధికారులు చెబుతున్నారు. రెండు మూడ్రోజుల్లో ప్రక్రియను ప్రారంభించనున్నారు.

ఇదీ.. పరిస్థితి..పట్టణాల్లో సరఫరా సమయంలోనే నల్లా నీళ్లు భారీగా



వృథా అవుతున్నాయి. శివారులో అయితే సాధారణ రోజుల్లో గంట నుంచి గంటన్నర వరకు నీటి సరఫరా జరుగుతుంది. చాలా కాలనీల్లో ఇళ్లకు ప్రత్యేకంగా సంపులు లేవు. వచ్చే నీటిని బిందెలు, డ్రమ్ముల్లో అప్పటికప్పుడు పట్టుకోవాలి. ఆ తర్వాత నల్లాలను బంద్ చేయాలి. అయితే చాలామంది ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. కొందరు పైపులు బిగించి ఇంటి ఆవరణ, ఇంటి ముందున్న రోడ్డును శుభ్రం చేసుకుంటున్నారు. ఇంకొందరు మొక్కలకు పడుతున్నారు. పలువురు ద్విచక్రవాహనాలు, కార్లు శుభ్రం చేస్తున్నారు. ఫలితంగా ఎగువ ప్రాంతాల్లో సరిగా నీళ్లు అందని పరిస్థితి దాపురిస్తోంది. వృథాను అరికడితే ఎద్దడి ఎదుర్కొంటున్న కాలనీలకు మళ్లించడానికి అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో ప్రతి నీటి బొట్టు సద్వినియోగమయ్యేలా చూడాలని అధికారులు భావిస్తున్నారు.

ఏదైనా ఇంటి నుంచి నీరు వృథాగా పోతున్నట్లు గుర్తిస్తే వెంటనే అప్రమత్తం చేస్తారు. జాగ్రత్తలు తెలియజేస్తారు. నీటి విలువపై కౌన్సెలింగ్ ఇస్తారు.

ఇలా పలుమార్లు అవగాహన కల్పించడం ద్వారా మార్పు వస్తుందని అధికారులు భావిస్తున్నారు.

ఆ తర్వాత మిగతా వార్డుల్లోనూ మరికొన్ని కాలనీలను ఎంపిక చేసి ఇదే తరహా చర్యలు చేపట్టనున్నారు.

తీసుకోనున్న చర్యలివే...

ప్రస్తుతం రెండు జిల్లాలోని ప్రధాన పట్టణాల పరిధిలో రోజుకు దాదాపు 341 ఎంఎల్‌డీల తాగునీరు డిమాండ్ ఉంది. కేవలం 260 ఎంఎల్‌డీలు మాత్రమే సరఫరా చేయగలుగుతున్నారు.

నీటి సరఫరాకు 35 మెగావాట్ల విద్యుత్తు వినియోగిస్తున్నారు. ప్రతినెలా విద్యుత్తు బిల్లుల కింద చెల్లిస్తున్న మొత్తం రూ.1.15 కోట్లు.

ఈ లెక్కన ప్రతి 1,000 లీటర్ల సరఫరాకు చేస్తున్న వ్యయం సుమారు రూ.50.

సరఫరా చేస్తున్న నీటిలో సుమారు 40 శాతానికి కనీస లెక్కలు ఉండటం లేదు. 20 శాతం లీకేజీలు, మిగతా మొత్తం అక్రమ నల్లాలు, మోటార్లు బిగించడం, అనవసర వృథాగా లెక్కిస్తున్నారు.

ఈ నేపథ్యంలో నీటి వృథాను గుర్తించి పొదుపుగా వాడుకోవాల్సిన అవసరంపై అవగాహన కల్పించనున్నారు.

తొలుత ఎంపిక చేసిన వార్డుల్లో స్థానిక స్వయం సహాయక సంఘాల సభ్యులు, పంపు ఆపరేటర్లు, సిబ్బందితో కలిసి అధికారులు పర్యటిస్తారు. నీటి సరఫరా జరిగే సమయంలో సుమారు 500 ఇళ్లల్లో పరిస్థితిని పరిశీలిస్తారు. ఆయా నివాసాల్లో నీళ్లు ఏఏ మార్గాల్లో వృథా అవుతున్నాయి? ఎవరైనా వాహనాలు శుభ్రం చేస్తున్నారా? మురుగు కాల్వలోకి వదిలేస్తున్నారా? అనేది చూస్తారు.

# భద్రాద్రి సొబగులు

మణుగూరు : రాష్ట్రానికి విద్యుత్తు వెలుగులు అందిస్తున్న ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు మణుగూరు సమీపంలోని భద్రాద్రి థర్మల్ విద్యుత్తు కేంద్రం. రణగొణ ధ్వనులు, దుమ్ము, దూళితో ఉండే ప్లాంట్ పరిసరాలు క్రమేణా మారుతున్నాయి. ప్లాంట్ ఆవరణ పచ్చదనంతో ఆహ్లాదంగా మారుతోంది. మొత్తంగా కొత్త రూపు సంతరించుకుంటోంది. 30 శాతం పచ్చదనం: నిబంధనల మేరకు ప్లాంట్ నిర్మాణం కోసం సేకరించిన భూమిలో 30 శాతం గ్రీనరీ ఏర్పాటు చేయాలి. నిర్మాణ భెల్ సంస్థ బీటీపీఎస్‌కి చెందిన 350 ఎకరాల్లో గ్రీనరీని ఏర్పాటు చేస్తుంది. ఇప్పటికే కూలింగ్ టవర్, యాష్‌పాండ్, ఇతర ఖాళీ ప్రదేశాల్లో వందలకొద్దీ మొక్కలు నాటారు. ప్రధాన గేట్‌కి సమీపంలో ఏర్పాటుచేసిన ఫౌంటెన్ అకర్షణీయంగా ఉంది. పచ్చదనంతోపాటు అంతర్గత రహదారులు, వీధి దీపాలు, ఎల్‌ఈడీ రోప్ లైట్లు ఏర్పాటు చేశారు. రహదారుల వెంట డ్రైన్లు నిర్మిస్తున్నారు. రాత్రి వేళల్లో వీధి దీపాలు వెలుగులు జిలుగులతో ఆకట్టుకొంటున్నాయి. దీంతో సందర్శకుల తాకిడి పెరుగుతుంది. సాయంత్రం వేళల్లో పరిసర గ్రామాల ప్రజలు ఫౌంటెన్, కూలింగ్ టవర్ పరిసరాల్లో సరదగా గడిపి ఫొటోలు దిగుతున్నారు. సందర్శకుల కోసం కూలింగ్ టవర్ వద్ద విజిటింగ్ ప్రదేశాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఈ పనులు జరుగుతున్నాయి. స్టార్ హొటల్‌ని తలపించేలా : ఉద్యోగులకు ప్రత్యేకంగా హాస్టల్ భవనాన్ని జెన్కో నిర్మించింది. విద్యుదుత్పత్తి, రైలు మార్గం నిర్మాణం ఇతర అవసరాల నిమిత్తం ఇతర ప్రాంతాల నుంచి రాకపోకలు సాగిస్తుంటారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే ఉద్యోగులకు వసతి, భోజనం అందించాల్సిన బాధ్యత జెన్కోదే. ఈ క్రమంలో సాంబయ్యగూడెం వద్ద రూ.5 కోట్లతో హాస్టల్ భవనాన్ని నిర్మించారు. భవనం ఫైవ్‌స్టార్ హొటల్‌ని తలపించేలా ఉంది. లిఫ్టు సౌకర్యంతో ఆధునిక వసతులు ఏర్పాటు చేస్తున్నారు. పనులు తుది దశకు చేరుకొన్నాయి. "బీటీపీఎస్ ఆవరణ ఏడాదిలోపు పూర్తిగా మారుతుంది.

# పసుపు రంగు మిరప భలే



ఖమ్మం : తెలుగు రాష్ట్రాల్లో పండించే వాణిజ్య పంటల్లో మిరపకు మంచి డిమాండ్ ఉంది. ప్రపంచం మొత్తం మీద మిరపలో 400 రకాలు ఉన్నట్లు గుర్తించారు. వీటిలో తెలంగాణలో అత్యధిక రకాలను సాగు చేస్తున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ప్రస్తుతం ఎరుపు రంగు రకాలైన తేజా, లావులు, చపాటాలను సాగు చేస్తున్నారు. ఇటీవల కొంతమంది రైతులు పసుపు రంగు మిరపపై ఆసక్తి చూపుతున్నారు. ఖమ్మం జిల్లాలోని తిరుమలాయపాలెం, ఏన్కూరు మండలాల్లో ఈ రకం సాగు చేశారు. క్వింటాకు రూ.35 వేల నుంచి రూ.40 వేల వరకు ధర ఉంటుందని రైతులు భావిస్తున్నారు.

మార్కెట్లో డిమాండ్ ఉందని...

మార్కెట్‌లో ఈ రకానికి డిమాండ్ ఉండటం, చీడ పీడలు, ఎరుపు రంగు రకాలతో పోలిస్తే కొద్దిగా తక్కువ ఉండటం సాగుకు కారణం. ముఖ్యంగా పసుపు మిరపను పంజాబ్, దక్షిణ కశ్మీర్‌లో రైతులు ఎక్కువగా సాగు చేస్తున్నారు. ఈ రకాన్ని పచ్చళ్ల తయారీ, సాస్‌లు, సూప్‌లు, కూరల్లో, ఔషధాల తయారీలో వాడుతున్నారు. యాంటీ బ్యాక్టీరియల్, నొప్పులు తగ్గించే ఔషధ గుణాలున్నాయని పరిశోధనల్లో తేలింది. ఊబకాయుల్లో కొలెస్ట్రాల్ తగ్గించటంలో ప్రముఖ పాత్ర పోషిస్తోంది. ఈ రకంలో విటమిన్-సి, విటమిన్-ఎ సమపాళ్లలో ఉన్నాయి. మిరప కాయలకు క్యాప్సాథిన్ అనే కెరోటినాయిడ్ వల్ల ఎరుపు రంగు వస్తుంది. పసుపు రంగు రావటానికి బీటా కెరొటిన్, బీటా క్రిప్టో జాంతిన్ అనే కెరొటినాయిడ్‌లు కారణమని మధిర ఉద్యానశాఖ అధికారి వేణు తెలిపారు.

సాధారణ మిరప సాగులానే...

పసుపు మిర్చి కూడా ఇంచుమించు ఎరుపు రంగు మిరప సాగులానే ఉంటుంది. దీన్ని ఎక్కువగా ఎండు మిరపగా ఉపయోగిస్తారు. దీనిలో లావులు, సన్నాలు రకాలున్నాయి. కొన్ని ప్రైవేటు కంపెనీలకు చెందిన విత్తనాలు మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి. నాటిన రెండు నెలలకు పూత రావటం మొదలవుతుంది. తరువాత నెలకు దిగుబడి వస్తుంది. కాయలు ఆకుపచ్చ నుంచి పసుపు రంగుకు మారిన వెంటనే కోస్తే ఎండిన తర్వాత తొడిమ ముడత పడక, కాయలకు మంచి నిగారింపు వస్తుంది. కాయ నాణ్యత, దిగుబడులు పెరగాలంటే వీలైనన్ని సార్లు కోతలు కోయాలి. దిగుబడి ఎకరానికి 15 నుంచి 20 క్వింటాళ్ల వరకు వస్తుంది.

జిల్లాలో ప్రయోగాత్మక సాగు...

తిరుమలాయపాలెం మండలం తిప్పారెడ్డిగూడేనికి చెందిన రైతు ఉపేందర్ ఈ ఏడాది ముప్పాతిక ఎకరంలో పసుపు రంగు మిరప సాగు చేశారు. మొత్తం 8 వేల మొక్కలు వేసి 15 క్వింటాళ్ల దిగుబడి సాధించారు. ఏన్కూరు మండలం జన్నారానికి చెందిన కొండపల్లి నరేశ్ ఒక ఎకరంలో పసుపు రంగు మిరపను సాగు చేశారు. పెట్టుబడి ఎకరానికి రూ.లక్ష వరకు కాగా ఇప్పటి వరకు 10 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ఇంత వరకు సరకును విక్రయించలేదు. శీతల గిడ్డంగిలో నిల్వ ఉంచారు. గుంటూరు/వరంగల్ విపణిలో విక్రయించాలనే ఆలోచనలో ఉన్నారు. యూట్యూబ్‌లో చూసి విత్తనాలను కొనుగోలు చేసి ప్రయోగాత్మకంగా సాగు చేశారు.

ఆసక్తి చూపుతున్న రైతులు

అనసూయ, జిల్లా ఉద్యాన, ..పట్టుపరిశ్రమ అధికారి, ఖమ్మం..కొత్త రకం పసుపు రంగు మిరపపై కొంతమంది రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఇద్దరు ప్రయోగాత్మకంగా సాగు చేశారు. ఇది విజయవంతమైతే మరి కొంతమంది సాగు చేసే అవకాశం ఉంది. ఈ పంట సాగుకు ఇక్కడి నేలలు అనుకూలంగా ఉన్నాయి. దిగుబడి, మార్కెటింగ్ తదితర సౌకర్యాలను దృష్టిలో పెట్టుకుని కొత్త రకం పంటలను సాగు చేయడం మంచిది.

# బంధాలను వీడి.. కన్నీళ్లను మిగిల్చి

ఖమ్మం : రాళ్లు తరలిస్తున్న ట్రాక్టర్ ట్రక్కు పల్టీ కొట్టిన ఘటనలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ముగ్గురు తీవ్రంగా గాయపడిన సంఘటన కామేపల్లి మండలం పండితాపురంలో చోటుచేసుకుంది. సూర్యాపేట జిల్లా అనంతగిరి మండల కేంద్రానికి చెందిన ఐదుగురు వ్యక్తులు ఫెన్సింగ్ రాళ్ల లోడుతో కోదాడ నుంచి కారేపల్లికి వస్తున్నారు. వీరిలో నలుగురు వ్యక్తులు ట్రక్కులో రాళ్లపై కూర్చున్నారు. పండితాపురం వద్ద ఎదురుగా వస్తున్న వాహనాలను తప్పించే సమయంలో ట్రక్కు పల్టీ కొట్టింది. రాళ్లు నలుగురిపై పడటంతో తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు రాళ్లను తీసి క్షతగాత్రులను బయటకు తీసుకురాగా అప్పటికే చిన్నం ప్రవీణ్(35) మృతి చెందారు. మరో ముగ్గురు సూరేపల్లి కిరణ్, మంద సందీప్, నకరికంటి సతీష్ తీవ్ర గాయాలయ్యాయి. డ్రైవర్ పరారయ్యాడు. ఘటన స్థలానికి చేరుకున్న శిక్షణ ఐపీఎస్ అవినాష్, ఎస్సై కిరణ్ కుమార్ క్షతగాత్రులను అంబులెన్సులో ఖమ్మం ఆసుపత్రికి తరలించారు. మృతుడు చిన్నం ప్రవీణ్‌కు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ప్రవీణ్ బాబాయి కాంతయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై కిరణ్ కుమార్ తెలిపారు.

లారీ ఢీకొని యువకుడు..

పెనుబల్లి మండలం లంకాసాగర్ క్రాస్‌రోడ్డు వద్ద ద్విచక్రవాహనాన్ని, లారీ ఢీకొట్టిన ప్రమాదంలో కల్లూరు మండలం లోకారానికి చెందిన అన్నపురెడ్డి నాగరాజు(25) దుర్మరణం పాలయ్యాడు. వివరాలు ఇలా ఉన్నాయి... నాగరాజు చెల్లెలు సత్తుపల్లిలో ఉండటంతో ఆమెను చూసేందుకు ద్విచక్రవాహనంపై బయలుదేరాడు. మార్గమధ్యలోని లంకాసాగర్ క్రాస్‌రోడ్డు వద్ద కాకినాడ నుంచి ఖమ్మం వైపు వెళ్తున్న లారీ ఎదురుగా ఢీకొట్టడంతో నాగరాజు అక్కడికక్కడే మృతి చెందాడు. లారీ టైర్లలో ద్విచక్రవాహనం ఇరుక్కోవడంతో దాదాపు 300 మీటర్లు లాక్కెళ్లింది. నాగరాజు కల్లూరు మండలం పుల్లయ్యబంజర్‌లోని ఓ రైస్‌మిల్లులో హమాలీగా పని చేస్తూ తన కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇంటి పెద్దదిక్కు మృతి చెందాడని కుటుంబసభ్యులు గుండెలవిసేలా రోదించారు. సంఘటన స్థలాన్ని వీఎం బంజర్ ఎస్సై సూరజ్ సందర్శించి శవపరీక్ష నిమిత్తం మృతదేహాన్ని పెనుబల్లి వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య

పెనుబల్లి మండలం గంగదేవిపాడుకు చెందిన కేళోతు నాగేశ్వరరావు(33) ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. కేళోతు నాగేశ్వరరావు ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అప్పులు ఎక్కువవడంతో మనస్తాపం చెందాడు. దీంతో ఇంట్లో నుంచి ఈ నెల 12న ఎవ్వరికీ చెప్పకుండా బయటకు వెళ్లాడు. సాయంత్రమైనా ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు చుట్టుపక్కల వెదికినా కన్పించలేదు. ఊరి శివారులోని ఓ మామిడితోటలో నాగేశ్వరరావు శవమై కనిపించాడు. వెంటనే కుటుంబసభ్యులు వీఎం బంజర్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలాన్ని ఎస్సై సూరజ్ సందర్శించారు. ఆర్థిక ఇబ్బందుల వల్లే ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ప్రేమించిన బాలిక దక్కదని..

ఇద్దరూ మైనర్లే. వారికుటుంబాల మధ్య బంధుత్వం ఉంది. ఇరువురు ప్రేమించుకున్నారు. పెళ్లి చేసుకుందామని ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయారు. ఆశ్రయం కోసం నాలుగు రోజులు పలు ప్రదేశాలు తిరిగి బంధువుల ఇంటికి చేరుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఇరువైపుల పెద్దలు మేజర్లు అయిన తర్వాత ఇద్దరికి వెళ్లి చేద్దామని నిర్ణయించారు. అయినా ఆ బాలుడు పెద్దలను నమ్మలేదు. ప్రేమించిన



బాలిక తనకు దక్కదనే భయంతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన అశ్వారావుపేట మండలంలో గురువారం జరిగింది. ఎస్సై రాజేశ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. అశ్వారావుపేట మండలంలోని ఓ గ్రామానికి చెందిన పదిహేడేళ్ల బాలుడు, అదే మండలానికి చెందిన పద్నాలుగేళ్ల బాలికను ప్రేమించాడు. ఈ నెల 9న ఇద్దరు కలసి ఇంట్లో నుంచి వెళ్లిపోయారు. హైదరాబాద్, సూర్యాపేటలలో ఆశ్రయం కోసం తిరిగారు. తిరిగి బుధవారం ఉదయం మండలంలోని మరో గ్రామంలో ఉన్న బాలుడి బంధువుల ఇంటికి చేరుకున్నారు. విషయం రెండు కుటుంబాల వారికి తెలిసి వచ్చారు. ఇద్దరు ఒకే సామాజిక వర్గం కావటంతో మేజర్లు అయిన తర్వాత పెళ్లి చేద్దామని పెద్దలు నిర్ణయించి బాలికను తీసుకువెళ్లారు. దీంతో మనస్తాపం చెందిన బాలుడు తాను ప్రేమించిన బాలికతో పెళ్లి కాదేమోనని మనస్తాపంతో బంధువుల ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. దీనిపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

తండ్రి కళ్లెదుటే నీట మునిగి..

చెరువులో తండ్రి చేపల వేట సాగిస్తుండగా అదే చెరువులో మరోవైపు కుమారుడు ఈత కొడుతున్నాడు. లోతులోకి వెళ్లిన కుమారుడు కళ్లెదుటే నీటమునిగి మృతి చెందడంతో తండ్రి కన్నీరుమున్నీరయ్యాడు. ఈ విషాద ఘటన మండలంలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. ఉసుర్లగూడేనికి చెందిన కొర్సా రాముడు కొత్తమామిళ్లవారిగూడెం సమీప ఊరచెరువులో గ్రామస్థులతో కలసి చేపల వేటకు వెళ్లాడు. రాముడు వేట సాగిస్తుండగా అతడి కుమారుడు కొర్సా ఏసుబాబు అలియాస్ చందు(19) నలుగురు స్నేహితులతో కలసి అదే చెరువులో ఈతకు దిగాడు. ఏసుబాబు ఈత కొడుతూ ప్రమాదవశాత్తు లోతులోకి వెళ్లి నీటిలో మునిగిపోతూ కేకలువేశాడు. అవతల గట్టువైపు ఉన్న తండ్రి దీన్ని గమనించి కుమారుడిని కాపాడేందుకు వెళ్లేసరికే ఏసుబాబు నీటిలో మునిగిపోయాడు. అక్కడ ఉన్నవారు గాలించి ఏసుబాబును బయటకు తీయగా అప్పటికే మృతి చెందాడు. ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తూ కుటుంబానికి ఆసరాగా ఉన్న కుమారుడు కళ్లెదుటే మృత్యువాత పడటంతో ఆ తండ్రి, తల్లి దుర్గమ్మ హృదయ విదారకంగా విలపించారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబీకులకు అప్పగించినట్లు ఎస్సై రాజేశ్‌కుమార్ తెలిపారు.

ఎన్నెస్పీ కాలువలో పడి..కల్లూరు మండలం మర్లపాడు వద్ద ప్రమాదవశాత్తు ఎన్నెస్పీ కాలువలో పడి జనగామ జిల్లాకు చెందిన వ్యక్తి మృతిచెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం బసివిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన కుక్కసావు ఆంజనేయులు(45) కుటుంబంతో సహా వరికోత యంత్రం వెంబడి కూలి పనుల కోసం పదిరోజుల క్రితం వచ్చి కల్లూరు మండలం మర్లపాడులో ఉంటున్నాడు. ప్రమాదవశాత్తు ఎన్నెస్పీ కాలువలో పడి మృతి చెందాడు. ఆంజనేయులుకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. మృతుని సోదరుడు నరసింహారావు ఫిర్యాదుమేరకు ఎస్సై రఘు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెనుబల్లి వైద్యశాలకు తరలించారు.

# తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి

వరంగల్ : నగరంలో రానున్న రోజుల్లో ఎండల తీవ్రత ఉంటుందని నిపుణుల హెచ్చరికలతో తాగునీటి సరఫరా గ్రేటర్ వరంగల్, పబ్లిక్ హెల్త్ ఇంజినీర్లు ప్రత్యేక దృష్టి సారించారు. ధర్మసాగర్ చెరువులో నిల్వ ఉన్న తాగునీళ్లు రంగు మారకుండా ఉండేందుకు నిరంతరం పరిశీలన చేయాలని గ్రేటర్ వరంగల్ నీటి సరఫరా సలహాదారు, మెట్రో వాటర్ బోర్డు విశ్రాంత సీఈ రవికుమార్ సూచించారు. దీనిలో భాగంగా రెండు శాఖల ఇంజినీర్లు ధర్మసాగర్ చెరువును సందర్శించారు. దేవాదుల ప్రాజెక్టు నుంచి గోదావరి నదీ జలాల పంపింగ్ కొనసాగుతున్నందున బురద నీరు నగరానికి సరఫరా కాకుండా చూడాలని నిర్ణయించారు. ఎండలు ముదిరితే చెరువులో నిల్వ ఉన్న తాగునీళ్లు రంగు మారే అవకాశం ఉంటుందని, ముందస్తుగా రోజూ బ్లీచింగ్ పొడి చల్లాలని సూచించారు. ఉష్ణోగ్రత పెరిగితే తాగునీరు



పచ్చగా మారకుండా ఆలం, బొగ్గు, ఇతర రసాయనాలు మోతాదు ప్రకారం కలపాలని, ధర్మసాగర్ చెరువు నుంచి వడ్డేపల్లి, కేయూసీ, దేశాయిపేట ఫిల్టర్‌బెడ్‌కు పంపింగ్ చేస్తున్న శుద్ధిచేయని నీటిని నిరంతరం పరీక్షించాలని డీఈ, ఏఈలను ఆదేశించారు.

తాగునీటి శుద్ధీకరణ పరిశీలన

విశ్రాంత సీఈ రెండు రోజులుగా హనుమకొండ వడ్డేపల్లి, కేయూసీ, వరంగల్ దేశాయిపేట తాగునీటి శుద్ధీకరణ కేంద్రాలను పరిశీలించారు. ధర్మసాగర్ నుంచి శుద్ధిచేయని నీళ్ల పరిస్థితి, తాగునీటి శుద్ధీకరణ ఎలా జరుగుతుందని ఇంజినీర్లను అడిగి తెలుసుకున్నారు. మూడు ఫిల్టర్‌బెడ్లలో రెండు, మూడు నెలలకు సరిపడా రసాయనాలు సిద్ధంగా ఉంచాలని, క్లోరిన్ సిలిండర్లు, బ్లీచింగ్ పొడి కొనుగోలు చేయాలన్నారు. ఎండలు పెరిగాయని, నగరంలోని 66 డివిజన్లలో ప్రతి చివరి ఇంటి వరకు స్వచ్ఛమైన తాగునీళ్లు అందేలా చూడాలని డీఈ, ఏఈలకు సూచించారు.

# రహదారి విస్తరణకు అడ్డంకులు

వరంగల్ : ముందు చూపు లేకుండా చేసిన పనులు అభివృద్ధికి ఆటంకం కలిగిస్తున్నాయి. ప్రస్తుతం కాళేశ్వరం నుంచి భూపాలపల్లి మీదుగా గణపురం, రేగొండ, పరకాల, శాయంపేట మండలాలను కలుపుతూ నిర్మిస్తున్న జాతీయ రహదారికి అనేక అడ్డంకులు ఎదురవుతున్నాయి. భూపాలపల్లి నుంచి చెల్పూరు దాకా హైటెన్షన్ విద్యుత్తు స్తంభాలు రోడ్డు విస్తరణలో భాగంగా నిర్మిస్తున్న డ్రైనేజీల మధ్యలోకి వస్తున్నాయి. కేటీపీపీకి కాశేశ్వరం నుంచి గోదావరి నీటిని సరఫరా చేయడానికి రోడ్డుకు ఇరువైపులా జెన్‌కో రెండు పైపులైన్లను 53 కిలోమీటర్ల మేర ఏర్పాటు చేసింది. ఆ పైపులైను



డ్రైనేజీ మధ్యలోనే ఉంది. అప్పట్లోనే రూ.200 కోట్లతో ఏర్పాటు చేసిన ఈ పైపులైన్‌ను తీసే పరిస్థితి లేదు. దీంతో ఎయిర్‌వాల్వులు ఉన్న చోట వదిలేసి కాల్వలను నిర్మిస్తున్నారు. మిషన్ భగీరథ, విద్యుత్తు స్తంభాలు, నియంత్రికలు అనేకం ఉన్నాయి. వాటిని కూడా వదిలేసి డ్రైనేజీలు నిర్మిస్తుండడంతో భవిష్యత్తులో భారీ వర్షాలు కురిస్తే వర్షం నీరు రోడ్డుపై ప్రవహించి రాకపోకలు నిలిచిపోతాయని పలువురు అంటున్నారు. దీనిపై జాతీయ రహదారుల అధికారులు నోరు మెదపడం లేదు. తమపని తాము చేసుకుంటూ వెళ్తున్నామని, ఇవన్నీ తొలగించాలంటే బోలెడన్ని అనుమతులు కావాలని.. అవివచ్చే దాకా ఉంటే నిధులు వెనక్కి వెళ్తాయని చెబుతున్నారు. జిల్లా కేంద్రానికి దగ్గర్లో చెల్పూరుతో పాటు భూపాలపల్లిలోనూ ఇదే పరిస్థితి ఉంది. పనులు పకడ్బందీగా చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# తూకం యంత్రం.. అలంకారప్రాయం

వరంగల్ : గోవిందరావుపేట మార్కెట్ సబ్‌యార్డులో మూడేళ్ల క్రితం సుమారు రూ.8 లక్షల వ్యయంతో నిర్మించిన వేబ్రిడ్జి(తూకం యంత్రం) నిరుపయోగంగా మిగిలింది. మార్కెట్ సబ్ యార్డులో నిర్మించిన పెద్ద గోదామును పౌరసరఫరాల శాఖ అద్దెకు తీసుకుంది. ఇందుకు గాను నెలకు రూ. 60 వేల అద్దె కూడా చెల్లిస్తున్నారు. పౌరసరఫరాల శాఖ ఇక్కడ పెద్ద మొత్తంలో బియ్యాన్ని నిల్వ చేస్తోంది. నిల్వలను మళ్లీ చౌక ధరల దుకాణానికి తరలించేటప్పుడు మరోసారి తూకం వేసి పంపించాల్సి ఉంటుంది. మార్కెట్ సబ్ యార్డులో ఉన్న వేబ్రిడ్జి నిరుపయోగంగా ఉండడంతో ప్రైవేటు నిర్వాహకులను ఆశ్రయిస్తున్నారు. పౌరసరఫరాల శాఖ మార్కెటింగ్ అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లినప్పటికీ ఫలితం కనిపించలేదని తెలిసింది. మార్కెట్ సబ్‌యార్డులో పెద్ద మొత్తంలో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ కూడా జరుగుతోంది. ఈ నేపథ్యంలో తూకం యంత్రం వినియోగంలోకి వస్తే రైతులతో పాటు సహకార సంఘం, ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు కూడా ఉపయోగించుకునే అవకాశం ఉంటుంది. ఇప్పటికైనా మార్కెటింగ్‌శాఖ అధికారులు స్పందించాల్సిన అవసరం ఉంది.




విజయవాడ: వైకాపా నాలుగేళ్ల పాలనపై భాజపా 9 ప్రశ్నలను సంధించింది. వీటికి జవాబు చెప్పాలని భాజపా నేత విష్ణువర్ధన్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరిపై వైకాపా మంత్రులు వ్యక్తిగత విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. ఆమెను విమర్శించే మంత్రులు ముందుగా ఆయా శాఖలకు ఏం పనులు చేశారో? ఎంత వరకు అభివృద్ధి చేశారో చెప్పాలన్నారు.

**భాజపా సంధించిన ప్రశ్నలివే..** బాలల అక్రమ రవాణాలో దేశంలోని ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఏపీ మూడో స్థానంలో ఉంది. ఈ వైఫల్యానికి మీ సమాధానం ఏంటి? తలసరి ఆదాయంలో దక్షిణాది రాష్ట్రాలతో పోలిస్తే ఏపీ ఎందుకు వెనుకబడింది? జల్‌జీవన్ మిషన్ పథకానికి అయ్యే ఖర్చులో కేంద్రం ఇచ్చే ఆర్థిక సహాయాన్ని ఎందుకు ఉపయోగించుకోలేదు? ఎందుకు ప్రజలకు మంచినీటిని అందించలేకపోయారు? కేంద్రం పేదల కోసం కేటాయించిన 25 లక్షల ఇళ్లను ఎందుకు నిర్మించి ఇవ్వలేకపోయారు? పేదలకు అందించే వైద్య సదుపాయాల విషయంలో ఎందుకు విఫలమయ్యారు? పట్టణ, గ్రామీణ వైద్య, ఆరోగ్యకేంద్రాలు, జిల్లా ఆసుపత్రులు, జనరల్ ఆసుపత్రుల్లో ఎందుకు వైద్య సదుపాయాలు అందుబాటులో లేవు? మందులు ఎందుకు ఇవ్వడం లేదు? వైద్యులు, వైద్య సిబ్బంది ఖాళీలు ఎందుకు భర్తీ చేయడం లేదు? 80 శాతం కార్పొరేట్ ఆసుపత్రులు ఎందుకు ఆరోగ్యశ్రీ పథకం కింద వైద్యం అందించడం లేదు? వారికి ప్రభుత్వం ఎందుకు బకాయిలు చెల్లించడం లేదు?

ఉన్నత విద్యను ఎందుకు నిర్లక్ష్యం చేశారు? పీజీ విద్యార్థులకు ఎందుకు ఉపకార వేతనాలు దూరం చేశారు? డిగ్రీలో తెలుగును రద్దు చేశారు. ఆంగ్లభాషకే ప్రాధాన్యత ఎందుకు? ప్రభుత్వ ఉద్యోగాలను ఎందుకు భర్తీ చేయడం లేదు? ఖాళీగా ఉన్న 2.50 లక్షల బ్యాక్‌లాగ్ పోస్టులను ఎందుకు భర్తీ చేయలేదు? రాష్ట్రంలో దెబ్బతిన్న రహదారులను ఎందుకు పునర్నిర్మించడం లేదు? వైకాపా మంత్రులు కారు యాత్రలు చేస్తే రోడ్ల పరిస్థితి తెలుస్తుంది.

# గ్రామాల్లో సమగ్ర సర్వేపై దృష్టిపెట్టాలి: సీఎం జగన్

## పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖపై సీఎం సమీక్ష



తాడేపల్లి: పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖపై తాడేపల్లిలోని తన క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం సమీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామాల్లో సమగ్ర సర్వేపై దృష్టిపెట్టాలని ఆదేశించారు. డిజిటల్ లైబ్రరీల నిర్మాణంపై దృష్టిపెట్టాలన్న సీఎం.. అర్బన్ ప్రాంతాల్లో కూడా డిజిటల్ లైబ్రరీలను తీసుకురావాలన్నారు. చేయూత కింద స్వయం ఉపాధి పెద్ద ఎత్తున ప్రోత్సహించాలన్న సీఎం.. లబ్ధిదారులు తొలి విడత డబ్బు అందుకున్నప్పుడే స్వయం ఉపాధి కార్యక్రమానికి అనుసంధానం చేస్తే ఆ మహిళకు పూర్తిస్థాయిలో మేలు జరుగుతుందని పేర్కొన్నారు. "గ్రామీణాభివృద్ధి శాఖ కింద చేపట్టే ఉపాధి కార్యక్రమాలపై నిరంతరం సమీక్ష చేయాలి. ఆ కార్యక్రమాల పనితీరుపై మదింపు చేసేందుకు శాఖలో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసుకోవాలి. నివేదికల ఆధారంగా ఆ యూనిట్లు విజయవంతంగా నడిచేందుకు తగిన చర్యలు తీసుకోవాలి" అని సీఎం సూచించారు. "స్వయం ఉపాధి కార్యక్రమాల్లో మహిళలకు చేయూతనిచ్చి నడిపించడం అన్నది చాలా కీలకం. ఆగస్టు 10న మహిళలకు సున్నావడ్డీ కార్యక్రమం నిర్వహించాలి" అని సీఎం పేర్కొన్నారు. ఈ సమావేశానికి సీఎస్ జవహర్‌రెడ్డి, డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# నాలాగే ఆయన మాయగాడి వలలో పడ్డారు

న్యూఢిల్లీ: ఏపీ మాజీ సీఎస్ అజయ్ కల్లం మంచి వ్యక్తి అని రాష్ట్రానికి ఎనలేని సేవ చేశారని, ఆయన అవినీతి మరకలేని వ్యక్తి అని, తనలాగే ఒక మాయగాడి వలలో పడ్డారని ఎంపీ రఘురమకృష్ణంరాజు అన్నారు. సోమవారం ఆయన ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ అజయ్ కల్లం మొదట సీబీఐకు స్టేట్‌మెంట్ ఇచ్చారని, ఆ రోజు ఉదయం 6.30 గంటలని వైసీపీ వాళ్ళు కొత్త టైం తీసుకొచ్చారన్నారు. సుప్రీంకోర్టులో సీబీఐ అధికారులు ఇచ్చే ఆధారాల్లో మార్పు ఉండదని, ఆ డైరీ వేరు ఈ డైరీ వేరని అన్నారు. ముఖ్యమంత్రి జగన్ ప్రత్యేక హోదా కోసం ఢిల్లీ వచ్చిన ఫలితం ఉండదన్నారు. విశాఖపట్నంలో పెద్ద కుంభకోణం జరిగిందని, జేఎంఆర్ బ్రాండ్‌తో రూ. 1250 సెల్ఫ్ హెల్ప్ పేరిట కట్టాలని జే. మల్లేశ్వర రావు అనే వ్యక్తి వసూల్ చేస్తున్నారని రఘురామ ఆరోపించారు. సెల్ఫ్ హెల్ప్ గ్రూప్స్ అందరూ.. అసలు జేఎంఆర్ ఏంటి అని కనుక్కున్నారని తెలిసిందన్నారు. సీఎం ఆఫీస్ నుంచి ఏమైనా డైరెక్షన్ వచ్చిందా? అనే అనుమానాన్ని రఘురామ వ్యక్తం చేశారు.




# అసైన్డ్ భూములు పేదలకే దక్కాలి

అమరావతి: అసైన్డ్ భూములు పేదలకే దక్కేలా చర్యలు చేపట్టాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి రామకృష్ణ లేఖ రాశారు. 20 ఏళ్లు పైబడిన అసైన్డ్ భూములకు పూర్తి యాజమాన్య హక్కులు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం చట్ట సవరణ చేయనున్నట్లు తెలుస్తోందన్నారు. ఈ అసైన్ చట్ట సవరణ ద్వారా వైసీపీ నేతలు, రియల్టర్లు, భూస్వాములు లబ్ధి పొందేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారని విమర్శించారు. ఇప్పటికే పరాధీనంలో ఉన్న లక్షలాది ఎకరాలను గుర్తించి, నిజమైన పేద లబ్ధిదారులకే అప్పగించేలా చర్యలు చేపట్టాలని రామకృష్ణ లేఖలో పేర్కొన్నారు.



# అమరావతికి అంబటి రాయుడు..
## విషయం తెలుసుకుని రైతులు అక్కడికి వెళ్లాక ఆసక్తిగా మారిన సీన్..

అమరావతి : రాజధాని అమరావతికి మాజీ భారత క్రికెటర్ అంబటి రాయుడు వచ్చారు. స్థానిక వైసీపీ నేతల విజ్ఞప్తి మేరకు అంబటి రాయుడు రాజధానికి వచ్చారు. వెలగపూడిలోని వీరభద్రస్వామి దేవాలయానికి వెళ్లారు. అయితే.. విషయం తెలుసుకొని అమరావతి రైతులు అక్కడికి చేరుకున్నారు. దీంతో సీన్ అంతా ఆసక్తికరంగా మారిపోయింది. అమరావతికి సంఘీభావం తెలుపాల్సిందిగా అంబటి రాయుడును కోరారు. అంబటి రాయుడు ఆడిన ప్రతి మ్యాచ్‌లో సెంచరి కొట్టాలని తామంతా కోరుకున్నామని తెలిపారు. తమ ఉద్యమానికి మద్దతు ప్రకటించాలని కోరారు. జై అమరావతి అనాలని అడిగారు. అమరావతి ఎక్కడికి వెళ్లదని సమాధానాన్ని అంబటి రాయుడు దాటవేశారు. రైతుల దీక్షా శిబిరానికి రావాల్సిందిగా రాజధాని రైతులు కోరగా.. ఈసారి వచ్చినప్పుడు తప్పని సరిగా వస్తానని చెప్పారు.

# ప్రశాంత్ కిషోర్ వ్యూహంతో ఏపీలో రక్షణ కరువు

అమరావతి: వాలంటీర్ల ద్వారా జరిగిన వ్యక్తిగత సమాచార చౌర్యం వల్లే రాష్ట్రంలో ఆడబిడ్డలకు రక్షణ కరువైందని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు బోండా ఉమామహేశ్వరరావు వ్యాఖ్యలు చేశారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ... ప్రశాంత్ కిషోర్ వ్యూహంతో అమలు చేస్తున్న ఈ విధానం వల్ల ప్రజల ఆస్తులు, ధన, మాన ప్రాణాలకు రక్షణ లేదన్నారు. 5.5 కోట్ల మందికి చెందిన డేటా దుర్వినియోగం వల్ల వైసీపీ బ్యాచ్ ఇప్పటికే రూ.50 వేల కోట్ల పేదల భూములు కాజేసిందని ఆరోపించారు. రాష్ట్రంలో ప్రజల గోప్యతకు ఎక్కడా రక్షణ లేదన్నారు. వాలంటీర్ల ద్వారా పథకాల పేరుతో వ్యక్తిగత సమాచారం సేకరించి ప్రజల జీవితాలతో ఆడుకుంటున్నారని మండిపడ్డారు. వేలిముద్రల సేకరణ ద్వారా బ్యాంకు అకౌ%శ్%ట్లలో డబ్బులకు గ్యారెంటీ లేదన్నారు. వ్యక్తిగత సమాచారం పక్క రాష్ట్రం తెలంగాణలో ప్రైయివేటు వ్యక్తులు చేతుల్లో పెట్టటంపై జగన్మోహన్ రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. జగన్మోహన్ రెడ్డి అక్రమాలు ప్రశ్నిస్తే రాజకీయ కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని బోండా ఉమా మహేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు.



# నేడు విశాఖకు సీఎం జగన్



అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రేపు (మంగళవారం) విశాఖలో పర్యటించనున్నారు. పర్యటనలో భాగంగా విశాఖలో వివిధ అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. రేపు ఉదయం 9:30 గంటలకు తాడేపల్లి నివాసం నుంచి బయలుదేరి విశాఖ చేరుకోనున్నారు. ముందుగా కైలాసపురం పోర్టు ఆసుపత్రి సమీపంలో ఇనార్బిట్ మాల్ నిర్మాణానికి భూమి పూజ చేయనున్నారు. అనంతరం అదే ప్రాంగణంలో జీవీఎంసీకి చెందిన 50 అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారు. అక్కడి నుంచి బయలుదేరి సిరిపురంలోని ఏయూ క్యాంపస్‌కు చేరుకుంటారు. ఎలిమెంట్ ఫార్మా ఇంక్యుబేషన్ సెంటర్, బయో మానిటరింగ్ హబ్‌తో సహా ఐదు ప్రాజెక్టులకు సంబంధించిన భవనాలను సీఎం లాంఛనంగా ప్రారంభించనున్నారు. అక్కడి నుంచి బయలుదేరి బీచ్ రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ సెంటర్‌కు చేరుకుంటారు. అక్కడ ఆంధ్ర యూనివర్శిటీ విద్యార్థులతో జగన్ ఇంటరాక్ట్ అవుతారు. కార్యక్రమం తర్వాత అక్కడి నుంచి బయలుదేరి మధ్యాహ్నం తాడేపల్లి నివాసానికి ముఖ్యమంత్రి జగన్ చేరుకుంటారు.




# బంగారం కోసం వృద్ధురాలిని హతమార్చిన వాలంటీర్!

పెందుర్తి: విశాఖపట్నంలో దారుణం చోటుచేసుకుంది. వార్డు వాలంటీర్ ఘాతుకానికి పాల్పడ్డాడు.

బంగారం కోసం ఓ వృద్ధురాలిని హత్య చేసినట్లు పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. ఈ ఘటన నగరంలోని పెందుర్తి పరిధిలోని సుజాతనగర్‌లో చోటుచేసుకుంది. పోలీసులు, మృతురాలి కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. సుజాతనగర్‌లో నివాసముంటున్న కోటగిరి శ్రీనివాస్ జీవీఎంసీ 95వ వార్డు పురుషోత్తపురంలో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ నిర్వహిస్తున్నారు. ఆయన వద్ద పురుషోత్తపురం ప్రాంతానికి చెందిన వార్డు వాలంటీర్ రాయవరపు వెంకటేశ్ (26) పార్ట్‌టైంగా విధులు నిర్వహిస్తున్నాడు. ఆదివారం రాత్రి సుమారు 10 గంటల సమయంలో శ్రీనివాస్ ఇంటికి వెంకటేశ్ వెళ్లాడు. తిరిగి మళ్లీ దుకాణం వద్దకు వెళ్లాడు. అర్ధరాత్రి 12.30 గంటలకు కోటగిరి శ్రీనివాస్ ఇంటికి వచ్చి చూసేసరికి ఆయన తల్లి కోటగిరి వరలక్ష్మి (72)అచేతనంగా మంచంపై పడి ఉండటాన్ని గమనించాడు. ఆమె మెడలోని బంగారు గొలుసు కనిపించకపోవడంతో డయల్ 100 ద్వారా పోలీసులకు సమాచారం అందించాడు.

పెందుర్తి పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. సీసీ టీవీ ఫుటేజీలో శ్రీనివాస్ వద్ద పనిచేస్తున్న వార్డు వాలంటీర్ వెంకటేశ్ వచ్చి వెళ్లినట్లు అందులో రికార్డయింది. దీంతో నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. వృద్ధురాలి మెడలో బంగారు గొలుసు దొంగిలించడానికి వాలంటీర్ ఆమెను తలగడతో ఊపిరి ఆడకుండా చేసి హత్య చేసి ఉంటాడని పోలీసులు ప్రాథమికంగా అంచనాకు వచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు.




గుంటూరు: నగరంలోని లాడ్జి సెంటర్‌లో తెదేపా బీసీ విభాగం ఆధ్వర్యంలో చేపట్టిన ఆందోళన ఉద్రిక్తతకు దారితీసింది. వైకాపా నేతలు చేసిన వ్యాఖ్యలపై తెదేపా నిరసన చేపట్టగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో తోపులాట జరిగింది. ఈ క్రమంలో తెదేపా బీసీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ యాదవ్‌పై ఎస్సై నాగరాజు పిడిగుద్దులతో దాడి చేశారు. ఇటీవల తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ పాదయాత్రలో భాగంగా ఒంగోలులో ఆ పార్టీ 'జయహో బీసీ' కార్యక్రమం నిర్వహించింది. ఆ కార్యక్రమానికి తెదేపా పెయిడ్ ఆర్టిస్టులను తెచ్చిందంటూ వైకాపా ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు, మంత్రి జోగి రమేశ్ ఆరోపించారు. వైకాపా నేతలు వ్యాఖ్యలపై తెదేపా నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో గుంటూరు లాడ్జి సెంటర్‌లో వైకాపా నేతల దిష్టిబొమ్మ దహనం చేసేందుకు తెదేపా నేతలు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో తోపులాట జరిగింది.

ఈక్రమంలో తెదేపా బీసీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ యాదవ్‌పై ఎస్సై నాగరాజు పిడిగుద్దులతో దాడి చేశారు. వైకాపా ప్రభుత్వం, పోలీసుల తీరును నిరసిస్తూ అంబేడ్కర్ విగ్రహం వద్ద తెదేపా బీసీ నేతలు నిరసన తెలిపారు.

# వైసీపీకి ఈ వంకర బుద్ధేంటో ఎవరికీ అర్థంకాదు.. మళ్లీ అదే ప్రవర్తన... ఈ ప్రశ్న అడిగితే ఏం చేస్తారో?

3 రోజుల క్రితం ఒంగోలులో 'జయహో బీసీ సభ' జరిగింది. పెద్ద సంఖ్యలో జనం హాజరైన ఈ కార్యక్రమానికి ప్రముఖ యాంకర్ ఉదయ భాను అనుసంధానకర్తగా వ్యవహరించారు. లోకేష్ సమక్షంలో జరిగిన ఈ సభలో ఉదయ భాను బాధితులకు మైక్ అందించి వారి బాధలను సభ దృష్టికి తీసుకొచ్చారు. హుందాగా, ఓపిగ్గా వింటూ బాధితులకు ఓదార్పునిచ్చారు. వేర్వేరు ఘటనల్లో బాధితులైన బీసీలకు టీడీపీ కుటుంబం అండగా నిలుస్తుందని లోకేష్ సమక్షంలో ఆమె భరోసా కల్పించారు. ఆమె ఈ విధంగా బాధితులకు గొంతుకనివ్వడం, అందునా టీడీపీ కార్యక్రమంలో పాల్గొనడం పాలక పక్షానికి ఏమాత్రం రుచించలేదు.

**వైసీపీకి ఈ వంకర బుద్ధేంటో ఎవరికీ అర్థంకాదు.. మళ్లీ అదే ప్రవర్తన... ఈ ప్రశ్న అడిగితే ఏం చేస్తారో?** అన్యాయాలు, అరాచకాలపై బాధితులు గొంతు విప్పినా.. వైఫల్యాలు, దౌర్జన్యాలపై విపక్షాలు ప్రశ్నించినా.. అక్రమాలను బయటపెట్టినా, నిలదీసినా.. ఏమాత్రం సహించలేని ప్రభుత్వంగా పేరొందిన జగన్ సర్కార్!!. విపక్ష పార్టీలకు ఎవరైనా మద్దతు తెలిపితే మాత్రం ఊరుకుంటుందా?. తన సహజసిద్ధమైన నైజాన్ని, అక్కసును వెళ్లగక్కుతుంది. ఓర్వలేనితనంతో కూడిన ఈ బుద్ధినే వైసీపీ మరోసారి ప్రదర్శించింది. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, యువనేత నారా లోకేష్ దిగ్విజయంగా కొనసాగిస్తున్న 'యువగళం పాదయాత్ర'లో భాగంగా.. 3 రోజుల క్రితం ఒంగోలులో 'జయహో బీసీ సభ' జరిగింది. పెద్ద సంఖ్యలో జనం హాజరైన ఈ కార్యక్రమానికి ప్రముఖ యాంకర్ ఉదయ భాను అనుసంధానకర్తగా వ్యవహరించారు.

లోకేష్ సమక్షంలో జరిగిన ఈ సభలో ఉదయ భాను పలువురు బీసీ బాధితులకు మైక్ అందించి వారి బాధలను సభ దృష్టికి తీసుకొచ్చారు. హుందాగా, ఓపిగ్గా వింటూ బాధితులకు ఓదార్పునిచ్చారు. ధైర్యం చెప్పారు. బాధితులైన బీసీలకు టీడీపీ కుటుంబం అండగా నిలుస్తుందని లోకేష్ సమక్షంలో ఆమె భరోసానిచ్చారు. అయితే ఆమె ఈ విధంగా బాధితులకు గొంతుకనివ్వడం, అందునా టీడీపీ కార్యక్రమంలో పాల్గొనడం పాలక పక్షం శ్రేణులకు కంటగింపుగా మారింది. ఆ కార్యకర్తలు, నేతలు ఏమాత్రం రుచించలేకపోయారు.

టీడీపీ కార్యక్రమంలో ఉదయ భాను చురుకుగా కనిపించడం, పైగా ఈ ప్రోగ్రాం సక్సెస్ కావడం వైసీపీ శ్రేణులకు ఏమాత్రం నచ్చలేదు. వెంటనే సోషల్ మీడియాలో ఉదయ భానును ట్రోలింగ్ చేయడం మొదలుపెట్టారు. తమకే సాధ్యమైన రీతిలో వ్యక్తిత్వాన్ని దెబ్బతీసేలా పోస్టులు పెట్టడం మొదలుపెట్టారు. ఇక 'అట్రాక్షన్' జతచేసి జనాన్ని మొబిలైజ్ చేయడం మొదలుపెట్టారంటూ టీడీపీపై విమర్శలు చేయడం మొదలుపెట్టారు. వైసీపీ సోషల్ మీడియా బ్యాచే కాదు.. ప్రధాన నేతలు సైతం యువగళం యాత్రకు గ్లామర్ అద్దే ప్రయత్నం చేస్తున్నారంటూ గగ్గోలు పెట్టారు. వైసీపీ కీలక నేత విజయసాయి రెడ్డి ట్విటర్ వేదికగా స్పందిస్తూ.. యువగళం యాత్రకు గ్లామర్ అద్దేందుకు టీవీ యాంకర్‌ను హైదరాబాద్ నుంచి రప్పించడం చూశామని వ్యాఖ్యానించారు. ఇక నుంచి సినీ నటుల సందడి మొదలవుతుందని అర్థమవుతోందని అన్నారు. అయితే విజయసాయి రెడ్డి చేసిన ఈ వ్యాఖ్యలే ఇప్పుడు ఆ పార్టీకి సమాధానం చెప్పలేదని పరిస్థితి తెచ్చిపెట్టాయి. అంతేకాదు ఒకింత నవ్వుల పాలు కూడా చేస్తున్నాయి. ఆ పార్టీ నేతల దగ్గర సమాధానం లేని ప్రశ్నలను లేవనెత్తున్నాయి.




**పృథ్వీ, అలీ, పోసాని వీళ్లంతా ఎవరు మరి? :** ఉదయ భాను ఒక కార్యక్రమంలో పాల్గొని యాంకరింగ్ చేస్తేనే సినీ గ్లామర్ కోసం ప్రయత్నిస్తున్నారంటూ ఇంతలా ఉలిక్కిపడ్డ వైసీపీ శ్రేణులకు టీడీపీ మద్దతుదారులు స్ట్రాంగ్ కౌంటర్లు ఇస్తున్నారు. గత ఎన్నికల సమయంలో ప్రముఖ సినీ నటులు పోసాని కృష్ణమురళీ, అలీ, పృథ్వీ, జీవిత, రాజశేఖర్, శ్యామల వైసీపీ కార్యక్రమాల్లో పాల్గొనలేదా అని ప్రశ్నిస్తున్నారు. దీనికి సమాధానం ఉందా?.. అని నిలదీస్తున్నారు. ఇక సోషల్ మీడియా వేదికగా రామ్ గోపాల్ వర్మ చేస్తున్న విన్యాసాలు మీకు కనిపించడం లేదా?.. టీడీపీ శ్రేణులు కౌంటర్లు ఇస్తున్నాయి. దీంతో వైసీపీ నుంచి సమాధానం లేకుండా పోయింది. రెండు నెలలక్రితం సూపర్ స్టార్ రజనీ కాంత్‌పై కూడా వైసీపీ ఇదేవిధంగా వ్యవహరించింది. చంద్రబాబు విజనరీ అన్న పాపానికి ఆయనను దారుణంగా ట్రోలింగ్ చేశారు. దీంతో వైసీపీకి ఇదేం వంకరబుద్ధో ఎవరికీ అర్థంకావడంలేదని మాట వినిపిస్తోంది. వైసీపీ పోకడని బట్టి చూస్తే విషయాన్ని జనాల్లోకి ప్రబలంగా తీసుకెళ్లేవారిని చూస్తే వైసీపీ కలవరపాటుకు గురవుతోందనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. ఇక విపక్షాలకు మద్దతు తెలిపే ప్రముఖులను భయపెట్టి, బెదిరించడం ద్వారా మరెవరూ మద్దతుగా నిలవకుండా చేయాలనేది వైసీపీ వ్యూహం, ప్రయత్నం కావొచ్చని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ధోరణి ఏమంత మంచిది కాదని, జనాలు అంతా గమనిస్తున్నారంటూ హెచ్చరిస్తున్నారు.

## భర్త నిర్మాణంలో భార్య తొలి ప్రయత్నం!

యామీ గౌతమ్–ఆదిత్య ధర్ ప్రేమించి పెళ్లి చేసుకున్న సంగతి తెలిసిందే. అమ్మడు బాలీవుడ్ బిజీగా ఉంటుంది. భర్త నిర్మాణంలోనూ బిజీగా ఉంటారు. మరి ఈ ఇద్దరి కాంబినేషన్ లో సినిమా వచ్చిందా? అంటే ఇప్పటివరకూ జరగలేదు. భార్యని ప్రోత్సహిస్తూ ఆదిత్య లేడీ ఓరియేంటెడ్ సినిమా లాంటిదేది ప్లాన్ చేయలేదు. పేరున్న నటి అయితే ఇంట్లో ఉన్న నిర్మాత భార్యతో రకరకాల ప్రయోగాలు చేస్తుంటారు. కానీ ఆదిత్య అలాంటి సాహసం ఇంతవరకూ చేయలేదు. అయితే భర్త నిర్మాణంలో యామీ అనుకోండా ఓ సినిమా చేసినట్లు తెలుస్తోంది. యామీ గౌతమి–ప్రతీక్ గాంధీ జంటగా 'ధూం ధాం' అనే వినోదాత్మక సినిమా తెరకెక్కుతోంది. రిషబ్ సేత్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఆదిత్య ధర్–లోకేష్ ధర్–జ్యోతి దేశ్ పాండే సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఓటీటీ వేదికగా సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. అయితే ఈ సినిమా



నిర్మాణంలో యామీ గౌతమ్ హీరోయిన్ గా ఎంపికైన సమయానికి ఆదిత్య ధర్ నిర్మాతగా లేరన్న సంగతి ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వేరే నిర్మాతలతో ఈ సినిమా ప్లాన్ చేసారుట. చివరికి అటు తిరిగి..ఇటు తిరిగి ఈ త్రయం హ్యాండ్స్ లోకి వచ్చింది. దీంతో ఈ సినిమాలో ముగ్గురు భాగస్వాము లున్నా అందులో ఒక నిర్మాత యామీగౌతమ్ భర్త కావడంతో! ఈ ప్రాజెక్ట్ పై ఆసక్తి సంతరించుకుంది. అలా తొలిసారి భర్త నిర్మాణంలో యామీ గౌతమీ నటిస్తోన్న తొలి సినిమా గా బాలీవుడ్ మీడియాలో ఫోకస్ అవుతుంది. ఇద్దరి కాంబినేషన్ లో మొదటి ప్రయత్నం విజయం సాధించాలని సోషల్ మీడియా వేదికగా యామీ అభిమానులు కోరుకుంటున్నారు. అయితే ఈ సినిమా కేవలం నిర్మాణం వరకే పరిమితం. ఆదిత్య నిర్మాత మాత్రమే కాదు. మంచి దర్శకుడు కూడా. బాలీవుడ్ లో 'ఉరీ' సర్జికల్ స్ట్రైక్స్ లాంటి సినిమా తీసింది ఆయనే. అందులో యామీగౌతమి కీలక పాత్ర పోషించిన సంగతి తెలిసిందే. ఆ సినిమాతో దర్శకుడిగా ఆయనకు మంచి పేరొచ్చింది. తాజా సినిమాతో యామీ గౌతమీ హబ్బీతో నిర్మాణ అనుభవాన్ని చూసింది.

## వర్షాకాలంలో హీటు పెంచుతోన్న తమన్నా..!

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ గా రాణించిన వారి లో తమన్నా కూడా ఒకరు. ప్రస్తుతం తమన్నా మంచి జోరు మీద ఉంది. ఒకప్పుడు స్టార్ హీరోలందరితో నటించి మెప్పించిన ఈ బ్యూటీ ప్రస్తుతం తన దృష్టి మొత్తం వెబ్ సిరీస్ లపై పెట్టింది. ఇప్పటికే వరసగా రెండు వెబ్ సిరీస్ లలో మెరిసింది. రెండింటిలోనూ తన నటనతో,బోల్డ్ సీన్స్ తో ఆకట్టుకుంది. కాగా, ఈ బ్యూటీ సోషల్ మీడియాలోనూ చాలా చురుకుగా ఉంటుంది. ఎప్పటికప్పుడు తన ఫోటోలు షేర్ చేస్తూ ఉంటుంది. అయితే, ఈ బ్యూటీ లస్ట్ స్టోరీస్ తర్వాత తనలోని బోల్డ్ యాంగిల్ ని బయటపెట్టింది. కేవలం వెబ్ సిరీస్ లలో మాత్రమే కాదు, సోషల్ మీడియా లోనూ తన లోని హాట్ యాంగిల్ ని బయటపెట్టి, ఆ ఫోటోలు షేర్ చేస్తోంది. తాజాగా తన యద అందాలు మొత్తం స్పష్టంగా కనిపించేలా అందాల ను ప్రదర్శించింది. దానికి కావాలా అంటూ క్యాప్షన్ కూడా పెట్టడం విశేషం. ఆమె ఫోటోకి బాయ్ ఫ్రెండ్ విజయ్ కూడా స్పందించాడు. వర్షాకాలం లో హీట్



పెంచుతున్నావ్ అంటూ కామెంట్ చేశాడు. కాగా, ప్రస్తుతం తమన్నా రజినీకాంత్ సరసన జైలర్ మూవీ లో నటిస్తున్న విషయం తెలిసిందే. అందు లో ఆమె నటించిన కావాలయ్య పాట ప్రస్తుతం ట్రెండింగ్ గా మారింది. తమిళం లోనే కాకుండా, తెలుగు లోనూ విడుదల చేశారు. ఈ రెండు భాషల్లోనూ పాట బాగా క్లిక్ అయ్యింది. ఎవరినోట చూసినా ఇదే పాట వినపడుతోంది. ఈ చిత్రాన్ని సన్ పిక్చర్స్ బ్యానర్ పై కళానిధి మారన్ తెరకెక్కిస్తున్నారు. యాక్షన్ కామెడీ బ్యాక్ డ్రాప్ లో వస్తున్న జైలర్ చిత్రానికి అనిరుధ్ రవిచందర్ మ్యూజిక్ అందిస్తున్నాడు. జైలర్ మూవీ లో మలయాళ స్టార్ హీరో మోహన్ లాల్, సునీల్, కన్నడ స్టార్ హీరో శివరాజ్‌కుమార్, రమ్యకృష్ణ, యోగిబాబు కీలక పాత్రలు పోషిస్తున్నారు. మరోవైపు తమన్నా , చిరంజీవి భోళా శంకర్ మూవీ లోనూ నటించింది. ఇక, ఈ మూవీ త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రావడానికి రెడీ అయ్యింది. ఈ మూవీ నుంచి ఇటీవల మిల్కీ బ్యూటీ అనే పాట విడుదల చేశారు. అందులో తమన్నా అందాల కు అందరూ మెస్మరైజ్ అయిపోయారు.




## పొట్టి నిక్కరులో.. కూల్ గా సమంత గూఫీ డ్యాన్స్





స్టార్ హీరోయిన్ సమంత ప్రస్తుతం ఫుల్ జోష్ లో ఉంది. ఇటీవలే విజయ్ దేవరకొండతో 'ఖుషి', అలాగే 'సిటాడెల్' ఇండియన్ వెర్షన్ వెబ్‌సిరీస్ చిత్రీకరణలు కంప్లీట్ చేసింది. ఇక ఆమె సంవత్సరం పాటు సినిమాలకు బ్రేక్ ఇవ్వనుందంటూ గత కొద్ది రోజులుగా ప్రచారం సాగుతోంది. ఈ ముద్దుగుమ్మ తన మయోసైటిస్ రోగం నుంచి పూర్తిగా కోలుకోవడానికి విదేశాలకు వెళ్లే అవకాశం ఉందని అంతా మాట్లాడుకుంటున్నారు. కానీ ఆమె మాత్రం వెకేషన్? ట్రిప్ అంటూ ఫుల్ గా చిల్ కొడుతూ ఎంజాయ్ చేస్తోంది. తాజాగా తన వెకేషన్ ట్రిప్ లో భాగంగా అదిరిపోయే డ్యాన్స్ వీడియోను షేర్ చేసింది. కోయంబత్తూర్ ఇషా ఫౌండేషన్? వెళ్లడంతో తన వెకేషన్ ట్రిప్?ను ప్రారంభించిన సామ్.. ఆ తర్వాత ఆలయాలను కూడా సందర్శించి ప్రత్యేక పూజలను చేయించింది. అలానే మరిన్ని ప్రదేశాలకు వెళ్లి.. తన ఫ్రెండ్ అనూషతో కలిసి సమయాన్ని గడుపుతూ లైఫ్ ను ఆస్వాదిస్తోంది. వాటికి సంబంధించిన ఫొటోలు, వీడియోలను ఇన్?స్టాగ్రామ్?లో అభిమానులతో షేర్ చేస్తోంది. అలా అక్కడి ప్రకృతి అందాలను, మనసును తాకే ప్రదేశాలను చుట్టేస్తూ, ఆస్వాదిస్తూ బాగా ఎంజాయ్? చేస్తోంది. రీసెంట్ గా ఈ ముద్దుగుమ్మ ఐస్ బాట్? టబ్? అంటూ ఓ వీడియోను కూడా షేర్ చేసింది. 'ఐస్ బాత్స్.. ఫోర్ డిగ్రీస్.. సిక్స్ మినిట్స్' అంటూ.. ఆరు నిమిషాల పాటు చల్లని నీళ్లలో కఠినంగా కూర్చొని పెద్ద సాహసమే చేసింది. అయితే ఇదొక ఐస్ థెరపీ అని తెలిసింది. అలా తన ట్రిప్ లో భాగంగా ఇండోనేషియాలోని బాలి ప్రదేశానికి వెళ్లిన ఈ ముద్దుగుమ్మ.. తాజాగా అక్కడ తన ఫ్రెండ్ తో కలిసి ఓ స్పెషల్ డ్యాన్స్ చేస్తున్న వీడియోను అభిమానులతో షేర్ చేసుకుంది. గ్రుపో రఫగా బ్యాండ్ సమకూర్చిన మెంటిరోసా మ్యూజిక్ అంట ఇది. ఈ మ్యూజిక్ కు తన స్నేహితురాలు అనూషతో కలిసి గూఫి డ్యాన్స్ స్టెప్పులు వేసింది. ఇందులో సమంత జీన్ చడ్డీ, వైట్ టాప్ లో ఎంతో క్యూట్ గా కనిపించింది. అలానే అంతే క్యూట్ గా సింపుల్ గా చిందులేసింది. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో తెగ చక్కర్లు కొడుతోంది. ఇకపోతే రీసెంట్ గా సమంత నటించిన 'ఖుషి' సినిమా రిలీజ్ కు రెడీ అయింది. విజయ్ దేవరకొండ హీరోగా నటించారు. ఈ చిత్రానికి శివ నిర్వాణ దర్శకత్వం వహించారు. ఇప్పటికే విడుదలైన పాటలు సోషల్ మీడియాలో సెన్సేషన్ క్రియేట్ చేశాయి. ఈ పాటలు వింటుంటే సినిమా మ్యూజికల్ హిట్ పక్కా అనిపిస్తోంది. ఈ చిత్రం సెప్టెంబర్ 1న రిలీజ్ కానుంది.

## 22 ఏళ్ల తరువాత సీక్వెల్.. ట్రైలర్ ఎలా ఉందంటే..




2001లో రిలీజై, బాక్సాఫీసు వద్ద అత్యధిక వసూళ్లను సాధించిన సినిమా 'గదర్: ఏక్ ప్రేమ్ కథ'. ఇప్పుడీ సినిమా కు కొనసాగింపుగా 22ఏళ్ల తర్వాత వచ్చిన చిత్రం 'గదర్ 2'. బాలీవుడ్ స్టార్ యాక్టర్ సన్నీ దేవోల్, అమీషా పటేల్ ప్రధాన పాత్రలు పోషించారు. అనిల్ శర్మ దర్శకత్వం వహించారు. తాజాగా ఈ చిత్ర ట్రైలర్ విడుదలై ఆకట్టుకుంటోంది. పవర్ ఫుల్ యాక్షన్ ప్యాక్డ్ గా సినిమా ప్రచార చిత్రాన్ని తీర్చిదిద్దారు. 'తారా సింగ్(సన్నీ దేవోల్) ను మీకు తెలీదా?.. శత్రువుల ను అడగండి ఎవరనేది చెబుతారు? అంటూ ఫైటింగ్ సీన్స్ తో ప్రారంభమైన ఈ ట్రైలర్ లో సన్నిదేవోల్ తన యాక్షన్ తో అదరగొట్టేశారు . ఇక అమీషా పటేల్, సన్నీదేవోల్ లవ్ అండ్ ఎమోషనల్ సీన్స్ కూడా ఆకట్టుకునేలా ఉన్నాయి. ప్రచార చిత్రం లో చూపించిన సాంగ్ కూడా బాగుంది. బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్ కూడా ఆకట్టుకుంటోంది. పాకిస్థాన్ ఆర్మీ చేతి లో బంధించబడిన తన కొడుకును కాపాడి తీసుకొస్తానని అమీషా పటేల్ కు మాట ఇచ్చిన సన్నీదేవోల్, అక్కడి సాయుధ బలగాలతో ఎలా పోరాడాడు అనే సన్నివేశాల ను పవర్ ఫుల్ గా తెరకెక్కించారు. సన్నీదేవోల్ పవర్ ఫుల్ డైలాగ్ లు చెప్పి అదరగొట్టేశారు. మరి కొడుకును ప్రాణాలతో తీసుకొస్తానని అమీషా పటేల్ కు మాటిచ్చి అక్కడికి వెళ్ళిన సన్నీ దేవోల్.. వాళ్లతో ఎలా తడపడ్డాడు, వారిని ఎలా ఎదురించాడు, పాక్ చెర నుంచి కొడుకును ఎలా బయట కు తీసుకొచ్చాడు అనేది తెలియాలంటే తెరపై చూడాల్సిందే. కాగా, దర్శకుడు అనిల్ శర్మ కుమారుడు ఉత్కర్షే.. సన్నీదేవోల్ కొడుకు పాత్ర పోషించాడు. అతడి నటన కూడా ఇంటెన్సివ్ గా ఉంది. మొత్తంగా.. అతడు(సన్నీ దేవోల్) తన కుటుంబం కోసం, దేశం కోసం పోరాడే యోధుడు అంటూ ప్రచార చిత్రాన్ని ముగించారు. అనిల్ శర్మ ప్రొడక్షన్స్, జీ స్టూడియోస్ సంయుక్తంగా చిత్రాన్ని నిర్మించాయి. 1971లో ఇండో–పాక్ యుద్ధ నేపథ్యంలో తెరకెక్కిన ఈ సినిమా ఆగస్టు 11న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇక ఈ చిత్రానికి పోటీగా అక్షయ్ కుమార్ ఓమైగాడ్ 2 కూడా ఇండిపెండెన్స్ డేన విడుదల కు రెడీ అయింది. కానీ సెన్సార్ సమస్యలను ఎదుర్కొంటోంది. ఇకపోతే అమీషా పటేల్ టాలీవుడ్‌కు తెలిసిన నటే. పవన్ కల్యాణ్ హీరోగా వచ్చిన బద్రితో తెలుగు ఆడియన్స్‌ను పలకరించింది. ఆ తర్వాత మహేశ్‌బాబు నాని, ఎన్టీఆర్ నరసింహుడు, బాలకృష్ణ పరమ వీర చక్రలో నటించింది. ఆ తర్వాత టాలీవుడ్ కు దూరమైన ఈ భామ.. ప్రస్తుతం బాలీవుడ్‌లో చిత్రాలు చేస్తోంది.

## దుల్కర్-అమల్ సూఫియా ఇంట్రెస్టింగ్ లవ్ స్టోరీ!

దుల్కర్ సల్మాన్–అమల్ సూఫియా ప్రేమించి పెళ్లి చేసుకున్న సంగతి తెలిసిందే. కానీ వీళ్లిద్దరు ఒకే స్కూల్లో చదువుకున్నారు? అని ఎంత మందికి తెలుసు. అవును దుల్కర్–అమల సూఫియా పెళ్లి కూడా ఇంట్రెస్టింగ్ గానే అనిపిస్తోంది. ఇద్దరు చిన్నప్పటి నుంచి తెలుసు. ఒకే స్కూల్లో చదువుకున్నారు. అయితే క్లాస్ మేట్స్ కాదు. దుల్కర్ కంటే అమల్ సూఫియా ఐదేళ్లు చిన్నది. దుల్కర్ ఇంటర్మీడియట్ చదువుతుంటే...అమల్ సూఫియా 7వతరగితి చదివేదిట. ఆ వయసులో అమల్ సూఫియాని చూసి ఇంత చిన్న పిల్లా అని అనుకునేవాడుట. కట్ చేస్తే ఆ చిన్న పిల్లే తన భార్య అయిందంటున్నాడు. దుల్కర్ కి పెళ్లి వయసు రావడంతో ఇంట్లో పెళ్లి సంబంధాలు గురించి నిత్యం చర్చ జరిగేదిట. వారి ఆలోచనలకు విరుద్దంగా దుల్కర్



ఆలోచించే వాడుట. అలాగని పెద్దలు చూసిన ఏ అమ్మాయి అంగీకరించింది లేదు..తిరస్కరించనులేదు. వాళ్ల మనోభావాలు దెబ్బ తీయకుండా నడుడచుకున్నాడుట. అప్పటికే దుల్కర్ వీణ చెన్నై లో మ్రోగుతుందిట. అమల్ సూఫియా చెన్నైలో ఉండేదిట. ఆ సమయంలో రెండు వారాల పాటు ఆమెతో ఉన్నట్లు చెప్పుకొచ్చాడు. అయితే ఈ కలయిక చాలా యాదృశ్చికంగా జరిగిందిట. అనుకోకుండా కొంత మంది స్నేహితులు థియేటర్ వద్దా..సెలూన్ వద్ద కలిసినట్లే అమల్ సూఫియా కూడా ఫేస్ బుక్ ద్వారా టచ్ లోకి కలిసిందిట. ఆతర్వాత తొలిసారి ఇద్దరు కాఫీ కోసం కలుద్దాం అని చెన్నైలో మీట్ అయ్యారుట. అయితే ఈ స్టోరీ అంతా దుల్కార్ తల్లిదండ్రులకు తెలుసుట. తాను అన్ని చెప్పే చేసినట్లు తెలిపాడు. కాఫీ కోసం కలవడం సంగతి కూడా ఇంట్లో ముందుగానే చెప్పి చేసాడుట. ఆ సమయంలో కేవలం స్నేహితులుగానే కలుస్తున్నాం..అలాగే ఉంటామని చెప్పాడుట. ఆ కాఫీ డే ముగిసిన మరుసటి రోజూ అమల్ సూఫియాని మళ్లీ కలిసాడుట. అలా కలవడం కోసం చెన్నై నుంచి పాండిచ్చేరి వెళ్లాడు. అప్పుడు అమల్ సూఫియా పాండిచ్చేరిలో ఉందిట. అదే నా భార్యతో మొదటి డేట్ అంటూ చెప్పుకొచ్చాడు. చెన్నై నుంచి పాండిచ్చేరికి గంటన్నర్ లో డ్రైవ్ చేసి వెళ్లినట్లు తెలిపాడు. అక్కడ దాదాపు నాలుగు గంటలు పాటు మాట్లాడుకున్నట్లు జీవితంలో ఆ మధుర జ్ఞాపకాలు ఎప్పటికీ పదిలం అంటున్నాడు.

## టాలీవుడ్ కి మరో తెలుగమ్మాయి ప్రణవి!

యూ ట్యూబర్ వైష్ణవి 'బేబి' సక్సెస్ తో మరోసారి తెలుగమ్మాయిల అంశం నెట్టింట చర్చకొస్తుంది. సినిమా సక్సెస్ లో భాగంగా ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ తెలుగు అమ్మాయిలు టాలీవుడ్ కి రావాలి..మేమున్నాం ..సహకరిస్తాం అంటూ భరోసా కల్పిస్తూ ఆయన చేసిన వ్యాఖ్యలు ఆసక్తికరంగా మారిన సంగతి తెలిసిందే. ఇలా ఓ స్టార్ హీరో తెలుగు అమ్మాయిల్ని ఉద్దేశించి మాట్లాడటం అన్నది చరిత్రలో ఇదే తొలిసారి. టాలీవుడ్ లో చాలా మంది స్టార్ హీరోలున్నారు. కానీ వాళ్లెవ్వరు తెలుగు అమ్మాయిల్ని ప్రోత్సహిస్తూ ఇలా మాట్లాడింది ఎక్కడా లేదు. తెలుగు నటుల్ని ఎంకరేజ్ చేసింది కూడా లేదు. అలాంటి తరుణంలో బన్నీ వ్యాఖ్యలు తెలుగు అమ్మాయిల్లో కొండంత అండగా నిలిచాయి. పరిశ్రమకి రావాలి అన్న ఓ ఉత్సాహాన్ని కల్పించాయి. మరి మన దర్శక–నిర్మాతలు–హీరోలు తెలుగు అమ్మాయిలకు ఎలాంటి అవకాశాలు కల్పిస్తారో వేచి చూడాలి. తాజాగా బ్రహ్మాజీ తనయుడు సంజయ్ రావు నటిస్తోన్న 'స్లమ్ డాగ్ హస్బెండ్' సినిమాతో మరో తెలుగమ్మాయి ప్రణవి మానుకోండ హీరోయిన్ గా పరిచయమవుతోంది. ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది.



ఈ సందర్భంగా తన డెబ్యూని ఉద్దేశించి ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. ' తెలుగమ్మాయిని కావడమే నాకున్న బలం. తెలుగుదనం ఉట్టిపడేలా తెరపై కనిపించాలన్నా.. ఆ పాత్రలకు తగ్గట్టు నటనలో సహజత్వం కనిపించాలన్నా అది మనకు మాత్రమే సాధ్యం. చిన్ననాటి నుంచి సినిమాలంటే ఇష్టం. అనుష్క నటించిన 'అరుంధతి' లో డైలాగులు అద్దం ముందు నుంచుని ప్రాక్టీస్ చేసే దాన్ని. నటన అంటే అమ్మకి కూడా చాలా ఇష్టం. వాళ్ల ప్రోత్సాహం వల్లే ఇక్కడి వరకూ రాగలిగాను. చిన్న నాటి నుంచి ఆడిషన్స్ ఇవ్వడం మొదలు పెట్టాను. 'రోటీన్ లవ్ స్టోరీ'..'ఉయ్యాల జంపాల' తో గుర్తింపు వచ్చింది. చైల్డ్ ఆర్టిస్ట్‌గా మంచి ఆఫర్లు వచ్చాయి. సీరియల్స్‌లోనూ లీడ్‌గా చేశాను. కానీ నాకు సినిమాలంటే ఇష్టం. అందుకే ఇటు వైపు వచ్చాను. కళ్యాణ్ రామ్ గారి 'అమిగోస్'లోనూ నటించాను. నేను చేసిన రీల్స్ ద్వారా అవకాశాలు వచ్చాయి. ఈ సినిమాలో సినిమాలో మౌనిక అనే యువతి పాత్రలో నటించా. తన పెళ్లి ఎలా జరిగింది. తన భర్త కథేమిటి? అన్నది తెరపైనే చూడాలంటోంది. ఎంతగా నవ్విస్తుందో? అదే స్థాయిలో భావోద్వేగాల్ని పంచే కథ ఇది' అని అంది.



# నిజామాబాద్ ఐటీ హబ్‌లో 'కంపెనీ'ని స్థాపించండి : ఎమ్మెల్సీ కవిత

హైదరాబాద్ : త్వరలో ప్రారంభం కానున్న నిజామాబాద్ ఐటీ హబ్‌లో కంపెనీని స్థాపించాలని అంతర్జాతీయంగా పేరొందిన ప్రముఖ హిటాచీ గ్రూపు సబ్సిడరీ సంస్థ గ్లోబల్ లాజిక్‌ను ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విజ్ఞప్తి చేశారు. సోమవారం ఆ సంస్థ వైస్ ప్రెసిడెంట్ గురు కమకొలను, కంటెంట్ ఇంజినీరింగ్ విభాగం వైస్ ప్రెసిడెంట్ కృష్ణ మోహన్ వీరవల్లి ఎమ్మెల్సీ కవితతో హైదరాబాద్ లో భేటీ అయ్యారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు బాజీరెడ్డి గొవర్ధన్, షకీల్ కూడా పాల్గొన్నారు. నిజామాబాద్ ఐటీ హబ్ గురించి సుదీర్ఘంగా చర్చించారు. అక్కడి రవాణా, నీరు, విద్యుత్తు వంటి సౌకర్యాలతో పాటు శాంతి భద్రత గురించి కంపెనీ ప్రతినిధులకు కవిత వివరించారు. రవాణా సౌకర్యం విషయంలో ఆర్టీసీ బస్సులను ఐటీ హబ్ వరకు వేయించడానికి కృషి చేస్తానని బాజిరెడ్డి గోవర్ధన్ స్పష్టం చేశారు. నిజామాబాద్ లో తాము కల్పించే ఉద్యోగాల్లో మహిళలకు పెద్దపీట వేస్తామని కంపెనీ ప్రతినిధులు తెలిపారు. భవిష్యత్తులో కంపెనీని తెలంగాణలోని ఇతర ప్రాంతాలకు విస్తరిస్తామని పేర్కొన్నారు. మంగళవారం కంపెనీ ప్రతినిధులు నిజామాబాద్ ఐటీ హబ్ ను సందర్శించనున్నారు. అమెరికాలోని కాలిఫోర్నియాలో ప్రధాన కార్యాలయం కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న గ్లోబల్ లాజిక్ సంస్థకు హైదరాబాద్ లో రెండు క్యాంపస్ లు ఉన్నాయి. గచ్చిబౌలి, జూబ్లీహిల్స్ లో వారి కంపెనీలో ప్రస్తుతం దాదాపు 3 వేల మంది పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ%% ఐటీ హబ్ లో కంపెనీని ఏర్పాటు చేయాలని తాను చేసిన విజ్ఞప్తికి గ్లోబల్ లాజిక్ కంపెనీ ప్రతినిధులు సానుకూలంగా స్పందించడం సంతోషంగా ఉందని చెప్పారు. యువతకు స్థానికంగానే ఉద్యోగావకాలు కల్పించాలనే ఉద్దేశంతో సీఎం కేసీఆర్, ఐటీ మంత్రి కేటీఆర్ అన్ని జిల్లాల్లో ఐటీ హబ్ లను ఏర్పాటు చేయాలన్న ఆలోచన చేసి అమలు చేస్తున్నారని తెలిపారు. కేసీఆర్ దార్శనికతకు ఇదే నిదర్శనమని ఎమ్మెల్సీ కవిత స్పష్టం చేశారు. ఐటీ హబ్ లో ఏర్పాటు చేయబోయే కంపెనీలకు అన్ని సౌకర్యాలను కల్పించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. భవిష్యత్తులో నిజామాబాద్ లో మరిన్ని కంపెనీలు ఏర్పాటు అవుతాయని ఎమ్మెల్సీ కవిత చెప్పారు. స్థానిక యువత ఈ అవకాశాలను ఉపయోగించుకోవాలని కవిత కోరారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ సెల్ గ్లోబల్ కోఆర్డినేటర్ మహేశ్ బిగాల గుప్తా కూడా పాల్గొన్నారు.



# ఏటూరునాగారంలో విషాదం.. కళ్లెదుటే వరదలో ఇల్లు కొట్టుకుపోవడం చూసి తట్టుకోలేక..

ములుగు : రాష్ట్రాన్ని వరదలు ఎంతలా చుట్టుముట్టేశాయో.. ఎంతటి బీభత్సం సృష్టించాయో తెలిసిందే. ఎప్పుడూ లేని ప్రాంతాల్లో సైతం వరదలు ముంచెత్తడంతో ఆస్తి నష్టం, ప్రాణ నష్టం భారీగానే జరిగింది. నేడు ఏటూరునాగారం మండలం కొండాయిలో విషాదం చోటు చేసుకుంది.

గుండెపోటుతో కోగిల బాబు అనే వరద బాధితుడు మృతి చెందాడు. కళ్లెదుటే వరదలో కొట్టుకు పోయిన ఇంటిని చూసి కోగిల బాబు తట్టుకోలేకపోయాడు. దీంతో అతనికి గుండెపోటు వచ్చింది. క్షణాల్లో అందరూ చూస్తుండగానే కోగిల బాబు మృత్యుఒడికి చేరిపోయాడు. దీంతో కొండాయిలో తీవ్ర విషాదం చోటు చేసుకుంది.

**8 మందిని మింగేసిన భయం..** ఏటూరునాగారం మండలంలోని ఏజెన్సీ గ్రామమైన కొండాయిని పెద్ద ఎత్తున వరద ముంచెత్తింది. బీభత్సంగా కురిసిన వర్షాలకు గ్రామ సమీపంలోని జంపన్నవాగు ఉప్పొంగింది. వరద గ్రామంలోకి చేరుకోవడంతో భయపడిపోయిన గ్రామ వాసులు ఊరు ఎక్కడ మునిగిపోతుందోనన్న భయంతో సురక్షిత ప్రాంతాలకు బయలుదేరారు. కానీ మధ్యలోనే నీటిలో మునిగిపోయారు. ఎనిమిది మంది కొండాయి వాసులు నీటిలో కొట్టుకుపోయి మృతి చెందారు. ఈ విషాదం గ్రామస్తులను వెంటాడుతుండగానే నేడు మరో వ్యక్తి గుండెపోటుతో మరణించడం వారిని మరింత కలవరపెడుతోంది.

# ప్రాజెక్టులు, చెక్ డ్యాములకు బీజేపీ వ్యతిరేకం కాదు..




నిర్మల్ జిల్లా: సీఎం కేసీఆర్ నిర్లక్ష్య ధోరణి, అనాలోచిత నిర్ణయాలతోనే రాష్ట్రంలో చిన్నపాటి వర్షాలకే వరదలు వస్తున్నాయని, వరదల కారణంగా పొలాల్లో ఇసుక మేటలు వేయడంతో పంటలకు పనికి రాకుండా పోయాయని బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ తీవ్రస్థాయిలో విమర్శించారు. సోమవారం నిర్మల్ జిల్లా కేంద్రంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ... బీజేపీ ప్రాజెక్టులకు, చెక్ డ్యాములకు వ్యతిరేకం కాదని, కడెం ప్రాజెక్టుకు మరిన్ని గేట్లు బిగించాలని నిపుణుల కమిటీ సూచించినా ప్రభుత్వం పట్టించుకోలేదని ఆరోపించారు. నష్టపోయిన రైతుల కోసం కేంద్ర ప్రభుత్వం ఫసల్ బీమా యోజన పథకం ప్రవేశపెట్టినా.. రాష్ట్ర వాటా ఇవ్వకపోవడంతో అమలు కావడం లేదని ఈటల రాజేందర్ అన్నారు. గోదావరి, ప్రాణహిత, మానేరులతోపాటు వరదలు వచ్చే వాగులకు కరకట్టలు నిర్మించాలన్నారు. గత మూడు నాలుగు వర్షాల కారణంగా గోదావరి పరివాహక ప్రాంతాలన్నీ అస్తవ్యస్తంగా మారాయన్నారు.

వరదల్లో ఇళ్లు కోల్పోయిన బాధితులకు ప్రభుత్వం రూ.5 లక్షల ఎక్స్ గ్రేషియా చెల్లించాలని, వరదల కారణంగా నష్టపోయిన బాధితులకు తక్షణ సహాయం కింద రూ. 25 వేల పరిహారం అందించాలని ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు.

# శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు పెరిగిన వరద ప్రవాహం.. 16 గేట్లు ఎత్తివేత



**నిజామాబాద్ : జిల్లాలోని శ్రీరాం సాగర్ ప్రాజెక్టుకు మళ్లీ వరద ప్రవాహం పెరిగింది. దీంతో ప్రాజెక్టు 16 గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు ఇన్‌ఫ్లో 52,548 క్యూసెక్కులు ఉండగా, ఔట్ ఫ్లో 52,548 క్యూసెక్కులుగా ఉంది. ప్రాజెక్టు ప్రస్తుత నీటిమట్టం 1,090 అడుగులు కాగా, పూర్తిస్థాయి నీటిమట్టం 1,091 అడుగులుగా ఉంది. ప్రస్తుత నీటి నిల్వ సామర్థ్యం 84.81 టీఎంసీలు, పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 90 టీఎంసీలు.**

# అసైన్డ్ భూములు లాక్కొని ప్రభుత్వమే వ్యాపారం చేయడం దుర్మార్గం: ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



హైదరాబాద్: రాష్ట్రంలో 30 వేల ఎకరాల పేదల అసైన్డ్ భూములను బలవంతంగా లాక్కొని రాష్ట్ర ప్రభుత్వమే రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయడం దుర్మార్గమని బీఎస్పీ రాష్ట్ర సమన్వయకర్త ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆక్షేపించారు. హెచ్ఎండీఏ పరిధిలో అసైన్డ్ భూముల ఆక్రమణలపై హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో ఆయన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఎన్నికల ప్రచార లోగోను ఆవిష్కరించారు. ధరణి పోర్టల్ – ప్రభుత్వ భూముల ఆక్రమణలపై ఘాటుగా స్పందించారు. "బహుజనవాదిననే ముసుగులో సీఎం కేసీఆర్ దళితులను పదేళ్ల నుంచి మోసం చేస్తున్నారు. పేదల అసైన్డ్ భూముల్లో శ్మశానవాటికలు, పల్లె ప్రకృతి వనాలు కడుతున్నారు. బీఎస్పీ అధికారంలోకి రాగానే అసైన్డ్ భూములకు పట్టాలు ఇవ్వడంతో పాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల దగ్గర ప్రభుత్వం గుంజుకున్న అసైన్డ్ భూములను తిరిగి రైతులకు పంచుతాం. ఈ వ్యవహారంపై హైకోర్టును ఆశ్రయిస్తాం. నగరంలో ఇళ్ల స్థలాలకు ఎల్ఆర్ఎస్ కట్టించుకుని రెగ్యులరైజ్ చేస్తున్న తరహాలోనే అసైన్డ్ భూములను క్రమబద్ధీకరించాలి. స్పెషల్ పోలీస్ బెటాలియన్ కానిస్టేబుల్ ఉద్యోగులకు తీవ్ర అన్యాయం చేసే జీవో నెం 46ను తక్షణమే సవరించాలి" అని ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు.

# మత్స్య సంపదను పెంచిన ఘనత సీఎం కేసీఆర్‌దే : మంత్రి తలసాని



హైదరాబాద్ : రాష్ట్రం ఆవిర్భావానికి ముందు తెలంగాణ ప్రాంతంలో మత్స్య రంగం పూర్తి నిరాదరణ కు గురైందని, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో మత్స్య రంగం ఎంతో అభివృద్ధి సాధించిందని తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. రాష్ట్ర మత్స్య సహకార సంఘాల సమాఖ్య వైస్ చైర్మన్‌గా నియమితులైన దీటి మల్లయ్య గంగపుత్ర సోమవారం మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను డాక్టర్ BR అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఉచిత చేప పిల్లల పంపిణీ కార్యక్రమంతో రాష్ట్రంలో మత్స్య సంపద గణనీయంగా పెరిగిందని చెప్పారు. మత్స్యకారులకు అదనపు ఆదాయ వనరుగా మారాలనే ఆలోచనతోనే ఉచితంగా రొయ్య పిల్లలను కూడా పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. చెరువులపై మత్స్యకారులకు పూర్తి హక్కులు కల్పించిన ఘనత కూడా తెలంగాణ ప్రభుత్వానికే దక్కుతుందని చెప్పారు. కాగా, మత్స్య సహకార సంఘాల సమాఖ్య చైర్మన్ గా పిట్టల రవిందర్ ముదిరాజ్ ను, వైస్ చైర్మన్ గా దీటి మల్లయ్య గంగ పుత్రలను సీఎం కేసీఆర్ నియమించారు. వీరిలో చైర్మన్ గా పిట్టల రవిందర్ ముదిరాజ్ బాధ్యతలను చేపట్టగా, వైస్ చైర్మన్ గా మల్లయ్య గంగపుత్ర ఆగస్టు 25 వ తేదీన బాధ్యతలను చేపట్టనున్నారు. ప్రమాణ స్వీకారానికి సంబంధించిన ఏర్పాట్లను పర్యవేక్షించాలని అక్కడే ఉన్న మత్స్య శాఖ కమిషనర్ లచ్చిరాం భూక్యా, స్పెషల్ చీఫ్ సెక్రెటరీ అధర్ సిన్హా లను మంత్రి ఆదేశించారు.

# రాముడిని కూడా కేసీఆర్ మోసం చేశారు... అందుకే



హైదరాబాద్: భారీ వర్షాలు వస్తాయని ముందే హెచ్చరించినా ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టలేదని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క విమర్శలు గుప్పించారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. వర్షాలు, ప్రకృతి వైపరీత్యాలు మన చేతిలో లేనప్పటికీ వాటిని ముందే పసిగట్టి ప్రజలను జాగ్రత్త పరిచే అవకాశం ఉందన్నారు. వర్షాల వల్ల జరిగిన నష్టానికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ వచ్చాక ఇరిగేషన్ ప్రాజెక్టులు సాంకేతికతతో కాకుండా రాజకీయ, ఆర్థిక అవసరాల కోసం కట్టారని మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు ఇంజనీర్ కేసీఆరే అని అన్నారు. కేసీఆర్ రాత్రి పూట డిజైన్ చేసి మూడు చెక్ డ్యాంలకు ప్లాన్ గీశారని.. అడ్డగోలుగా చెక్ డ్యాంలు కట్టడం వల్లే ఇంత ప్రమాదం జరుగుతోందన్నారు. రాజకీయ అవసరాల కోసం పక్క రాష్ట్రాలకు ప్రత్యేక విమానాలు పంపి, నాయకులను రప్పించుకొని కండువాలు కప్పుతారని యెద్దేవా చేశారు. రాష్ట్ర ప్రజలు ఇబ్బందుల్లో ఉన్నారని.. ఒక హెలికాప్టర్ ఇవ్వండి అంటే మాత్రం స్పందించరన్నారు. కేసీఆర్ అనాలోచిత డిజైన్ వల్ల ప్రజలు మునిగిపోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వరద ప్రాంతాలకు అధికారులను పంపి నష్టాన్ని అంచనా వేయాలన్నారు. ప్రజలను మోసం చేయడం కేసీఆర్‌కు అలవాటు అయిందన్నారు. కేసీఆర్ రాముడిని కూడా మోసం చేశారన్నారు. మోసం చేస్తున్న కేసీఆర్‌ను గద్దె దించేలా చూడమని రాముడ్ని మొక్కుతున్నానని అన్నారు. నష్టపోయిన ప్రజలకు వెంటనే నష్టపరిహారం అందించాలని భట్టి విక్రమార్క డిమాండ్ చేశారు.

# జేపీ నడ్డాకు ధన్యవాదాలు తెలిపిన బండి సంజయ్



న్యూఢిల్లీ: బీజేపీ జాతీయ అధ్యక్షులు జేపీ నడ్డాతో బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ సోమవారం భేటీ అయ్యారు. జాతీయ ప్రధాన కార్యదర్శిగా అవకాశమిచ్చినందుకు జేపీకి బండి సంజయ్ ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా జేపీ నడ్డాకు కండువా కప్పి సన్మానించారు. పార్టీ నూతన జాతీయ ప్రధానకార్యదర్శి రాధామోహన్ అగర్వాల్‌తో కలిసి 15 నిమిషాల పాటు నడ్డాతో బండి సమావేశమయ్యారు. జాతీయ నాయకత్వం ఆదేశాల ప్రకారం పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని ఈసందర్భంగా బండి వెల్లడించారు. కేంద్రంలో మూడోసారి బీజేపీ అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యమన్నారు. బీజేపీ హైకమాండ్ ఏ బాధ్యతలు అప్పగించినా నిర్వర్తించేందుకు సిద్ధమని ఆపార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ స్పష్టం చేశారు.

# ఎంపీ సోయం బాపూరావు వ్యాఖ్యలు ఆయన వ్యక్తిగతం: కిషన్‌రెడ్డి

హైదరాబాద్: తెలంగాణలో వరదలతో జనం అల్లాడుతుంటే ప్రభుత్వం ఎందుకు నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తోందని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రశ్నించారు. విపత్తు వేళ ఆదుకునేందుకు రాష్ట్రం వద్ద రూ.900కోట్లకుపైగా కేంద్రం డిపాజిట్లు ఉన్నాయని.. అయినా తాత్కాలిక సాయం కూడా అందించలేకపోయారని విమర్శించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్యేలు సంజీవరావు, శ్రీదేవిలు కిషన్‌రెడ్డి సమక్షంలో భాజపాలో చేరారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్, భారాస, మజ్లిస్ పార్టీలు ఒకే తాను ముక్కలని కిషన్‌రెడ్డి విమర్శించారు. అవినీతి, కుటుంబ పార్టీలకు ప్రజలే బుద్ధి చెప్పాలని కోరారు. వరదల వేళ ప్రజలను ఆదుకోవడంలో కేసీఆర్ ప్రభుత్వం విఫలమైందన్నారు. గిరిజన రిజర్వేషన్లపై ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావు వ్యాఖ్యలు ఆయన వ్యక్తిగతమని.. వాటితో పార్టీకి ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. అధికారంలోకి రాగానే లంబాడీలకు భాజపా ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. తొమ్మిదేళ్ల భారాస పాలనలో గిరిజనులకు అన్యాయం జరిగిందని విమర్శించారు. జనాభా ప్రాతిపదికన గిరిజన రిజర్వేషన్లు పెంచాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో సమష్టిగా పనిచేసి భారాసను ఓడిస్తామని కిషన్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

# నిజామాబాద్ బీజేపీలో అసంతృప్త జ్వాలలు..ఎంపీ అర్వింద్‌కు వ్యతిరేకంగా పెరుగుతున్న ఆందోళనలు




నిజామాబాద్ : తెలంగాణలో బీజేపీ పరిస్థితి దారుణంగా తయారైంది. మరీ ముఖ్యంగా జిల్లా బీజేపీ పార్టీలో రోజురోజుకు అంతర్గత పోరు ముదురుతోంది. కాషాయ పార్టీలో గతంలో లేనంతగా అసంతృప్త నేతలు ఒక్కొక్కరుగా బయటపడుతున్నారు. గత వారం 13 మండలాల బీజేపీ అధ్యక్షులను అర్వింద్ ఏకపక్షంగా మార్చడంపై ఫిర్యాదు చేసేందుకు పలువురు కార్యకర్తలు, మండల నాయకులు హైదరాబాద్ వెళ్లి బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో సొంత పార్టీ నేతలే ఆందోళనకు దిగారు. వారిని సముదాయించేదుకు ఆ పార్టీ నేతలకు తల ప్రాణం తోకకు వచ్చినట్లయింది. ఆ వేడి చల్లారక ముందే తాజాగా ఎంపీ అర్వింద్ ఒంటెద్దు పోకడలు నిరసిస్తూ గత వారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆందోళన చేసిన జిల్లా కార్యవర్గ సభ్యులు.. నేడు పార్టీ జిల్లా కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు.

సేవ్ బీజేపీ పేరిట ఫ్లకార్డులు ప్రదర్శించారు. అర్వింద్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సొంత పార్టీ నేతలే ఆందోళనకు దిగడంతో అర్వింద్ కు షాక్ తగిలింది. ఈ క్రమంలో పార్టీ నాయకుల తీరు అధిష్టానానికి తలనొప్పిగా మారింది. ఏం చేయాలో పాలుపోక తలలు పట్టుకుంటున్నారు.

# ముందస్తు చర్యల్లో సర్కార్ విఫలం.. అందుకే భారీ నష్టం

హైదరాబాద్: వరదలతో నష్టపోయిన వారిని ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని తెలంగాణ టీడీపీ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ విమర్శలు గుప్పించారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ... వరదలతో ఆస్తి నష్టం ఎక్కువగా జరిగిందని.. వరంగల్ జిల్లాలో ఎక్కువ నష్టం జరిగిందని అన్నారు. పంట నష్టం జరిగిన రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సర్కార్ ముందస్తు చర్యలు తీసుకోకపోవడం వల్లే ఈ భారీ నష్టం కలిగిందన్నారు. చనిపోయిన కుటుంబానికి రూ.25 లక్షల నష్ట పరిహారం, ఎకరానికి రూ.20 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. టీడీపీ తరపున వరద ప్రాంతాల్లో దుప్పట్లు.. నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తామన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో వరద బాధితులకు రూ.10 వేల హామీ ఏమైందని ప్రశ్నించారు. సకాలంలో రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవటం వలనే ప్రాణ నష్టం జరిగిందని కాసాని జ్ఞానేశ్వర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.



Printed, Published and owned by VISHWANATH V, Printed at Ratan Graphics D.No. 2-3-703/7, Ameerpet, Hyderabad - 500013 Telangana State and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State. Editor : V. VISHWANATH, M.A. Journalism
Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : garudavartha@gmail.com